Pubilshed from Vijayawada
PRGI NO : APTEL/2011/41440

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు
Prajabhoomi Telugu Daily
www.prajabhoomi.com




విజయవాడ VIJAYAWADA | సంపుటి : 15 | సంచిక : 179 | శుక్రవారం | అక్టోబర్ 23, 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి | పేజీలు : 12 | వెల : 3 రూ
Vol.No : 15 | Issue No : 179 | Friday | 23 OCTOBER 2026 | Editor : Ankireddypalle Ramamohan Reddy | Pages 12 | Rs 3/-
Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana



## సిఎస్ సాయి ప్రసాద్ పదవీకాలం మరో 6 మాసాలు వరకు పొడిగింపు

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ పదవీ కాలాన్ని కేంద్ర ప్రభుత్వం మరో ఆరు మాసాలు పొడిగించింది.ఈమేరకు కేంద్ర ప్రభుత్వ సిబ్బంది,ప్రజా ఫిర్యాదులు మరియు పెన్షన్ల మంత్రిత్వ శాఖ, సిబ్బంది మరియు శిక్షణ విభాగం (డిఓపిటి)ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనల మేరకు కేంద్రం సిఎస్ పదవీ కాలాన్నిమ రోసారి ఆరు మాసాలకు అనగా 2027 మే 31 వరకూ పొడిగిస్తూ కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ మంత్రిత్వ శాఖ అండర్ సెక్రటరి రాజేశ్ కుమార్ యాదవ్ రాష్ట్ర సాధారణ పరిపాలన(పొలిటికల్) శాఖ ముఖ్య కార్యదర్శికి లేఖ ద్వారా తెలియజేశారు.

- మిగతా 2లో..

# నో కాన్వాయ్..

## సింగిల్‌గా చంద్రబాబు ఇంటికి పవన్

- ఇరువురు నేతల భేటీపై భిన్నాభిప్రాయాలు
- ఆసక్తి రేపుతున్న జనసేనాని చంద్రబాబు చర్చలు

ప్రజాభూమి ప్రతినిధి అమరావతి : రాష్ట్ర రాజకీయాల్లో ఊహించని, ఆసక్తికరమైన సన్నివేశం చోటుచేసుకుంది. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎలాంటి అధికారిక హంగు ఆర్భాటాలు లేకుండా అత్యంత సాధారణ వ్యక్తిలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నివాసానికి గురువారం ఉదయం చేరుకున్నారు. సైరన్ మోగించే కాన్వాయ్ గానీ, భద్రతా సిబ్బంది గానీ లేకుండా ఆయన నేరుగా సీఎం ఇంటికి వెళ్లడం అందరినీ ఆశ్చర్యపరిచింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్లపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసిన కొన్ని గంటల్లోనే ఈ భేటీ జరగడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్లు వేయలేకపోయిన వారికి మరో 48 గంటల సమయం ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి (ఎస్ఈసీ) సుప్రీంకోర్టు సూచించడమే ఈ ఆకస్మిక సమావేశానికి ప్రధాన కారణమన్న వాదన వినిపిస్తోంది .నేపథ్యంలో రాష్ట్రంలో 19 మున్సిపాలిటీలతో పాటు జరగబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ప్రక్రియపై ఎలాంటి ప్రభావం పడుతుందనే అంశంపై చంద్రబాబు, పవన్ లోతుగా చర్చించినట్లు తెలుస్తోంది.



న్యాయస్థానం ఆదేశాలను అమలు చేస్తూనే, ఈ పరిణామాన్ని అవకాశంగా తీసుకుని వైసీపీ చేసే రాజకీయ ప్రచారాన్ని ఎలా తిప్పికొట్టాలనే దానిపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా మంతనాలు జరిపినట్లు తెలుస్తోంది. ఈ భేటీలో ముఖ్యంగా పరిషత్ ఎన్నికలే ప్రధాన అజెండాగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల్లో టీడీపీ - జనసేన - బీజేపీ కూటమి అభ్యర్థుల మధ్య

వివరాలు 2లో..



## ఏపీలో ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. ఫస్టియర్ పరీక్షలు ఫిబ్రవరి 24 నుంచి మార్చి 15 వరకు, సెకండియర్ పరీక్షలు ఫిబ్రవరి 25 నుంచి మార్చి 16 వరకు జరగనున్నాయి. రెగ్యులర్, బ్యాక్‌లాగ్ విద్యార్థులకు రోజూ ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఈ పరీక్షలు జరుగుతాయని ఇంటర్ బోర్డు కార్యదర్శి పి.రంజిత్ బాషా తెలిపారు. ఫస్టియర్ పరీక్షల తేదీలు: ఫిబ్రవరి 24, 26, మార్చి 1, 3, 5, 9, 12, 15. సెకండియర్ పరీక్షల తేదీలు: ఫిబ్రవరి 25, 27, మార్చి 2, 4, 8, 11, 13, 16.



## వైఎస్సార్‌సీపీలో చేరిన శ్రీకాకుళం మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి

- వైయస్ జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన గుండ లక్ష్మీదేవి, ముఖ్య అనుచరులు
- నాలుగు దశాబ్దాల టీడీపీ అనుబంధానికి స్వస్తి పలికి వైఎస్సార్‌సీపీలో చేరిక

ప్రజాభూమి ప్రతినిధి, తాడేపల్లి: తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్ సమక్షంలో శ్రీకాకుళం మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, ఆమె ముఖ్య అనుచరులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వైయస్ జగన్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

2 పేజీలో..

## ధర్మానా..? అసలు నీకు ఇది ధర్మమేనా..

- సుప్రీంకోర్టు ఆదేశాలను వక్రీకరించి ప్రభుత్వానికి చెంపదెబ్బ అంటూ తప్పుడు ప్రచారం
- 2021 స్థానిక ఎన్నికల్లో వైసీపీ దౌర్జన్యాలను ప్రజలు ఇంకా మరిచిపోలేదు
- నిమ్మగడ్డ రమేష్‌కుమార్‌ను అక్రమంగా తొలగించిన చరిత్ర మీది కాదా..?
- ప్యాలెస్‌లో జగన్ రెడ్డి ఆదేశాలతోనే గొడ్డలి పార్టీ రౌడీమూకల అరాచకాలు
- ప్రజాక్షేత్రంలో తేల్చుకునే వాళ్లమే తప్ప.. అక్రమంగా అడ్డుకునే వాళ్లం కాదు
- గొడ్డలి పార్టీ గూండాగిరిని, ఫ్యాక్షన్ సంస్కృతిని ఉపేక్షించేది లేదు
- వైసీపీ నేత ధర్మాన ప్రసాదరావుపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో ధ్వజం



ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి : సుప్రీంకోర్టు ఆదేశాలను కూడా చదివి అర్థం చేసుకోవడం రాని గొడ్డలి పార్టీ నాయకుల నుంచి సరైన విశ్లేషణ ఆశించడం మాదే తప్పని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఉత్తరాంధ్రలో తానే అత్యంత తెలివైనవాడినని తనకు తాను చెప్పుకునే ధర్మాన సుప్రీంకోర్టు ఆదేశాలు చదివావా? అవి నీకు అర్థమయ్యాయా? అని ప్రశ్నించారు.

తుది జాబితా ప్రచురణను ఈ నెల 25 వరకు వాయిదా వేయాలని, నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకున్నారనే ఫిర్యాదులు అందితే సంబంధిత సాక్ష్యాధారాలు, ఎలక్ట్రానిక్ సాక్ష్యాల తో సహా రాష్ట్ర ఎన్నికల కమిషన్ పరిశీలించాలని సుప్రీంకోర్టు ఆదేశించిం దన్నారు. శాంతిభద్రతల సమస్య కారణంగా అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయలేకపోయారని నిర్ధారణ అయితే ఆ పట్టణ స్థానిక సంస్థల్లో మాత్రమే నామినేషన్ల గడువును పొడిగించాలని,

2 లో



## వైఎస్సార్‌సీపీలో చేరిన జగ్గంపేట నేత పాఠంశెట్టి సూర్యచంద్ర దంపతులు

- వైయస్ జగన్ సమక్షంలో పార్టీలో చేరిన సూర్యచంద్ర, శ్రీదేవి, ముఖ్య అనుచరులు

ప్రజాభూమి ప్రతినిధి, తాడేపల్లి : తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్ సమక్షంలో కాకినాడ జిల్లా జగ్గంపేట నియోజకవర్గానికి చెందిన పాఠంశెట్టి సూర్యచంద్ర, ఆయన సతీమణి శ్రీదేవి, ముఖ్య అనుచరులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వైయస్ జగన్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. జగ్గంపేట నియోజకవర్గ రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న పాఠంశెట్టి సూర్యచంద్ర మూడుసార్లు బూరుగుపూడి గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థిగా, 2024 ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా జగ్గంపేట నియోజకవర్గం నుంచి పోటీ చేసి గణనీయమైన ఓట్లు సాధించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ తోట నరసింహంతో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



## వైఎస్ అవినాశ్ రెడ్డి అరెస్ట్.. తీవ్ర ఉద్రిక్తత

- పరిషత్ ఎన్నికల నామినేషన్ల వేళ కడపలో తీవ్ర ఉద్రిక్తత
- పులివెందుల వెళ్తుండగా మార్గమధ్యంలో అరెస్ట్

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎవరినీ ఉపేక్షించబోమని పోలీసుల హెచ్చరిక ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక ఎన్నికల పర్వం అగ్గి రాజేస్తోంది. నామినేషన్ల ఘట్టం ప్రారంభమైన నాటి నుంచే మొదలైన ఉద్రిక్తతలు ఈరోజు తార స్థాయికి చేరాయి.

2 పేజీలో..

## 'జై భవానీ' నామస్మరణతో పులకిస్తున్న ఇంద్రకీలాద్రి



- అమ్మవారికి ప్రీతిపాత్రమైన అరుణ వర్ణంతో వెల్లివిరిసిన భక్తజన సంద్రం
- ఇప్పటివరకు 18.29 లక్షల మందికి అమ్మవారి దర్శనం - వెల్లడించిన ఈవో వి.కె.శీనానాయక్
- 39.84 లక్షల లడ్డూ ప్రసాదాల విక్రయం.. ఇంకా 3.30 లక్షల లడ్డూలు సిద్ధం
- 8.37 లక్షల మందికి అన్నప్రసాదం, 4.34 లక్షల మందికి మజ్జిగ, 6.45 లక్షల బిస్కెట్ ప్యాకెట్ల పంపిణీ
- క్యూలైన్లు, హోల్డింగ్ ఏరియాల్లో నిరంతరాయంగా మంచినీరు, ఆహార ప్యాకెట్ల పంపిణీ

ప్రజాభూమి ప్రతినిధి, ఇంద్రకీలాద్రి : శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో దసరా శరన్నవరాత్రుల అనంతరం ఇంద్రకీలాద్రి పరిసరాలు, విజయవాడ వన్ టౌన్ ప్రాంతం అరుణవర్ణ శోభతో దేదీప్యమానంగా వెలుగొందుతున్నాయి.

2 పేజీలో..

## బీసీ కులగణనలో తప్పులుంటే సరిచేస్తాం..

### సీఎం రేవంత్ కీలక ప్రకటన

- వివరాలు నమోదు కానివారు ప్రభుత్వానికి తెలియజేయాలని సూచన
- వచ్చే కేబినెట్‌లో కులగణన లెక్కలపై చర్చ
- ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చే అంశాన్ని పరిశీలిస్తామని హామీ
- ముదిరాజ్ నాయకులకు మరిన్ని అవకాశాలు కల్పిస్తామని హామీ
- పండుగ సాయన్న, దొడ్డి కొమురయ్య విగ్రహాల ఏర్పాటుకు హామీ

ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్ : బీసీ కులగణనలో తమ వివరాలు నమోదు కాలేదని భావించే వారు ముందుకొస్తే లెక్కలను సరిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు.

2 పేజీలో..



# ధర్మానా..? అసలునీకు ఇది ధర్మమేనా..

మొదటి పేజీ తరువాయి

ఆ పొడిగింపు కూడా నిర్ణయం తీసుకున్నప్పటి నుంచి 48 గంటలు మాత్రమే ఉండాలని స్పష్టం చేసిందన్నారు. ఇంత స్పష్టంగా ఉన్న ఆదేశాలను వక్రీకరించి ప్రభుత్వానికి 'చెంపదెబ్బ' అంటూ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.
ప్రజాస్వామ్యబద్ధంగా పరిస్థితులు ఉన్నాయి కాబట్టే వైసీపీ అభ్యర్థులు టీడీపీ అభ్యర్థులతో సమానంగా నామినేషన్లు దాఖలు చేయగలిగారని, మేము ప్రజాక్షేత్రంలో తేల్చుకునే వాళ్లమే తప్ప అక్రమంగా అడ్డుకునే వాళ్లం కాదని స్పష్టం చేశారు. 2021 స్థానిక ఎన్నికల ప్రక్రియలో మీ దౌర్జన్యాలను ప్రజలు ఇంకా మరిచిపోలేదని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. అభ్యర్థులను, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి, ఫిర్యాదు చేసినా, కోర్టును ఆశ్రయించినా చంపేస్తారనే భయం కల్పించి, 80 శాతం స్థానిక సంస్థల్లో ఏకగ్రీవాలు చేసుకున్న చరిత్ర మీది అని ఆరోపించారు. అదే మీ రప్పా రప్పా రాజ్యాంగం అంటూ ఎద్దేవా చేశారు. అప్పటి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ ని అక్రమంగా తొలగించిన తీరు, కోర్టు ద్వారా ఆయన తిరిగి నియమితులైన తర్వాత కూడా ఆయనపై చేసిన వ్యక్తిత్వ హననం ప్రజలు మరిచిపోలేదన్నారు. ఇలాంటి చరిత్ర ఉన్న మీ పార్టీ, మీ గొడ్డలి పార్టీ అధ్యక్షుడు రాజ్యాంగ సంస్థలు, ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లుందని విమర్శించారు. రాజ్యాంగ వ్యవస్థల పట్ల మీకున్న గౌరవమేమిటో
మీ గత చరిత్రే చెబుతోందని అన్నారు. తాడేపల్లి ప్యాలెస్‌లో జగన్ రెడ్డి ఇచ్చే ఆదేశాల మేరకే గొడ్డలి పార్టీ రౌడీమూకలు క్షేత్రస్థాయిలో బరితెగించి దౌర్జన్యాలకు పాల్పడుతున్నాయని మంత్రి అచ్చెన్నాయుడు ఆరోపించారు. రాష్ట్రంలో ప్రశాంత వాతావరణం ఉంటే తమ ఉనికికే ప్రమాదమని అల్లర్లు సృష్టించి పబ్బం గడుపుకుంటున్నారని మండిపడ్డారు. గతంలో గులకరాయి, కోడికత్తి నాటకాలతో సానుభూతి పొందేందుకు ప్రయత్నించినట్లే, ఇప్పుడు తామే అల్లర్లు సృష్టించి శాంతిభద్రతలు లేవంటూ సానుభూతి పొందాలనుకుంటున్నారని విమర్శించారు. కానీ ప్రజలు మీ నైజాన్ని ఇప్పటికే తెలుసుకున్నారని, ఇక మీ ఆటలు చెల్లవని హెచ్చరించారు. పుంగనూరులో ఎంపీ కాన్వాయ్‌లో మారణాయుధాలు, మద్యం బాటిళ్లు పెట్టుకుని ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టాలని చూసింది మీ గొడ్డలి పార్టీ కాదా అని సూటిగా ప్రశ్నించారు. ప్రజాక్షేత్రంలో ఘోర పరాజయం తప్పదని ముందే తెలిసిపోయి, కనీసం పోటీ చేయడానికి అభ్యర్థులు కూడా దొరకక, ఇప్పుడు పోలీసులు అడ్డుకుంటున్నారని, ఎన్‌ఓసీలు ఇవ్వడం లేదని కుంటిసాకులు చెబుతున్నారని మంత్రి అచ్చెన్నాయుడు విమర్శించారు. మాది ప్రజాస్వామ్యబద్ధమైన ప్రభుత్వం కాబట్టే రాష్ట్ర ఎన్నికల కమిషన్ స్వతంత్రంగా తన విధులు నిర్వర్తించగలుగుతోందన్నారు. ఎన్‌ఓసీల అవసరం లేదని స్పష్టం చేయడంతోపాటు, చిన్న ఫిర్యాదు అందినా పూర్తిస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లు, ఎస్పీలకు ఆదేశాలు ఇచ్చేంత స్వేచ్ఛగా ఎన్నికల కమిషన్ పనిచేస్తోందని పేర్కొన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు గొడ్డలి పార్టీ గూండాగిరికి, ఫ్యాక్షన్ సంస్కృతికి రాజకీయంగా సమాధి కట్టడం ఖాయమని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ రాష్ట్రాన్ని అశాంతిపాలు చేయాలని చూసే గొడ్డలి పార్టీ మూతా నాయకుల్లో ఏ ఒక్కరినీ కూటమి ప్రభుత్వం ఉపేక్షించదని, చట్టప్రకారం చర్యలు తీసుకుంటుందని మంత్రి అచ్చెన్నాయుడు హెచ్చరించారు.

# నో కాన్వాయ్...సింగిల్‌గా చంద్రబాబు ఇంటికి పవన్

మొదటి పేజీ తరువాయి

సీట్ల సర్దుబాటు, నామినేషన్ల ప్రక్రియలో అనుసరించాల్సిన వ్యూహాలపై వారు ఒక అవగాహనకు వచ్చారని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. గతంలో మున్సిపల్ ఎన్నికల సమయంలో వైసీపీ సృష్టించిన నాటకీయ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని, ఈసారి అలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పక్కా ప్రణాళికతో నామినేషన్ల ఘట్టాన్ని పూర్తి చేయాలని నిర్ణయించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించి, గ్రామ స్థాయిలో కూటమి ఓటు బ్యాంకును పటిష్ఠం చేసుకుంటూ మెజారిటీ స్థానాలను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా ఉమ్మడి కార్యాచరణను ఖరారు చేశారు. డిప్యూటీ సీఎం హోదాలో ఉన్నప్పటికీ పవన్ కళ్యాణ్ కేవలం పార్టీ పనుల కోసమే ప్రొటోకాల్‌ను పక్కనపెట్టి వచ్చారని జనసేన వర్గాలు చెబుతున్నాయి. క్లిష్టమైన రాజకీయ పరిస్థితుల్లో అధికారిక హంగుల కన్నా, పక్కా వ్యూహంతో ముందుకు సాగడమే ముఖ్యమనే బలమైన సందేశాన్ని ఈ చర్య ద్వారా పవన్ తన శ్రేణులకు పంపించారనే ప్రచారం సాగుతోంది. ఈ భేటీ ద్వారా పరిషత్ ఎన్నికల్లో వైసీపీ ఎత్తుగడలను సమర్థంగా ఎదుర్కొనేందుకు కూటమి సిద్ధంగా ఉందని చంద్రబాబు, పవన్ స్పష్టం చేశారు. రానున్న 48 గంటల్లో ఎస్ఈసీ తీసుకునే నిర్ణయం, తదుపరి పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లో కీలకం కానున్నాయి.



# బీసీ కులగణనలో తప్పులుంటే సరిచేస్తాం..

అవసరమైతే బీసీ జనాభా లెక్కలను సవరించి, జాబితాలోకి రాని వారిని చేర్చుతామని స్పష్టం చేశారు. బీసీ వర్గాలకు సామాజిక న్యాయం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకల్లో సీఎం పాల్గొని మాట్లాడారు. వందేళ్లలో ఎవరూ చేయని సాహసం తమ ప్రభుత్వం చేసిందని, ఏడాదిలోనే కులగణన పూర్తి చేసి తొలిసారిగా బీసీల జనాభా లెక్కలను తేల్చామని అన్నారు. ఏ కులం వారైనా తమ జనాభా తక్కువగా నమోదైందని భావిస్తే సంబంధిత వివరాలు అందించాలని సూచించారు. వచ్చే కేబినెట్ సమావేశంలో ఈ అంశంపై చర్చించి లెక్కలను మరింత పక్కాగా



చేస్తామని వెల్లడించారు. తనకు అవకాశం ఉంటే తన కుర్చీ చుట్టూ బలహీనవర్గాలను కూర్చోబెట్టుకోవాలన్నదే తన ఆలోచన అని రేవంత్ రెడ్డి అన్నారు. ముదిరాజ్‌లను ప్రస్తుతం బీసీ–డీ జాబితా నుంచి బీసీ–ఏలోకి మార్చాలన్న డిమాండ్‌పైనా సీఎం స్పందించారు. ఈ అంశంపై ముదిరాజ్ నాయకులు న్యాయ నిపుణులను సంప్రదించి, ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. గంగపుత్రుల్లో ఉన్న అపోహలను కూడా తెలుసుకోవాలని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన పలువురికి పదవులు కల్పించామని, మిగిలిన నాయకులకు కూడా త్వరలో అవకాశాలు వస్తాయని హామీ ఇచ్చారు.
తన పనితీరుపై మాట్లాడుతూ పరోక్షంగా గత సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి విమర్శలు చేశారు. తనకు ఇంకా వయసు, ఓపిక ఉన్నాయని, తాను ఫామ్‌హౌస్‌లో పడుకునే రకాన్ని కాదని వ్యాఖ్యానించారు. పండుగ సాయన్న జయంతి, వర్ధంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తామని సీఎం ప్రకటించారు. పండుగ సాయన్న కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. దొడ్డి కొమురయ్య, పండుగ సాయన్న విగ్రహాలను ట్యాంక్‌బండ్ సమీపంలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. బలహీనవర్గాలకు సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# వైఎస్ అవినాశ్ రెడ్డి అరెస్ట్.. తీవ్ర ఉద్రిక్తత

వైసీపీ కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డిని పోలీసులు కాసేపటి క్రితం అదుపులోకి తీసుకున్నారు. ఈ పరిణామంతో కడప జిల్లాలో ఒక్కసారిగా రాజకీయ వేడి భగ్గుమంది.

**అసలేం జరిగింది?**

జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా పులివెందుల నియోజకవర్గంలో ఉద్రిక్తతలు తలెత్తవచ్చని నిఘా వర్గాల నుంచి సమాచారం అందడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ క్రమంలో, కడప నుంచి పులివెందులకు బయలుదేరిన ఎంపీ అవినాశ్ రెడ్డి, వైఎస్ ప్రకాశ్ రెడ్డి, జగన్ మేనమామ రవీంద్రనాథ్ రెడ్డి తదితరులను పోలీసులు మార్గమధ్యంలోనే అడ్డుకున్నారు. శాంతిభద్రతల దృష్ట్యా పులివెందులకు వెళ్లరాదని సూచించారు.
అయితే, తమ నియోజకవర్గానికి తాము వెళ్లకుండా అడ్డుకోవడం ఏమిటని ఎంపీ అవినాశ్ రెడ్డి పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమయంలో పోలీసులకు, వైసీపీ నేతలకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారుతుండటంతో... శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగానే ముందస్తు అరెస్టు చేస్తున్నట్లు ప్రకటించి, అవినాశ్ రెడ్డి సహా పలువురు నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై జిల్లా ఎస్పీ స్పందిస్తూ... "ఎన్నికల వేళ శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందన్న పక్కా సమాచారంతోనే ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాం. ఏ పార్టీకి చెందిన వారైనా సరే, ఘర్షణలకు ఆస్కారం ఇస్తే ఉపేక్షించేది లేదు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరపడమే మా లక్ష్యం. ఇందులో భాగంగానే నేతలను అదుపులోకి తీసుకోవాల్సి వచ్చింది" అని స్పష్టం చేశారు.



# 'జై భవానీ' నామస్మరణతో పులకిస్తున్న ఇంద్రకీలాద్రి





శ్రీ లలితా సహస్రనామ స్తోత్రంలో కీర్తించినట్లుగా, జగన్మాతకు అత్యంత ప్రీతిపాత్రమైన అరుణ వర్ణ (ఎరుపు రంగు) వస్త్రాలను ధరించి భవానీ దీక్షలతో తరలివచ్చిన భక్తజన ప్రవాహంతో క్షేత్రమంతా ఎరుపెక్కింది. గత రెండు రోజులుగా ఇసుకేస్తే రాలనంతగా పోటెత్తిన భవానీ భక్తుల రాకతో ఇంద్రకీలాద్రి 'జై భవానీ.. జై జై భవానీ' నామస్మరణతో మార్మోగిపోతోంది. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ గురువారం సాయంత్రం అధికారికంగా వివరాలు వెల్లడించారు. దసరా ఉత్సవాల్లో అక్టోబర్ 11 నుండి 20వ తేదీ అర్ధరాత్రి వరకు దాదాపు 14,84,000 మంది (దాదాపు 15 లక్షల మంది) భక్తులు అమ్మవారిని దర్శించుకోగా, అనంతరం 21 మరియు 22 తేదీల్లో భవానీ భక్తులు నిరంతరాయంగా తరలివచ్చారు. దీంతో గురువారం సాయంత్రం 4 వరకు మొత్తం 18,29,000 మంది భక్తులు శ్రీ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకుని తరించారు. ఈ రద్దీ అర్ధరాత్రి వరకు కొనసాగే అవకాశముంది. శుక్రవారం విరమణ చేయని భక్తులు మిగిలి ఉంటే శని, ఆదివారాల్లో దర్శనాలు పూర్తి చేసుకుంటారని అంచనా వేస్తున్నాము.

**లడ్డూ ప్రసాదం నిల్వలు:** ఈరోజు సాయంత్రం 4 వరకు భక్తులకు ఇప్పటివరకు 39,84,000 లడ్డూ ప్రసాదాలను విజయవంతంగా అందించడం జరిగింది. భక్తుల కోసం ఆలయ పోటు విభాగంలో ఇంకా 3,30,000 లడ్డూలు నికరంగా సిద్ధంగా అందుబాటులో ఉన్నాయి.

**అన్నప్రసాదం & ఆహార ప్యాకెట్ల వితరణ:** ఇప్పటివరకు మొత్తం 8,37,385 మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశాము. అన్నప్రసాద భవనంలో రాత్రి 12:00 గంటల వరకు భోజనాలు వడ్డిస్తుండగా, అర్ధరాత్రి 1:00 గంట నుండి వేకువజామున 4:00 – 5:00 గంటల వరకు హోల్డింగ్ ఏరియాల్లోని భక్తులకు ప్రత్యేకంగా ఫుడ్ ప్యాకెట్లు అందజేస్తున్నాము. అన్నప్రసాద భవనమే కాకుండా.. వినాయక గుడి ప్రారంభ పాయింట్, కేశఖండనశాల వద్ద గల అండర్‌పాస్, కొండపైన ప్రోటోకాల్ కార్యాలయం సమీపంలోని మూడు కేంద్రాల ద్వారా నిరంతరం ఫుడ్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నాము.

**మజ్జిగ, బిస్కెట్లు & తాగునీరు:** ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఇప్పటివరకు 4,34,000 మందికి బటర్‌మిల్క్ (మజ్జిగ), 6,45,000 బిస్కెట్ ప్యాకెట్లను క్యూలైన్లలో అందజేశాము. క్యూలైన్లలోని భక్తులకు ఎప్పటికప్పుడు సురక్షిత తాగునీరు అందిస్తున్నాము.

**వైద్య సేవలు (ఓపీ):** కొండపై ఏర్పాటు చేసిన 5 పడకల ఆసుపత్రి/వైద్య శిబిరాల్లో ఇప్పటివరకు సుమారు 1,06,000 మంది భక్తులకు ఉచిత ఓపీ వైద్య సేవలు, అత్యవసర మందులు అందించడం జరిగింది. ప్రధానంగా కాళ్ల నొప్పులు, జలుబు, ఒళ్లు నొప్పులు, జ్వరంతో వచ్చిన వారికి ఉపశమనం కల్పించారు .
వినాయక గుడి, టోల్‌గేట్, ఓం టర్నింగ్, అమ్మవారి ప్రధానాలయం నుండి శివాలయం వరకు ప్రతి హోల్డింగ్ ఏరియాలో భక్తులకు మైకుల ద్వారా ఎప్పటికప్పుడు సూచనలు, మహానివేదన, హారతుల వేళలను తెలియజేస్తున్నాము. అలాగే భక్తులలో ఆధ్యాత్మిక భావన పెంపొందించేందుకు 'ఓం శ్రీ కనకదుర్గాయై నమః' నామస్మరణను మైకుల ద్వారా నిరంతరం వినిపిస్తున్నాము.
దేవస్థాన ఉద్యోగులు, పోలీసు యంత్రాంగం, ఇతర ప్రభుత్వ శాఖల సిబ్బంది సమన్వయంతో అంకితభావంతో పనిచేస్తూ, ఎంతటి రద్దీ ఉన్నప్పటికీ విచ్చేసిన భవానీ భక్తులందరికీ ఎటువంటి అసౌకర్యం లేకుండా సంతృప్తికర దర్శనం, అన్నప్రసాదం, లడ్డూ ప్రసాదం అందేలా చర్యలు తీసుకుంటున్నామని" ఈవో పేర్కొన్నారు.

## సంపాదకీయం

# విశ్వవ్యాప్త కార్యాచరణ

మారుతున్న వాతావరణ పరిస్థితులు, వేడెక్కుతున్న భూమి నేపథ్యంలో కరువు ఒక నిర్దిష్ట భౌగోళిక ప్రాంతానికే పరిమితం కావడం లేదు. అది ప్రపంచవ్యాప్త సంక్షోభంగా మారుతుండటం ఆందోళనకరం. గత ఏడాది వివిధ దేశాలను కరువు పీడించగా, ఈ ఏడాది ఎల్ నినో కారణంగా అనేక దేశాల్లో దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయి. ప్రఖ్యాత సైంటిఫిక్ జర్నల్ 'నేచర్ రివ్యూస్ ఎర్త్ అండ్ ఎన్విరాన్‌మెంట్' ప్రకారం గత ఏడాది ప్రపంచ భూభాగంలో సుమారు 30 శాతం కరువు ప్రభావానికి గురైంది. ఈ సంవత్సరం నెలకొన్న ఎల్ నినో పరిస్థితులు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రపంచ వాతావరణ సంస్థ అంచనాల ప్రకారం, ఎల్ నినో ఈ ఏడాది చివరికి మరింత బలపడే అవకాశం ఉంది. యునిసెఫ్ అంచనాల ప్రకారం 2026 అక్టోబర్--డిసెంబర్ మధ్య దాదాపు 100 దేశాల్లోని 34.7 కోట్ల మందికి పైగా పిల్లలు దీని ప్రభావానికి గురయ్యే అవకాశం ఉంది. మన దేశంతో పాటు కొలంబియా, ఫిజీ, పాపువా న్యూ గినియా, ఫిలిప్పీన్స్ వంటి ప్రాంతాల్లో కరువు, నీటి కొరత వంటి దుర్భిక్ష పరిస్థితులు తలెత్తే ప్రమాదం ఉంది.తూర్పు ఆఫ్రికాలోని కొన్ని ప్రాంతాల్లో అధిక వర్షాలు, వరదలు సంభవించే అవకాశం ఉంది. అయితే, ప్రపంచ వాతావరణ సంస్థతో పాటు అనేక ఇతర అధ్యయనాలు గత సంవత్సరం కంటే ఈ ఏడాది ప్రపంచ వ్యాప్తంగా తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని ఇప్పటికే హెచ్చరించాయి. ప్రపంచ ఉష్ణోగ్రతలు పెరగడానికీ, తరచుగా కరువులు ఏర్పడటానికి మధ్య స్పష్టమైన సంబంధం ఉన్నట్లు ఇప్పుడు నిర్ధారణ అయింది. వాతావరణ మార్పుల కారణంగా వ్యవసాయ రంగంలోనూ, పర్యావరణ వ్యవస్థల్లోనూ కరువు పరిస్థితులు పెరుగుతున్నాయని ఐక్యరాజ్యసమితికి చెందిన అంతర్ ప్రభుత్వ వాతావరణ మార్పుల మండలి సైతం పేర్కొంది. వాతావరణం
నుంచి నీరు ఆవిరి కావడం భారీగా పెరగడంతో నేలలో తేమ గణనీయంగా తగ్గుతోంది. ఈ కారణంగానే 1901 నుంచి ప్రపంచవ్యాప్తంగా కరువు తీవ్రత సగటున 40 శాతం పెరిగిందని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ఫలితంగా నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయి. ప్రజల జీవన ప్రమాణాలు కుదించుకుపోతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా వలసలు పెరుగుతున్నాయి. 2050 నాటికి కరువు కారణంగా ప్రపంచవ్యాప్తంగా సుమారు 32 లక్షల మంది మరణించే అవకాశం ఉందన్నది ఒక అంచనా. ఇటీవలి సంవత్సరాల్లో ప్రపంచం ఈ సంక్షోభం పట్ల మేల్కొంటోంది. కరువు వల్ల ఆర్థిక వ్యవస్థలకు, పర్యావరణానికి పెరుగుతున్న నష్టం తీవ్ర ఆందోళన కలిగిస్తున్నప్పటికీ, ఈ సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి ప్రపంచవ్యాప్తంగా ఏకీకృత విధానం మాత్రం లేదు.ఐక్యరాజ్యసమితి ఎడారీకరణ వ్యతిరేక ఒప్పందం (యునైటెడ్ నేషన్స్ కన్వెన్షన్ టు కంబాట్ డిజర్టిఫికేషన్- యుఎన్‌సిసిడి) కింద ప్రపంచవ్యాప్త కరువు నిర్వహణ చట్రంపై ఒప్పందం కుదుర్చుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. కానీ పురోగతి మాత్రం నత్తనడకన సాగడం విచారకరం. మంగోలియా రాజధాని ఉలాన్‌బాతర్‌లో ఇటీవల ముగిసిన యుఎన్‌సిసిడి దేశాల కాప్-17 సదస్సులోనూ ఈ అంశంపై ఏకాభిప్రాయం కుదరలేదు. కరువును తట్టుకునే సామర్థ్యాన్ని ప్రపంచవ్యాప్తంగా పెంచడానికి ఇప్పుడు ఖర్చు చేస్తున్న నిధులు కాకుండా మరో 278 బిలియన్ డాలర్ల లోటు ఉందని, ఆ మొత్తాన్ని అభివృద్ధి చెందిన దేశాలు సమకూర్చాలన్నది యుఎన్‌సిసిడి ప్రతిపాదన! షరా మామూలుగానే అమెరికా ఈ ప్రతిపాదనకు మోకాలడ్డింది. అమెరికాకు తానా తందానా అనే మరికొన్ని దేశాలు కూడా దీనిని వ్యతిరేకించాయి. కరువు అనేది ఒకటి, రెండు దేశాలకు సంబంధించిన అంతర్గత సమస్య అని, దీనికి అంతర్జాతీయ ఒప్పందం అవసరం లేదని అమెరికా వాదించడం బరితెగింపు. అయితే, అమెరికా చేసిన ఈ వాదన మారుతున్న వాతావరణ, ప్రపంచ పరిస్థితుల్లో ఏమాత్రం చెల్లుబాటు కాదని పర్యావరణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో ఒక దేశంలో నెలకొన్న కరువు అంతర్జాతీయ ఆహార భద్రత, వాణిజ్యం, ఉపాధి, ప్రజారోగ్యాలను ప్రభావితం చేసేదిగా మారుతుందని వీరు హెచ్చరిస్తున్నారు. అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాలు, ఆహార నిల్వలు, అత్యవసర సరఫరా వ్యవస్థలు సక్రమంగా సాగాలంటే విపత్తులను ఎదుర్కొనే అంశాల్లోనూ ప్రపంచ దేశాల మధ్య పటిష్ట సహకారం అవసరమన్న వీరి విశ్లేషణ సరైనదే. ఈ నేపథ్యంలో నవంబర్ 9నుండి 20వ తేది వరకు టర్కీలోని అంటాల్యాలో జరగనున్న ప్రపంచ వాతావరణ సదస్సు (కాప్-31) ఎలా స్పందిస్తుందో చూడాల్సి ఉంది. గత ఏడాది నెలకొన్న కరువు, ఈ ఏడాది ఎల్ నినో హెచ్చరికలు ఒక విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. కరువు వంటి విపత్కర పరిస్థితులు ఇకమీదట ఒక దేశానికో, ఒక ప్రాంతానికో ఏ మాత్రం పరిమితమైనవి కావు. వాటి ప్రభావం ప్రపంచవ్యాప్తంగా ఉంటుంది. వాతావరణ విపత్తులకు సరిహద్దులు ఎలా ఉండవో, వాటిని ఎదుర్కోవడానికి, బాధిత ప్రజానీకానికి ఊరటనివ్వడానికి ప్రపంచ దేశాలు కూడా సరిహద్దులకు అతీతంగా కదలాలి. ఆ కదలిక ఒక దాతృత్వ చిహ్నంగా కాకుండా, బాధ్యతగా ఉండటం అవసరం.??

# సిఎస్ సాయి ప్రసాద్ పదవీకాలం మరో 6 మాసాలు వరకు పొడిగింపు



1991 ఐఏఎస్ బ్యాచ్ కు చెందిన జి.సాయి ప్రసాద్ ప్రస్తుతం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పని చేస్తుండగా ఇప్పటికే గత జూన్ 1 నుండి నవంబరు 30 వరకూ 6 మాసాలు ఆయన పదవీ కాలాన్ని పొడిగించగా వచ్చే నెల30వ తేదీన ఆయన పదవీ విరమణ చేయాల్సి ఉంది. అయితే సిఎస్ పదవీ కాలాన్ని మరోసారి పొడిగించాలని రాష్ట్ర ప్రభుత్వం గత నెల 29న కేంద్ర ప్రభుత్వానికి డిఓ లేఖ వ్రాయగా అందుకనుగుణంగా కేంద్రం ప్రభుత్వం ఆమోదించి సిఎస్ సాయి ప్రసాద్ పదవీ కాలాన్నిమరో ఆరు మాసాలు అనగా 2027 మే 31 వరకూ పొడిగిస్తూ ఈమేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

# వైఎస్సార్‌సీపీలో చేరిన శ్రీకాకుళం మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి

గుండ లక్ష్మీదేవి కుటుంబానికి తెలుగుదేశం పార్టీతో దాదాపు 40 ఏళ్ల రాజకీయ అనుబంధం ఉంది. ఆమె భర్త, దివంగత మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై, రెండుసార్లు మంత్రిగా పనిచేశారు. గుండ లక్ష్మీదేవి 2014 ఎన్నికల్లో టీడీపీ తరఫున శ్రీకాకుళం ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. గుండ లక్ష్మీదేవితో పాటు టీడీపీ నాయకులు ముద్దాడ ప్రవీణ్, జల్లు రాజీవ్, సిమ్మ నర్సింగరావు, పల్లి శ్రీనివాసరావు, కునుకు గోవింద్, గాడు సాయికుమార్, గేదెల రాంకుమార్, యాగాటి ప్రసాద్, చిన్నాల ముత్తయి నాయుడు, చెట్టు గోవింద్, గురువు శ్రీనివాస్, రౌతు నాగేశ్వరరావు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావుతో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

# జడ్పీటీసీ, ఎంపిటీసీ నామినేషన్ల ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్ డీకే బాలాజీ



**నామినేషన్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, హెల్ప్‌డెస్క్ సేవల తనిఖీ**
**ఎన్నికల కమిషన్ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలి**

మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి

రెండవ సాధారణ స్థానిక సంస్థల ఎన్నికలు–2026లో భాగంగా జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు జరుగుతున్న నామినేషన్ల ప్రక్రియను జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డీకే బాలా జీ గురువారం క్షేత్రస్థా యిలో పరిశీలించారు. నామి నేషన్ల స్వీకరణ రెండో రోజు సంద ర్భం గా గుడ్లవల్లేరు, పామ ర్రు, గూడూరు మండల పరిషత్ కార్యాలయాలను సందర్శించి ఎన్నికల ఏర్పాట్లను సమీ క్షించారు.ఈ సం ద ర్భంగా నామినేషన్ల స్వీకరణకు చేసిన ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరు, అభ్యర్థులకు అందిస్తున్న సహాయ సహకారాలు, రిటర్నింగ్ అధికారులు (ఆర్వోలు), సహాయ రిటర్నింగ్ అధికారులు (ఏఆర్వోలు) నిర్వహిస్తున్న విధులను పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేలా అన్ని ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

**సీసీ కెమెరాల పనితీరుపై పరిశీలన**

నామినేషన్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును కలెక్టర్ తనిఖీ చేశారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీ తనానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**హెల్ప్‌డెస్క్ సేవలు అభినందనీయం**

నామినేషన్ల దాఖలుకు సంబంధించి అభ్యర్థులకు సమాచారం, మార్గదర్శకత్వం అందించేందుకు ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ల పనితీరును కలెక్టర్ సమీక్షించారు. నామినేషన్ పత్రాల దాఖలులో అభ్యర్థులకు ఎదురయ్యే సందేహాలను నివృత్తి చేయడంతోపాటు, పత్రాల్లో లోపాలు ఉంటే నిబంధనల పరిధిలో వాటిని సరిదిద్దుకునేందుకు ముందస్తు సూచనలు అందించాలని సిబ్బందికి తెలిపారు.అభ్యర్థులందరికీ సమానంగా, నిష్పక్షపాతంగా సహాయ సహకారాలు అందించాలని, నామినేషన్ల దాఖలు సమయంలో అనవసర ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. హెల్ప్‌డెస్క్‌ల ద్వారా అందుతున్న సేవల పట్ల అభ్యర్థులు సంతృప్తి వ్యక్తం చేసినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు.

**ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా అమలు చేయాలి**

రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, ఇతర ఎన్నికల సిబ్బంది విధులను సమీక్షించిన కలెక్టర్, నామినేషన్ల స్వీకరణలో ప్రతి దశలోనూ అప్రమత్తంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలను, ఆర్వో హ్యాండ్‌బుక్‌లో పేర్కొన్న విధివిధానాలను కచ్చితంగా అనుసరించాలని ఆదేశించారు.ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం, సంబంధిత ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని, నామి నేషన్ల స్వీకరణ, పత్రాల పరిశీలన, ఎన్నికల రికార్డుల నిర్వహణలో నిర్దేశిత విధానాలను పాటిం చాలని సూచించారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు.ఈ తనిఖీల్లో సంబంధిత మండలాల రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

# నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ





మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి :

కృష్ణా జిల్లా పామర్రు మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డీకే బాలాజీ పరిశీలించారు.నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన, నామినేషన్ల సమయంలో ఎన్నికల నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులకు సూచించారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల విధుల నిర్వహణలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు.

# గూడూరు మండల పరిషత్ కార్యాలయంలో నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి

కృష్ణా జిల్లా గూడూరు మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డీకే బాలాజీ గురువారం పరిశీలించారు.ఈ సంద ర్భంగా నామినేషన్ల స్వీకరణకు చేసిన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎన్నికల ప్రక్రియలో పాటించాల్సిన నియమ నిబంధనలపై అధికారులకు పలు సూచనలు చేశారు. నామినేషన్ల స్వీకరణలో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తప్పనిసరిగా అమలు చేయాలని, ప్రతి దశలోనూ అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేలా అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు.

# జడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

**జిల్లావ్యాప్తంగా ప్రశాంతంగా నామినేషన్ల ప్రక్రియ.. పటిష్ట పోలీసు బందోబస్తు**
**సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా..**
**నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు**



మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి

కృష్ణా జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగుతోందని జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు, ఐపీఎస్ తెలిపారు. మచిలీపట్నంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించి, భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. విధుల్లో ఉన్న పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు.జిల్లావ్యాప్తంగా నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగుతోందని, ఇప్పటివరకు సుమారు 20 నామినేషన్లు దాఖలైనట్లు వెల్లడించారు.



నామినేషన్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**100 మీటర్ల పరిధిలో నిబంధనలు కఠినంగా అమలు**

నామినేషన్ కేంద్రాల వద్ద శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. కేంద్రాల పరిసరాల్లో 100 మీటర్ల పరిధికి సంబంధించిన నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, అనుమతి లేని వ్యక్తులు, వాహనాలను లోపలికి అనుమతించవద్దని స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారం అభ్యర్థితో పాటు అనుమతించిన పరిమిత సంఖ్యలో వ్యక్తులకే కేంద్రంలోకి ప్రవేశం కల్పించాలని సూచించారు.అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు క్విక్ రెస్పాన్స్ టీమ్‌లను సిద్ధంగా ఉంచాలని, అవసరమైన ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా నిఘా ఏర్పాటు చేసి అనుమానాస్పద కదలికలను పర్యవేక్షించాలని తెలిపారు.

**19 సున్నిత మండలాలపై ప్రత్యేక దృష్టి**

జిల్లాలో 19 మండలాలను సున్నిత ప్రాంతాలుగా గుర్తించిన నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక పోలీసు బలగాలను మోహరించాలని, పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని ఎస్పీ ఆదేశించారు. ఎన్నికల అధికారులు, ఇతర శాఖల సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ ఎన్నికల నియమావళికి అనుగుణంగా విధులు నిర్వహించాలని సూచించారు.ఎన్నికల ప్రక్రియ మొత్తం ప్రశాంతంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేలా పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు ఆదేశించారు. ప్రజలు, అభ్యర్థులు ఎన్నికల నిబంధనలను పాటిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు.

# ఏఆర్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యతనివ్వాలి

**విధుల కేటాయింపులో పారదర్శకత, సమన్వయం పాటించాలి: జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు**
**కృష్ణా జిల్లా ఏఆర్ అడిషనల్ ఎస్పీగా బి. చంద్రశేఖర్ బాధ్యతల స్వీకరణ**



మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి

పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, విధుల కేటాయింపులో పారదర్శకతతో పాటు సమన్వయం పాటించాలని కృష్ణా జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు సూచించారు. కృష్ణా జిల్లా నూతన ఏఆర్ అడిషనల్ ఎస్పీగా బి. చంద్రశేఖర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా ఏఆర్ విభాగం నిర్వహణ, సిబ్బందికి విధుల కేటాయింపు, పోలీసు సిబ్బంది సంక్షేమం తదితర అంశా లపై ఎస్పీ దిశానిర్దేశం చేశారు. సిబ్బంది సంక్షేమం విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని, వారి సమస్యలను సానుకూల దృక్పథంతో పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలని సూచిం చారు.విధుల కేటాయింపులో అప్రమత్తంగా వ్యవహరిస్తూ, సిబ్బందిపై అనవసరమైన పని ఒత్తిడి పడకుండా ప్రణాళికాబద్ధంగా విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలీసు సిబ్బందికి అందు బాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని, విధుల నిర్వహణలో క్రమశి క్షణ, అంకితభావం, బాధ్యతాయుతమైన వైఖరిని పెంపొందించాలని పేర్కొన్నారు.జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు అవసరమైన బందోబస్తు, ఇతర పోలీసు విధుల నిర్వహణలో ఆర్మ్డ్ రిజర్వ్ (ఏఆర్) విభాగం కీలక పాత్ర పోషిస్తుందని ఎస్పీ తెలిపారు. అందు బాటులో ఉన్న సిబ్బంది, వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ విధులు నిర్వహించాలని సూచించారు.

**పోలీసు శాఖలో సుదీర్ఘ అనుభవం**

బి. చంద్రశేఖర్ 1991 జూలై 15న రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఎస్ఐ)గా పోలీసు శాఖలో చేరారు. 2002 జూలై 12న రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ)గా, 2012 సెప్టెంబర్ 7న డీఎస్పీగా పదోన్నతులు పొందారు. 2026 జూలై 5న అడిషనల్ ఎస్పీ (ఏఆర్)గా పదోన్నతి పొందిన ఆయన, అదే ఏడాది జూలై 22న కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని జిల్లా ఆర్మ్డ్ రిజర్వ్ (డీఏఆర్) విభాగంలో చేరారు. తాజాగా కృష్ణా జిల్లా ఏఆర్ అడిషనల్ ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు.

# చిన్నాపురం జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు కూటమి అభ్యర్థుల నామినేషన్లు

**ఘనంగా నామినేషన్ల దాఖలు.. తరలివచ్చిన కూటమి నాయకులు, కార్యకర్తలు**





మచిలీపట్నం, ప్రజాభూమి, రూరల్

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో చిన్నాపురం గ్రామానికి చెందిన జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు కూటమి అభ్యర్థులు బుధవారం తమ నామినేషన్లను దాఖలు చేశారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.జడ్పీటీసీ స్థానానికి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వర రావు నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారులకు అందజేశారు. ఆయనకు మద్దతుగా కూటమి నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు.అదేవిధంగా ఎంపీటీసీ సెగ్మెంట్-1 నుంచి జనసేన పార్టీ అభ్యర్థి కాట్రం నాంచారయ్య, సెగ్మెంట్-2 నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కేసన వెంకట కృష్ణారావు తమ నామినేషన్లను దాఖలు చేశారు.ఈ సందర్భంగా అభ్యర్థులు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తోందని పేర్కొన్నారు. అదే స్ఫూర్తితో చిన్నాపురం గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో తాగునీరు, రహదారులు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల సమస్యలను పరిష్కరించడంతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తామని తెలిపారు.నామినేషన్ల కార్యక్రమానికి కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కూటమి అభ్యర్థి విస్తృత ప్రచారం



మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి

నగరపాలక సంస్థ ఎన్నికల నేపథ్యంలో 31వ డివిజన్‌లో కూటమి అభ్యర్థి పంతం వెంకట గజేంద్రరావు సతీమణి పంతం వెంకట విస్తృత స్థాయిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నగరపాలక సంస్థ ఎన్నికల్లో బీజేపీకి మూడు కార్పొరేటర్ స్థానాలు కేటాయించడంతో ఆయా స్థానాల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా సర్కిల్‌పేట ప్రాంతంలో నిర్వహించిన ప్రచారంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ముడా ఛైర్మన్ పట్టా ప్రసాద్ పాల్గొని కూటమి అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సోడిశెట్టి బాలాజీ, ఎన్. రాము, తోట రంగనాథ్, చలమలశెట్టి రామకృష్ణ, వేములపల్లి వెంకటరమణ, నల్లగోపుల అమ్మాజీ, పద్మజ, పంతం మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

# మచిలీపట్నం అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ కృషి

మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి



నగరపాలక సంస్థ ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మేయర్ అభ్యర్థి లంక జ్యోతి, 60 డివిజన్లలో పోటీ చేస్తున్న కార్పొరేటర్ అభ్యర్థులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజలను కలుసుకుని, తమ పార్టీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. గతంలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మచి లీపట్నం పోర్టు నిర్మాణానికి నిధులు కేటాయించి, నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రజలకు వివరిస్తున్నారు.మచిలీపట్నం నగర సమగ్ర అభివృద్ధికి తమ పార్టీ కట్టుబడి ఉందని అభ్యర్థులు ప్రచారంలో పేర్కొంటున్నారు. నగరంలో పారిశుధ్య నిర్వహణను మెరుగుపరచడం, వీధుల్లో చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకోవడం, నిరంతర మంచినీటి సరఫరాకు ప్రాధా న్యం ఇవ్వడం వంటి అంశాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని వివరిస్తున్నారు. మురుగునీటి పారుదల సమస్యలను పరిష్కరించి, వర్షాకాలంలో నీరు నిలిచే ప్రాంతాల్లో ఇబ్బందులు తగ్గించేలా చర్యలు చేపట్టేందుకు కృషి చేస్తామని ప్రజలకు తెలియజేస్తున్నారు.అదేవిధంగా నగరం లోని ప్రధాన రహదారులు, అంతర్గత వీధుల అభివృద్ధితో పాటు, కాలువల నిర్వహణ, వీధి దీపాల ఏర్పాటు, ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా పార్కుల అభివృద్ధి, ప్రధాన కూడళ్ల సుందరీ కరణకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రచారంలో వివరిస్తున్నారు. మచిలీపట్నం నగరాన్ని పరిశు భ్రంగా, సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అభ్యర్థులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఇప్పటికే నగరంలో వైఎస్ఆర్సిపి పార్టీ అధికారం ఉన్న సమయంలో 80 శాతం సిమెంట్ రోడ్లను వేసి అభివృద్ధి చేశామని గుర్తు చేశారు.మచిలీపట్నం పో ర్టు నిర్మాణం పూర్తయితే వాణిజ్య కార్యకలాపాలు విస్తరించి, స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరి గేందుకు దోహదపడుతుందని ప్రజలకు తెలిపారు. నగర అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారం, మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన తమ ప్రచారంలో ప్రధాన అంశాలుగా వివరిస్తూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఇంటింటి ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అత్యధిక మెజార్టీతో గెలవడానికి మాజీ మంత్రి పేర్ని నాని, పేర్ని కిట్టు, మాజీ డిప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, బొర్రా విటల్, మేకల సుబ్బన్న, శీలం బాబ్జి, థామస్ నోబెల్, గాడెల్లి డేవిడ్, తదితరులు ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రజల ఆదరభిమానాలతో కచ్చితంగా వైఎస్ఆర్సిపి అభ్యర్థులు గెలుస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



# మచిలీపట్నం కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అగ్నిప్రమాదం

**సకాలంలో స్పందించి మంటలను అదుపులోకి తెచ్చిన అగ్నిమాపక సిబ్బంది**



మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి

మచిలీపట్నంలోని స్థానిక కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. దీపారాధన సమయంలో వెలిగించిన జ్యోతి కారణంగా ఈ ప్రమాదం సంభవించి ఉండవచ్చని అగ్నిమాపక సిబ్బంది ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు.ప్రమాద సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తమై దేవాలయానికి చేరుకున్నారు. తక్షణ చర్యలు చేపట్టి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. దీంతో మంటలు మరింత వ్యాపించకుండా నివారించగలిగారు.ఈ ఘటనపై దేవస్థాన కమిటీ నిర్వాహకులు మామిడి మురళీకృష్ణ, మోటమర్రి బాబా ప్రసాద్ ఆందోళన వ్యక్తం చేశారు. దేవాలయంలో అగ్నిప్రమాదం చోటుచేసుకోవడంపై వారు ఆవేదన వ్యక్తం చేశారు.అగ్నిప్రమాదానికి గల పూర్తి కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. సంబంధిత అధికారులు చేపట్టే పరిశీలన అనంతరం ప్రమాదానికి గల కారణాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



# మచిలీపట్నం సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి దారుణ హత్య

**ఒకచోట మొండెం.. మరోచోట కాళ్లు, చేతులు లభ్యం**
**రంగంలోకి దిగిన బందరు రూరల్ పోలీసులు.. ప్రత్యేక బృందాలతో దర్యాప్తు**



మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి

కృష్ణా జిల్లా కేంద్రం మచిలీపట్నం సమీపంలోని బందరు మండలం వాడపాలెం గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తి హత్యకు గురైన ఘటన కలకలం రేపింది. మృతదేహాన్ని గుర్తుపట్టలేని విధంగా నరికి, మొండెంను ఒకచోట, కాళ్లు, చేతులను మరోచోట పడేసినట్లు సమాచారం. ఈ ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది.సమాచారం అందుకున్న బందరు రూరల్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఆర్.పేట సీఐ ఏసుబాబు స్వయంగా ఘటనాస్థలాన్ని పరిశీలించి, హత్యకు సంబంధించిన వివరాలను సేకరించారు.

**మృతుడి గుర్తింపు కోసం పోలీసుల ప్రయత్నాలు**

మృతుడు ఎవరు, హత్యకు గల కారణాలేమిటనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలను గుర్తించేందుకు అవసరమైన ఆధారాలను సేకరిస్తున్నారు. ఘటనకు సంబంధించిన పరిస్థితులను పరిశీలిస్తూ, నిందితులను గుర్తించేందుకు చర్యలు చేపట్టారు.

**ప్రత్యేక బృందాలతో ముమ్మర దర్యాప్తు**

ఈ హత్య ఘటనను జిల్లా ఎస్పీ తీవ్రంగా పరిగణించినట్లు సమాచారం. ఎస్పీ ఆదేశాల మేరకు హత్యకు గల కారణాలను వెలికితీయడంతోపాటు నిందితులను గుర్తించి పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసు బృందాలు రంగంలోకి దిగాయి.

పోలీసుల దర్యాప్తు పూర్తయితేనే ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. మృతుడి గుర్తింపు, హత్యకు దారితీసిన పరిస్థితులు, నిందితుల వివరాలపై ఉత్కంఠ నెలకొంది.

# ఏలూరు జిల్లాలో ప్రశాంతంగా జడ్పీటీసి, ఎంపీటీసి ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ

- పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసిన జిల్లా పోలీస్ అధికారులు

**ప్రజా భూమి బ్యూరో ఏలూరు జిల్లా**

ఏలూరు జిల్లాలో రానున్న జడ్పిటిసి, ఎంపీటీసి స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను పరిశీలన చేసిన జిల్లా ఎస్పీ శ్రీ కె. ప్రతాప్ శివ కిషోర్. అత్యంత ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా నిర్వహించేందుకు పోలీసు యంత్రాంగం అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నట్లు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ తెలిపారు. ఏలూరులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో నామినేషన్ల ప్రక్రియ ఏర్పాట్ల పరిశీలించారు. అధికారుల ఇన్‌చార్జ్ నియామకం నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రతి నామినేషన్ కేంద్రానికి ఒక ఎస్సై స్థాయి అధికారిని, అదేవిధంగా



సమస్యాత్మక ప్రాంతాలలో సీఐ స్థాయి అధికారులను ప్రత్యేక ఇన్‌చార్జ్‌లుగా నియమించడం జరిగిందని ఎస్పీ వెల్లడించారు. నామినేషన్ల దాఖలుకు నిబంధనలు నామినేషన్ పత్రాలు దాఖలు చేయడానికి అభ్యర్థితో పాటు కేవలం ఇద్దరికి మాత్రమే అనుమతి ఉంటుంది. వీరు మాత్రమే నిబంధనల ప్రకారం నామినేషన్ కేంద్రంలోకి వెళ్లి సంబంధిత అధికారికి పత్రాలు అందజేయాలని సూచించారు. నామినేషన్ల వేసే సమయంలో ఎవరికైనా ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా, బెదిరింపులకు గురిచేసే ప్రయత్నాలు జరిగినా వెంటనే పోలీసులను సంప్రదించవచ్చు.

ఇందుకోసం పోలీస్ కంట్రోల్ రూమ్, అత్యవసర నెంబర్ 112 లేదా పత్రికా ప్రకటనలో ప్రత్యేకంగా కేటాయించిన 9550351100 నెంబర్ కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. అభ్యర్థులందరికీ పోలీసు శాఖ నుంచి పూర్తి భద్రత, సహాయం అందించబడుతుందని, ప్రజాస్వామ్య బద్ధంగా నామినేషన్ల ప్రక్రియను ప్రశాంతంగా పూర్తి చేయడానికి రాజకీయ పార్టీలు, అభ్యర్థులు అందరూ పోలీసు యంత్రాంగానికి సహకరించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.




# గుమస్తా నాగేశ్వరరావుపై దాడి..

## నిందితులను వెంటనే అరెస్టు చేయాలి

- న్యాయం కోసం న్యాయవాదుల ధర్నా
- ఏఐఎల్‌యు, ఏఐఎల్‌ఏజే ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన

**ప్రజాభూమి,ప్రత్తిపాడు**

గుమస్తా నాగేశ్వరరావుపై దాడి చేసి గాయపరిచి, బంగారం అపహరించిన ఘటనలో నిందితులను వెంటనే అరెస్టు చేసి బాధితుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ న్యాయవాదులు ధర్నా నిర్వహించారు.

గురువారం ప్రత్తిపాడులో ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఏఐఎల్‌ఏజే), ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఏఐఎల్‌యు), ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం చేపట్టారు.

**నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి**

ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ.. గుమస్తా నాగేశ్వరరావుపై దాడికి పాల్పడిన వారిని గుర్తించి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. బాధితుడిపై దాడి చేసి గాయపరచడంతో పాటు బంగారం అపహరించిన ఘటనపై సంబంధిత అధికారులు సమగ్రంగా దర్యాప్తు చేపట్టాలని కోరారు.

నిందితులపై చట్టప్రకారం చర్యలు తీసుకుని, బాధితుడికి న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, బాధితులకు న్యాయం అందించడంలో జాప్యం చేయకూడదని న్యాయవాదులు పేర్కొన్నారు. ఘటనపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

**న్యాయవాదుల సంఘీభావం**

ఈ ధర్నాలో ఏఐఎల్‌ఏజే తరఫున బుగత శివదేవి, ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిట్టిబాబు, కార్యదర్శి మధుబాబు,ఏఐఎల్‌యు తరఫున మల్లేశ్వరరావు, నర్సింహారావు, కిలపర్తి శ్రీనివాస్, అలమండ రాఘవ, రెడ్యం వెంకటరెడ్డి, వెంకటలక్ష్మి, సుజన, రవిచంద్ర ప్రసాద్ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

అలాగే న్యాయవాదుల గుమస్తాలు నాగేశ్వరరావు, వీరస్వామి, శ్రీను, దివ్య, విజయ తదితరులు పాల్గొని బాధితుడికి న్యాయం జరగాలనే డిమాండ్‌కు తమ సంఘీభావాన్ని తెలిపారు. గుమస్తా నాగేశ్వరరావుపై జరిగిన దాడి ఘటనలో నిందితులను త్వరితగతిన అరెస్టు చేసి, బాధితుడికి న్యాయం చేయాలని న్యాయవాదులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# విజయవాడ కనకదుర్గమ్మ దర్శనానికి వెళ్తూ అనంతలోకాలకు..





- స్కార్పియో ఢీకొని నలుగురు భవానీ భక్తులు మృతి
- కాకినాడ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

**ప్రజాభూమి, ప్రత్తిపాడు**

కాకినాడ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. విజయవాడ శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి దర్శనానికి భవానీ మాల ధరించి బయలుదేరిన భక్తులు మార్గమధ్యంలో ప్రమాదానికి గురయ్యారు. ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలోని కత్తిపూడి హైవేపై రావికంపాడు జంక్షన్ సమీపంలో భక్తులపైకి స్కార్పియో వాహనం దూసుకెళ్లడంతో నలుగురు ప్రాణాలు కోల్పోగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడినట్లు ప్రాథమిక సమాచారం.

**టీ తాగేందుకు రోడ్డు పక్కకు వెళ్లగా..**

విజయనగరం జిల్లా డెంకాడ ప్రాంతానికి చెందిన భవానీ మాలాధారులు అమ్మవారి దర్శనం కోసం బస్సులో విజయవాడకు బయలుదేరారు. మార్గమధ్యంలో వారు ప్రయాణిస్తున్న బస్సులో మరమ్మతు సమస్య తలెత్తినట్లు సమాచారం. ఈ క్రమంలో టీ తాగేందుకు భక్తులు రోడ్డు పక్కకు వెళ్లిన సమయంలో వేగంగా వచ్చిన స్కార్పియో వాహనం వారిని ఢీకొట్టినట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో అక్కడ ఒక్కసారిగా కలకలం రేగింది.

**నలుగురు మృతి.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు**

స్కార్పియో బలంగా ఢీకొట్టడంతో నలుగురు భవానీ భక్తులు మృతి చెందినట్లు ప్రాథమిక సమాచారం వెల్లడిస్తోంది. మృతులను ఎర్రయ్య, రమణ, సీతారాం, వరప్రసాద్‌గా గుర్తించినట్లు తెలుస్తోంది. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడటంతో వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

**దర్శనానికి వెళ్తుండగా విషాదం**

భక్తిశ్రద్ధలతో అమ్మవారి దర్శనం కోసం బయలుదేరిన భవానీ మాలాధారులు ఇలా రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం వారి కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. సంతోషంగా సాగాల్సిన ఆధ్యాత్మిక ప్రయాణం విషాదాంతంగా మారడంతో పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రమాదానికి కారణాలపై దర్యాప్తు**

ఈ ప్రమాదానికి స్కార్పియో వాహనం అధిక వేగమే కారణమా? డ్రైవర్ నిర్లక్ష్యం ఉందా? లేక మరేదైనా కారణం ఉందా? అనే అంశాలపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఘటనకు సంబంధించిన పరిస్థితులపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.



# కోలాహలంగా చైర్మన్ అభ్యర్థ శేషారావు, కౌన్సిలర్లకు ఫారం-బి అందజేత

**ప్రజాభూమి ప్రతినిధిరామచంద్రపురం**

రామచంద్రపురం మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో కూటమి అభ్యర్థుల ఎన్నికల ప్రచారం జోరందుకుంది. ఈ నెల 28న జరగనున్న మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, కూటమి ప్రభుత్వం బలపరిచిన తెలుగు దేశం పార్టీ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి మేడిశెట్టి శేషారావుతో పాటు టీడీపీ తరఫున పోటీ చేస్తున్న వార్డు కౌన్సిలర్ అభ్యర్థులకు పార్టీ తరఫున ఫారం-బి అందజేశారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, కూటమి సీనియర్ నాయకుల చేతుల మీదుగా ఈ ఫారాలను అందించారు. మరోవైపు, మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి మేడిశెట్టి శేషారావు తన ఎన్నికల ప్రచారాన్ని మరింత ముమ్మరం చేశారు. రామచంద్రపురం పట్టణం లోని వివిధ వాకింగ్ ట్రాక్‌లను సందర్శించి, ఉదయం నడకకు వచ్చిన ప్రజలను, గ్రౌండ్లకు వచ్చిన యువతను, ఇతర పట్టణవాసులను ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా కూటమి అభ్యర్థులకు తమ అమూల్యమైన ఓటును వేసి, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. అనంతరం పట్టణంలోని పలు వార్డుల్లో విస్తృతంగా పర్యటిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగుతున్నారు. చైర్మన్ అభ్యర్థి మేడిశెట్టి శేషారావుతో పాటు 32 వార్డుల్లో పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థులు ప్రచార కార్యక్రమాల్లో పాల్గొని ప్రజల మద్దతు కోరారు.

# భవానీ భక్తుల మృతిపై మంత్రి సుభాష్ దిగ్భ్రాంతి

**ప్రజాభూమి ప్రతినిధి,రామచంద్రపురం**

కాకినాడ జిల్లా కత్తిపూడి వద్ద భవానీ దీక్షలో ఉన్న నలుగురు రోడ్డు ప్రమాదంలో మృతి చెందటంపై రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. విజయవాడ కనకదుర్గ అమ్మవారి ఆలయానికి దర్శనం కోసం కాలినడకన వస్తున్న భవానీ భక్తులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందటం అత్యంత బాధాకరమని మంత్రి అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు.

# ప్రత్తిపాడు ఎలక్ట్రానిక్ మీడియా నూతన కార్యవర్గం ఎంపిక

- అధ్యక్షుడిగా కొండపల్లి శ్రీనివాస్.. గౌరవ అధ్యక్షుడిగా నిమ్మల హరిబాబు
- ఒమ్మంగిలో మీడియా ప్రతినిధుల సమావేశం.. జర్నలిస్టుల సంక్షేమం, ఐక్యతకు పెద్దపీట

**ప్రజాభూమి, ప్రత్తిపాడు**

కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గ ఎలక్ట్రానిక్ మీడియా నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి గ్రామంలోని రామిశెట్టి రమేష్ కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన సమావేశంలో నియోజకవర్గ పరిధిలోని వివిధ ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధుల ఐక్యత, సంక్షేమం, వృత్తిపరమైన సమస్యలు, ప్రజా సమస్యల పరిష్కారంలో మీడియా పోషించాల్సిన బాధ్యత తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.

**నూతన కార్యవర్గం ఎన్నిక**

నియోజకవర్గ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడిగా ఈటీవీ ప్రతినిధి కొండపల్లి శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడిగా నిమ్మల హరిబాబు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా టీవీ9 రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా దాడిశెట్టి వీరబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రాజ్ న్యూస్ సతీష్, జాయింట్ సెక్రటరీలుగా 10టీవీ దొడ్డ బాబ్జి, బిగ్ టీవీ మధు, కోశాధికారిగా ఐన్యూస్ నాగేంద్ర ఎంపికయ్యారు. వీరితో పాటు మరో 15 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

**మీడియా ప్రతినిధుల ఐక్యతే లక్ష్యం**

సమావేశంలో పాల్గొన్న మీడియా ప్రతినిధులు జర్నలిస్టులు ఎదుర్కొంటున్న వృత్తిపరమైన సమస్యలు, సంక్షేమం, పరస్పర సహకారం వంటి అంశాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. మీడియా ప్రతినిధులందరూ ఐక్యంగా ఉంటూ తమ సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేయాలని అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు వాటి పరిష్కారానికి కృషి చేయాల్సిన బాధ్యత మీడియాపై ఉందని పేర్కొన్నారు.

**మీడియా సభ్యుల సంక్షేమానికి కృషి చేస్తాం: అధ్యక్షుడు శ్రీనివాస్**

ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల సంక్షేమం, అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. మీడియా సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానన్నారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ, వారి వృత్తిపరమైన సమస్యలను పరిష్కరించుకునేందుకు ఐక్యంగా పనిచేస్తామని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై మీడియా వేగంగా స్పందించి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని ఆయన సూచించారు. ప్రజలకు, అధికార యంత్రాంగానికి మధ్య మీడియా వారధిగా నిలవాలని,



ప్రజాస్వామ్య వ్యవస్థలో తన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించాలని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని మీడియా ప్రతినిధులందరూ పరస్పర సహకారంతో ముందుకు సాగుతూ, వృత్తిపరమైన సమస్యలతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు**

ఈ సమావేశంలో టీవీ9 రామకృష్ణ, ఎన్టీవీ శ్రీధర్, టీవీ5 కొండపల్లి శ్రీనివాస్, ఈటీవీ వెంకటరమణ, 10టీవీ దొడ్డ బాబ్జి, సాక్షి టీవీ సుధీర్, ఏబీఎన్ ఆంధ్రజ్యోతి వల్లి, జీ తెలుగు న్యూస్ పెంటకోట సాయి, రాజ్ న్యూస్ సతీష్, స్టూడియో ఎన్ రాధాకృష్ణ, బిగ్ టీవీ మధు, మహా న్యూస్ నాగేశ్వరరావు, 99 శ్రీనివాస్, సుమన్ టీవీ శివ, ఐన్యూస్ నాగేంద్ర, హెచ్ఎంటీవీ స్వామి, బీఆర్‌కే న్యూస్ నిమ్మల హరిబాబు, డీ5 న్యూస్ దాడిశెట్టి వీరబాబు, మెట్రో టీవీ నాగేంద్ర, మెగా 9 కృపానందం, వీఎంఏ గణేష్, శ్రీ న్యూస్ అంజిబాబు, సిటీ న్యూస్ చినబాబు, అధికారీ న్యూస్ అధికారి తదితరులు పాల్గొన్నారు. నూతన కార్యవర్గం ఎంపికతో ప్రత్తిపాడు నియోజకవర్గ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల మధ్య సమన్వయం మరింత బలోపేతం కావడంతో పాటు జర్నలిస్టుల సంక్షేమం, ప్రజా సమస్యల పరిష్కారానికి సమష్టి కృషి జరిగేలా ముందుకు సాగాలని సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు ఆకాంక్షించారు.

# భవానీ భక్తుల మృతి తీవ్రంగా కలచివేసింది

- మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ప్రగాఢ సానుభూతి



**ప్రజాభూమి, ప్రత్తిపాడు**

కాకినాడ జిల్లా కత్తిపూడి సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో భవానీ భక్తులు మృతి చెందడం అత్యంత విషాదకరమని ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యురాలు వరుపుల సత్యప్రభ రాజా ఆవేదన వ్యక్తం చేశారు. విజయనగరం జిల్లా డెంకాడకు చెందిన భవానీ భక్తులు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారనే వార్త తనను తీవ్రంగా కలచివేసిందని పేర్కొన్నారు. అమ్మవారి దర్శనం కోసం భక్తిశ్రద్ధలతో బయలుదేరిన భవానీ మాలాధారులు మార్గమధ్యంలో ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. ఈ దుర్ఘటనలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. పుత్రశోకం, కుటుంబ సభ్యుల మృతితో తీవ్ర దుఃఖంలో ఉన్న బాధిత కుటుంబాలకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని కనకదుర్గమ్మ అమ్మవారిని వేడుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు తన సానుభూతిని తెలియజేస్తూ, క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# ఎస్.ఆర్. శంకరన్ జీవితం ఆదర్శం

- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

**ప్రజాభూమి ప్రతినిధి,కాకినాడ**

ఎస్.ఆర్. శంకరన్ జన్మదినాన్ని కేవలం వేడుకగా కాకుండా, ప్రజాభిముఖ పాలన,నిరాడంబరత, సామాజిక న్యాయం, బలహీన వర్గాల పట్ల అంకితభావం వంటి విలువలను స్మరించుకునే రోజుగా భావించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో ఎస్.ఆర్. శంకరన్, ఐఏఎస్ జన్మదినాన్ని పురస్క రించుకుని జిల్లా కలెక్టర్, డిఆర్ఓ శంకరన్ విగ్రహానికి పూలమాలలు అలంకరించి, పుష్ప గుచ్ఛాలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పేదలు, దళితులు, గిరిజనుల అభ్యున్నతికి తన జీవితాన్ని అంకితం చేసిన ఎస్.ఆర్. శంకరన్ ప్రజల ఐఏఎస్ అధికారిగా విశేష గుర్తింపు పొం దారని తెలిపారు. ఎస్.ఆర్. శంకరన్ 1934 అక్టోబర్ 22న తమిళనా డులోని తంజావూరు జిల్లాలో



జన్మించారని, మద్రాస్ విశ్వవిద్యాల యంలో బీకాం పూర్తి చేసిన అనంతరం మదురైలో మూడేళ్లపాటు అధ్యాపకుడిగా పనిచే శారని వివరించారు. 1957లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఐఏఎస్ క్యాడర్‌కు ఎంపికై, 1992 వరకు సుదీర్ఘకాలం సివిల్ సర్వీసుల్లో విశిష్ట సేవలం దించారన్నారు.. జిల్లా కలెక్టర్‌గా, ప్రిన్సిపల్ సెక్రటరీగా, వివిధ శాఖల కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారని తెలిపారు. ఉన్నత పదవుల్లో కొనసాగినప్పటికీ ఎస్.ఆర్. శంకరన్ అత్యంత నిరాడంబర మైన జీవితాన్ని గడిపారని జిల్లా కలెక్టర్ తెలిపారు. వ్యక్తిగత జీవితాన్ని పక్కనపెట్టి, తన సమయం, శక్తి, వనరులను పేదలు, అణగారిన వర్గాల సంక్షేమానికి అంకితం చేశారని తెలిపారు. 2010 అక్టోబర్ 7న హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచినప్పటికీ, ప్రజల పట్ల ఆయన చూపిన అంకితభావం, సామాజిక న్యాయం కోసం చేసిన కృషి, పరిపాలనలో పాటించిన నైతిక విలువలు నేటికీ సివిల్ సర్వీసు అధికారులకు శాశ్వత ప్రేరణగా నిలుస్తు న్నాయని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ అధికారులు ప్రజల అవసరాలకు ప్రాధాన్య మిస్తూ, అణగారిన వర్గాల సంక్షేమం కోసం నిబద్ధతతో పనిచేయడ మే ఎస్.ఆర్. శంకరన్‌కు అందించే నిజమైన నివాళి అని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి డా. తిప్పే నాయక్, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీటీసీ, జడ్పీటీసీ నామినేషన్ కేంద్రాల్లో ఎస్పీ పర్యటన

- భద్రతా ఏర్పాట్ల పరిశీలన.. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

ప్రజా భూమి ప్రతినిధి - అనకాపల్లి

జిల్లాలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ రెండో రోజుకు చేరుకున్న నేపథ్యంలో నామినేషన్ కేంద్రాలు, పరిసర ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బుచ్చయ్యపేట, రావికమతం, రోలుగుంట మండలాల్లోని నామినేషన్ కేంద్రాలను సందర్శించి పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. బుచ్చయ్యపేట మండలంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద కొత్తకోట సీఐ జి. కోటేశ్వరరావు, ఎస్సై మనోజ్ కుమార్‌లతో కలిసి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. రావికమతం ఎంపీడీవో కార్యాలయం వద్ద కొత్తకోట ఎస్సై శ్రీనివాస్‌తో, రోలుగుంట ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎస్సై రామకృష్ణా రావుతో కలిసి నామినేషన్ కేంద్రాల వద్ద పరిస్థితులను సమీక్షించారు. అనంతరం జిల్లా పరిషత్ కార్యాలయ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బందోబస్తును పరిశీలించారు. 100 మీటర్ల పరిధిలో నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలి. నామినేషన్ కేంద్రాల వద్ద 100 మీటర్ల పరిధికి సంబంధించిన నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని ఎస్పీ పోలీసు అధికారులను ఆదేశించారు. నామినేషన్ కేంద్రాల వద్ద ప్రజలు గుంపులుగా గుమిగూడకుండా చర్యలు తీసుకోవాలని, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన వర్గాల మధ్య వాగ్వాదాలు, ఘర్షణలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నామినేషన్ దాఖలు చేసేందుకు వచ్చే అభ్యర్థితో పాటు నిబంధనల ప్రకారం అనుమతించిన వ్యక్తులను మాత్రమే కేంద్రంలోకి అనుమతించాలని స్పష్టం చేశారు. నామినేషన్ ప్రక్రియ పూర్తయిన వెంటనే అభ్యర్థులు, వారితో వచ్చిన వ్యక్తులు అక్కడ వేచి ఉండకుండా వెనుదిరిగే లా చర్యలు తీసుకోవాలన్నారు. ర్యాలీల నిర్వహణలో సమన్వయం పాటించాలి. వివిధ రాజకీయ పార్టీలు ఒకే సమయంలో నామినేషన్లకు రాకుండా వేర్వేరు సమయాల్లో వచ్చేలా సమన్వయం చేసుకోవాలని ఎస్పీ సూచించారు. నామినేషన్ల ప్రక్రియకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా, శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. నిర్ణీత గడువులోగా నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా పూర్తయ్యేలా సంబంధిత అధికారులు బాధ్యతతో విధులు నిర్వహించాలని తెలిపారు.



**డ్రోన్లతో నిరంతర నిఘా**

నామినేషన్ కేంద్రాలు, పరిసర ప్రాంతాల్లో భద్రతను పర్యవేక్షించేందుకు డ్రోన్ల ద్వారా నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నం చేసినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

**సెక్షన్ 30 పోలీస్ యాక్ట్, సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ అమల్లో**

జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా సెక్షన్ 30 పోలీస్ యాక్ట్, సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ నిబంధనలు అమల్లో ఉన్నాయని ఎస్పీ స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు ప్రజలు, అభ్యర్థులు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. ఈ పర్యటనలో సంబంధిత పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌ను కలిసిన మాగంటి బాబు కుటుంబం

- జెడ్పీ చైర్మన్ అభ్యర్థిత్వానికి పద్మవల్లీ దేవికి మద్దతు కోరిన మాగంటి బాబు

ప్రజాభూమి ఏలూరు

పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ కుమార్ యాదవ్‌ను మాజీ మంత్రి,మాజీ ఎంపీ మాగంటి వెంకటేశ్వరరావు (బాబు),ఆయన సతీమణి మాగంటి పద్మవల్లీ దేవి, కుమార్తె రావళి గురువారం ఉదయం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా రానున్న ఎన్నికల్లో ఏలూరు జిల్లా పరిషత్ చైర్మన్ పదవికి కూటమి తరఫున పద్మవల్లీ దేవి అభ్యర్థిత్వాన్ని బలపరచాలని,ఆమెకు సంపూర్ణ మద్దతు అందించాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్‌ను మాగంటి బాబు కోరారు.మాగంటి కుటుంబానికి జిల్లా పరిషత్‌తో మూడు తరాలుగా ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు.అలాగే ఏలూరు పార్లమెంట్ పరిధిలో కూటమి బలోపేతం,రానున్న ఎన్నికల్లో విజయావకాశాలు, అనుసరించాల్సిన వ్యూహాలపై నేతలు చర్చించినట్లు తెలిసింది.ఈ సమావేశంలో ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్,మాజీ మంత్రి మాగంటి వెంకటేశ్వరరావు (బాబు), పద్మవల్లీ దేవి,రావళితో పాటు కూటమి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



## జడ్పీ చైర్‌పర్సన్ పదవిపై ఆశలు

- ఎంపీ పుట్టా మహేష్‌ను కలిసిన నవ్యశ్రీ

ప్రజాభూమి ఏలూరు

జడ్పీ చైర్‌పర్సన్ అభ్యర్థిత్వానికి మద్దతు కోరుతూ ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్‌ను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కుమార్తె నవ్యశ్రీ వేర్వేరుగా కలిశారు. నవ్యశ్రీ జడ్పీ చైర్‌పర్సన్ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ఇద్దరి అభ్యర్థనలను విన్న ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్,ఈ విషయాన్ని పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.పార్టీ ఎవరి అభ్యర్థిత్వాన్ని ప్రకటించినా, నాయకులందరూ సమన్వయంతో పనిచేస్తూ పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు.

## ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

- డీఎంహెచ్ఓ డా.శోభ

ప్రజాభూమి ఏలూరు

ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం ఏలూరు జిల్లా నూతన కార్యవర్గం నేతలు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.యూ. శోభను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఉద్యోగులు హక్కులతో పాటు బాధ్యతలను సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని ఆమె సూచించారు. ఉద్యోగుల సమస్యలను జిల్లా స్థాయిలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లా అప్పారావు, కార్యదర్శి టి.శ్రీనుబాబు మాట్లాడుతూ నూతన జిల్లా కార్యవర్గానికి రాష్ట్ర కార్యవర్గం ఆమోదం తెలిపిందని వెల్లడించారు.ఉద్యోగుల



సమస్యలను సానుకూల దృక్పథంతో పరిష్కరించి, ఉద్యోగులకు అనుకూల వాతావరణం కల్పించాలని డీఎంహెచ్ఓను కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు టి.బేబీ, జాయింట్ సెక్రటరీలు ఎం. సుబ్బారావు,ఎం.వి. శిరీష, ఆర్గనైజింగ్ సెక్రటరీలు ఆర్. పార్థసారథి, పి.ఎస్.ఆర్.కె. ప్రసాద్, కె.జయ మేరీ, ట్రెజరర్ కె.బి.రాజేంద్ర ప్రసాద్,కె.కళావతి పాల్గొన్నారు.

## యలమంచిలి జడ్పిటిసి టికెట్ జనసేనకు కేటాయింపు

ప్రకటించిన మంత్రి నిమ్మల

ప్రజాభూమి ప్రతినిధి పాలకొల్లు



పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గం లోని ఎలమంచిలి మండలం, జడ్పిటిసి టికెట్ జనసేన కు కేటాయించి నట్లు ఏపీ రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఖరారు చేశారు. యలమంచిలి జడ్పిటిసి అభ్యర్థినిగా కొడవటి నాగలక్ష్మి పేరు ఖరారయ్యింది. ఈ మేరకు మంత్రి నిమ్మల ప్రకటించారు. నాగలక్ష్మి భర్త వరబాబు యలమంచిలి మండలం జనసేన అధ్యక్షులు గా సేవలందిస్తున్నారు. ఈ సందర్భంగా వరబాబు మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నిమ్మల కు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం నామినేషన్ భీమవరం కలెక్టర్ కార్యాలయం లో వేయనున్నట్లు తెలిపారు.

## సుతర్ల రామ మందిరంలో ప్రత్యేక పూజలు

ప్రజాభూమి ప్రతినిధి నూజివీడు

నూజివీడు మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 14వ వార్డు సుతర్ల రామమందిరంలో రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం కూటమి నాయకులు, కౌన్సిలర్ అభ్యర్థులతో కలిసి ఎన్నికల ప్రసారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూఅభివృద్ధి ప్రదాత, సంక్షేమ అభివృద్ధిని కొత్త పుంతలు తొక్కిస్తున్న నాయకుడు, అమరావతి శిల్పి అయిన మన ప్రియతమ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వాన్ని బలపరచాలంటే మున్సిపాలిటీలోని 36 వార్డులకు 36 వార్డులు గెలిచి మన ప్రియతమ నాయకుడికి బహుమతిగా అందజేయాలని నాయకులకు కౌన్సిల్ అభ్యర్థులకు పిలుపునిచ్చారు. నూజివీడు పట్టణంలో గత 30 ఏళ్లలో లేని అభివృద్ధిని చేసి చూపించిన కూటమి పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. కూటమి పార్టీలోని జనసేన, బీజేపీ, తెలుగుదేశం పార్టీ నాయకులంతా సమన్వయంతో కౌన్సిలర్ అభ్యర్థులంతా కలిసికట్టుగా పనిచేయాలని, నూజివీడు మున్సిపాలిటీలో తెలుగుదేశం జెండా ఎగరవేయాలని



పిలుపునిచ్చారు.విజయ లక్ష్య సాధనకు అందరూ కలిసి సమన్వయంతో పనిచేసి విజయ దంకా మోగించాలని అన్నారు. పోటీలో ఉన్న సోదరీ సోదరీమణులు, అన్నదమ్ములందరికీ, కూటమి తరఫున పోటీలో నిలుస్తున్న ప్రతి ఒక్కరూ కలిసి సమన్వయంతో కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.విజయంతో వర్ధిల్లి, తెలుగుదేశం జెండా పట్టణంలో గడపగడపకు రెపరెపలాడేలా చేస్తారన్న నమ్మకంతో రాములవారికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు మంత్రి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కైకలూరు జడ్పీటీసీ అభ్యర్థిగా బలే యేసు రాజు నామినేషన్




ప్రజాభూమి ఏలూరు

కైకలూరు తెలుగుదేశం పార్టీ తరఫున కైకలూరు మండల జడ్పీటీసీ అభ్యర్థిగా బలే యేసురాజు నామినేషన్ దాఖలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా పరిషత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, కూటమి ఆదేశాల మేరకు తనకు అభ్యర్థిగా అవకాశం కల్పించిన కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌తో పాటు కూటమి నాయకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వ హయాంలో కైకలూరు మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని పేర్కొన్నారు. జడ్పీటీసీగా విజయం సాధిస్తే ప్రజా సంక్షేమం,మండల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని బలే యేసు రాజు తెలిపారు.

## ఏలూరులో అయ్యప్ప స్వాములకు 51 రోజుల భిక్ష కార్యక్రమం ప్రారంభం

ప్రజాభూమి ఏలూరు



స్థానిక అగ్రహారంలోని పేరయ్య కోనేరు రామకోటి ప్రాంగణంలో అన్నపూర్ణ సహిత హరిహర పుత్ర అయ్యప్ప సమాజం ఆధ్వర్యంలో సర్వమాలధారణ స్వాములకు 4వ వార్షిక భిక్ష కార్యక్రమం గురువారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపీఎస్ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్, జనసేన ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి రెడ్డి అప్పలనాయుడు,జనసేన సీనియర్ నాయకులు నారా శేషు హాజరయ్యారు.తొలుత అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు,అర్చనలు నిర్వహించి మహా నైవేద్యం సమర్పించిన అనంతరం అతిథులు భిక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ అన్నదానం మహాదానమని, సర్వమాలధారణ స్వాముల కోసం ఈ కార్యక్రమాన్ని 51 రోజుల పాటు నిరంతరాయంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సమాజం అధ్యక్షుడు కొట్టు మధు,కొట్టు మనోజ్,తలారి రాము గురుస్వామి, జగపతి మనోహర్ గురుస్వామి,కృష్ణ గురుస్వామి,అన్నదాన కమిటీ సభ్యులు,అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

## 25న విశ్వబ్రాహ్మణ ధర్మపీఠం తృతీయ వార్షికోత్సవం

- ఏలూరులో రాష్ట్రస్థాయి కార్యక్రమం.
- వైశ్వకర్మణ హోమము పుస్తకావిష్కరణ
- ముఖ్య అతిథిగా తెలంగాణ పోలీస్ క్రైమ్ విభాగం ఏసీపీ కె.ఎం. కిరణ్ కుమార్

ప్రజా భూమి బ్యూరో ఏలూరు జిల్లా

ఆధ్యాత్మిక చైతన్యం, వైదిక ధర్మ ప్రచారం, విశ్వబ్రాహ్మణ సమాజ ఐక్యత, సంస్థాగత బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ ధర్మపీఠం తృతీయ వార్షికోత్సవాన్ని ఈనెల 25వ తేదీన ఏలూరులో రాష్ట్రస్థాయిలో నిర్వహించనున్నట్లు ధర్మపీఠం ప్రధాన సంచాలకులు అప్పలభక్తుల శివకేశవరావు (శివశ్రీ) తెలిపారు. ఏలూరు స్థానిక బులియన్ మర్చెంట్స్ అసోసియేషన్ హాలులో ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో 'వైశ్వకర్మణ హోమము' గ్రంథావిష్కరణ, పండితుల ఆధ్యాత్మిక ప్రసంగాలు, జిల్లా స్థాయి సంస్థాగత నిర్మాణంపై చర్చలు ప్రధాన ఆకర్షణలుగా నిలవనున్నాయని వెల్లడించారు. ఈ వార్షికోత్సవ ఆహ్వాన పత్రాలను ఏలూరులోని కామాక్షి విశ్వబ్రాహ్మణ సత్రంలో ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విశ్వబ్రాహ్మణుల ఆధ్యాత్మిక, వైదిక, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణతో పాటు సమాజ అభ్యున్నతికి ధర్మపీఠం కృషి చేస్తోందని వివరించారు.

**చారిత్రక నేపథ్యంతో ధర్మపీఠం ప్రస్థానం**

1974లో పండిత త్రయం యర్రోజు మాధవాచార్యులు సభాపతిగా, కొండూరు వీరరాఘవాచార్యులు ప్రధాన



సంచాలకులుగా, దురిశేటి వెంకట రామాచార్యులు సంచాలకులుగా ఈ సంస్థను స్థాపించారని శివశ్రీ గుర్తుచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో ధర్మపీఠాన్ని పునర్నిర్మించి, ఆధ్యాత్మిక, ధార్మిక, సామాజిక సేవా కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. ఈ పునర్నిర్మాణ ప్రస్థానంలో మూడేళ్లు పూర్తయిన సందర్భంగా తృతీయ వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

**ముఖ్య అతిథిగా ఏసీపీ కె.ఎం. కిరణ్ కుమార్**

ఈ కార్యక్రమానికి ధర్మపీఠం వ్యవస్థాపక సభాపతి యర్రోజు మాధవాచార్యుల మనుమడు, తెలంగాణ పోలీస్ శాఖ క్రైమ్ విభాగంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా విధులు నిర్వహిస్తున్న కె.ఎం. కిరణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ధర్మపీఠం సభాపతి, విశ్రాంత అద్వైత వేదాంత ఆచార్యులు చంద్రపాటి నాగవరప్రసాదరావు అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించనున్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి విశ్వబ్రాహ్మణ ప్రముఖులు, పండితులు, సంఘాల ప్రతినిధులు, ఆధ్యాత్మికవేత్తలు పాల్గొననున్నారు.

**'వైశ్వకర్మణ హోమము' గ్రంథావిష్కరణ ప్రత్యేక ఆకర్షణ**

ధర్మపీఠం ఆధ్వర్యంలో పండితుల పరిశోధన, అధ్యయనం ఆధారంగా రూపొందించిన 'వైశ్వకర్మణ హోమము' గ్రంథాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించనున్నారు. వైదిక సంప్రదాయంలో వైశ్వకర్మణ హోమానికి ఉన్న ప్రాధాన్యం, దాని విధివిధానాలను తెలియజేస్తూ ఆధ్యాత్మిక ఆసక్తి కలిగినవారికి, ధార్మిక ఆచరణను అనుసరించేవారికి ఉపయోగపడేలా ఈ గ్రంథాన్ని రూపొందించినట్లు నిర్వాహకులు తెలిపారు.

అలాగే విశ్వకర్మ పరమాత్మ విశ్వసృష్టి క్రమం, వైదిక ధర్మ విశిష్టత, విశ్వబ్రాహ్మణుల ఆధ్యాత్మిక వారసత్వం తదితర అంశాలపై పండితుల ప్రసంగాలు నిర్వహించనున్నారు. ధర్మపీఠం కార్యకలాపాలను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు జిల్లాలవారీగా కార్యవర్గాల నియామకంపై కూడా చర్చించి, సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్ఠం చేయనున్నట్లు శివశ్రీ తెలిపారు. విశ్వబ్రాహ్మణ సమాజ ఐక్యతను బలోపేతం చేస్తూ, భావితరాలకు వైదిక, ఆధ్యాత్మిక సంప్రదాయాలను పరిచయం చేసే దిశగా ఈ వార్షికోత్సవం దోహదపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ఆధ్యాత్మికవేత్తలు, పండితులు, విశ్వబ్రాహ్మణ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, ఆహ్వానితులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా స్థానిక విశ్వబ్రాహ్మణ సంఘాల నాయకులు గొల్లపల్లి కామేశ్వరరావు సిద్ధాంతి, పొట్నూరి శివరావు, లక్కోజు వెంకటేశ్వరరావు (కొండబాబు), యలబాక కృష్ణ, అనుపోజు త్రినాథ్, కెల్ల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ముదినేపల్లి జడ్పీటీసీ అభ్యర్థిగా తిరువీధుల శారద నామినేషన్



ప్రజాభూమి ఏలూరు

కైకలూరు నియోజకవర్గం ముదినేపల్లి మండల జడ్పీటీసీ అభ్యర్థిగా కూటమి నాయకులు బలపరిచిన బీజేపీ అభ్యర్థి తిరువీధుల శారద గురువారం ఏలూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు.ఈ సందర్భంగా శారద మాట్లాడుతూ కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసరావు ఆశీర్వాదంతో, కూటమి నాయకుల సారథ్యంలో జడ్పీటీసీగా పోటీ చేస్తున్నట్లు తెలిపారు.తనకు అభ్యర్థిగా అవకాశం కల్పించిన కూటమి నాయకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.తనను గెలిపిస్తే ముదినేపల్లి మండలంలోని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని,ప్రజా సంక్షేమానికి పాటుపడతానని పేర్కొన్నారు.జిల్లాలోనే కాకుండా రాష్ట్రస్థాయిలోనూ వివిధ సంఘాల్లో పనిచేసిన అనుభవం తనకు ఉందని శారద తెలిపారు.

ప్రజాభూమి

అనంతపురం,శ్రీసత్యసాయి జిల్లా 6

శుక్రవారం 23 అక్టోబరు 2026

# నామినేషన్ కేంద్రాల్లో ఆంక్షలు

### -ఎంపీటీసీ నామినేషన్ల వేళ మీడియాకు నో ఎంట్రీ.. -బందోబస్తు మాటున సమాచారానికి అడ్డుకట్ట.. -అధికారుల తీరుపై విమర్శలు....!

ప్రజాభూమి, హిందూపురం టౌన్

స్థానిక సంస్థల ఎన్నికలు శాసనసభ, పార్లమెంట్ ఎన్నికలను తలపిస్తున్నాయి. ప్రజాస్వామ్య ప్రక్రియలో అత్యంత కీలకమైన నామినేషన్ల స్వీకరణ సమయంలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అధికారులు, మీడియా ప్రతినిధులను నామినేషన్ కేంద్రాల బయటే నిలిపివేయడం చర్చనీయాంశంగా మారింది. ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా రెండో రోజైన గురువారం నియోజకవర్గ వ్యాప్తంగా మండల పరిషత్ కార్యాలయాల వద్ద పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. భద్రతా చర్యల్లో భాగంగా అభ్యర్థుల రాకపోకలపై ఆంక్షలు విధించడం ఒక ఎత్తయితే, వార్తల సేకరణ కోసం వచ్చిన మీడియా ప్రతినిధులకు సైతం లోపలికి అనుమతి నిరాకరించడం మరో ఎత్తుగా మారింది. దీంతో నామినేషన్ కేంద్రాల లోపల అసలేం జరుగుతోంది, అక్కడి పరిస్థితులు ఎలా ఉన్నాయి, అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఏ విధంగా సాగుతోందన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

**బందోబస్తు సరే.. మీడియాకు అనుమతి ఏదీ...**

ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయడం సహజం. అభ్యర్థులు, వారి ప్రతినిధుల రాకపోకలను క్రమబద్ధీకరించడం, అనవసరమైన జనసందోహాన్ని నియంత్రించడం కూడా అవసరమే. అయితే భద్రతా చర్యల పేరుతో వార్తల సేకరణకు వచ్చిన మీడియా ప్రతినిధులను సైతం పూర్తిగా దూరంగా ఉంచడం ఇప్పుడు చర్చకు దారితీస్తోంది. మండల పరిషత్ కార్యాలయాల వద్ద పోలీసులు విధులు నిర్వహిస్తూ, నామినేషన్ దాఖలు చేసేందుకు వచ్చిన అభ్యర్థుల పత్రాలను పరిశీలించిన అనంతరం లోపలికి అనుమతిస్తున్నట్లు సమాచారం. అయితే మీడియా ప్రతినిధులకు మాత్రం అలాంటి అవకాశం కల్పించకపోవడంతో ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన ప్రత్యక్ష సమాచారాన్ని సేకరించడం కష్టతరంగా మారింది. నామినేషన్ల దాఖలు సమయంలో అభ్యర్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, పత్రాల స్వీకరణలో అనుసరిస్తున్న విధానం, ఎన్నికల



అధికారులు అందిస్తున్న సూచనలు, నిబంధనల అమలు వంటి అంశాలను పరిశీలించి ప్రజలకు తెలియజేయడం మీడియా బాధ్యత. అలాంటి సమయంలో మీడియాను కార్యాలయాల బయటే నిలిపివేయడంతో నామినేషన్ కేంద్రాల్లో జరుగుతున్న పరిణామాలపై ప్రత్యక్ష సమాచారం అందుబాటులో లేకుండా పోతోంది. ఫలితంగా అధికారులు అందించే సమాచారం లేదా బయటకు వచ్చే వివరాలపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

**శాసనసభ ఎన్నికల్లో అనుమతి.. స్థానిక ఎన్నికల్లో ఎందుకు నిరాకరణ..**

శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో నామినేషన్ల దాఖలు, పరిశీలన వంటి కీలక ఘట్టాలకు మీడియా ప్రాధాన్యమిస్తూ వార్తలను సేకరిస్తుంది. ఎన్నికల అధికారుల ప్రకటనలు, అభ్యర్థుల నామినేషన్లు, అభ్యంతరాలు, తిరస్కరణలు, ఎన్నికల నిబంధనల అమలు వంటి అంశాలను ప్రజలకు చేరవేస్తుంది. అయితే ప్రస్తుతం జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మాత్రం మీడియా ప్రతినిధులను కార్యాలయాల లోపలికి అనుమతించకపోవడం ఎందుకన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. శాసనసభ ఎన్నికలతో పోలిస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో పారదర్శకత అవసరం తక్కువా? గ్రామీణ ప్రాంతాల ప్రజలకు తమ ప్రాంత ప్రజాప్రతినిధుల ఎంపిక ప్రక్రియ గురించి తెలుసుకునే హక్కు లేదా అన్న చర్చ కూడా మొదలైంది. అయితే ఎన్నికల సమయంలో ప్రతి కేంద్రంలోనూ మీడియా ప్రవేశానికి ఒకే విధమైన అనుమతి ఉంటుందని భావించలేం. ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, సంబంధిత ఎన్నికల అధికారి అనుమతులు, భద్రతా పరిమితులు కీలకంగా ఉంటాయి. అయినప్పటికీ మీడియా ప్రవేశంపై ఆంక్షలు విధిస్తే, వాటికి సంబంధించిన నిబంధనలు ఏమిటో అధికారులు స్పష్టంగా తెలియజేయాల్సిన అవసరం ఉంది. అనుమతి నిరాకరణకు కారణాలను వెల్లడించకుండా మీడియాను ఒక కార్యాలయం నుంచి మరో కార్యాలయానికి తిప్పడం లేదా సంబంధిత అధికారులు ఒకరిపై మరొకరు బాధ్యతను నెట్టుకోవడం సరైన పద్ధతి కాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**లోపల ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి...!**

నామినేషన్ల ప్రక్రియలో ప్రతి అభ్యర్థికి సమాన అవకాశాలు కల్పించడం, నిబంధనలను అందరికీ ఒకే విధంగా అమలు చేయడం, పత్రాల స్వీకరణలో ఎలాంటి వివక్షకు తావులేకుండా చూడడం ఎన్నికల అధికారుల బాధ్యత. ఈ ప్రక్రియకు సంబంధించిన సమాచారాన్ని మీడియా సేకరించడం ద్వారా ప్రజలకు వాస్తవ పరిస్థితులు తెలుస్తాయి. అయితే మీడియాకు ప్రవేశం లేకపోవడంతో నామినేషన్ కేంద్రాల లోపల జరుగుతున్న పరిణామాలపై ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం లేకుండా పోతోంది. దీనివల్ల అనుమానాలు తలెత్తుతున్నాయే తప్ప, లోపల ఏదైనా అక్రమం జరుగుతోందని నిర్ధారించే ఆధారాలు మాత్రం ప్రస్తుతం లేవు. ఈ నేపథ్యంలో అనుమానాలకు తావులేకుండా అధికారులు వాస్తవ పరిస్థితులను వెల్లడించాల్సిన అవసరం ఉంది. నామినేషన్ కేంద్రాల్లోకి అనధికార వ్యక్తులను అనుమతించకపోవడం, అభ్యర్థుల రాకపోకలను నియంత్రించడం వంటి చర్యలు ఎన్నికల నిర్వహణలో భాగంగా ఉండవచ్చు. అదే సమయంలో మీడియాకు అనుమతి నిరాకరించినప్పుడు దానికి సంబంధించిన నిబంధనలు, ప్రత్యామ్నాయంగా సమాచారాన్ని అందించే విధానం, అధికారిక వివరాలు పొందే మార్గాలను స్పష్టంగా తెలియజేయడం కూడా ముఖ్యం. భద్రత, పారదర్శకత రెండింటినీ సమన్వయం చేయడం ద్వారా మాత్రమే ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది.

**పారదర్శకతపై ప్రశ్నలకు సమాధానం చెప్పేదెవరు...**

స్థానిక సంస్థల ఎన్నికలు ప్రజలకు అత్యంత దగ్గరగా ఉండే ప్రజాస్వామ్య ప్రక్రియ. గ్రామాలు, మండలాల అభివృద్ధికి సంబంధించిన నిర్ణయాల్లో కీలక పాత్ర పోషించే ప్రజాప్రతినిధులను ఎన్నుకునే ఈ ప్రక్రియలో ప్రతి పరిణామం ప్రజలకు తెలియాలి. నామినేషన్ల స్వీకరణ నుంచి పరిశీలన, ఉపసంహరణ వరకు ప్రతి దశలోనూ నిబంధనల అమలు, అభ్యర్థుల హక్కులు, ఎన్నికల అధికారుల నిర్ణయాలపై స్పష్టత ఉండాలి. ఈ వివరాలను ప్రజలకు చేరవేయడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుంది. ఈ నేపథ్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా మండల పరిషత్ కార్యాలయాల వద్ద మీడియా ప్రవేశంపై విధించిన ఆంక్షలకు కారణాలేమిటో సంబంధిత అధికారులు వెల్లడించాల్సి ఉంది. భద్రత పేరుతో పారదర్శకతపై సందేహాలు తలెత్తకుండా చూడటం ఎన్నికల యంత్రాంగం బాధ్యత. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు నిర్వహించడం ఎంత ముఖ్యమో, అవి నిబంధనలకు అనుగుణంగా జరుగుతున్నాయన్న నమ్మకాన్ని ప్రజల్లో కల్పించడం కూడా అంతే ముఖ్యం. మరి ఈ అంశంపై జిల్లా ఎన్నికల అధికారులు, సంబంధిత ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

## పెద్దపప్పూరులో నామినేషన్ల ప్రక్రియను పరిశీలించిన జిల్లా సంయుక్త కలెక్టర్ సి.విష్ణుచరణ్..



ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

అనంతపురం జిల్లా స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా జెడ్పిటిసి / ఎంపిటిసి ఎన్నికలు – 2026 కు సంబంధించి పెద్దపప్పూరు మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో గురువారం ఎంపిటిసి నామినేషన్ల ప్రక్రియను జిల్లా సంయుక్త కలెక్టర్ సి.విష్ణుచరణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ఎన్నికల నోటిఫికేషన్ షెడ్యూల్ ప్రకటన, నోటీస్ బోర్డు ఏర్పాటు, సీసీటీవీ కెమెరాల ఏర్పాటు, సెక్యూరిటీ సమస్యలు, తదితర వివరాలను జిల్లా సంయుక్త కలెక్టర్ ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా ఎంపిటిసి నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. అభ్యర్థులకు కుల ధృవీకరణ పత్రాలు, ఆదాయ ధృవీకరణ పత్రాలను సమయానికి ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి ఎలాంటి భద్రత సమస్యలు రాకుండా చూడాలన్నారు. నామినేషన్ల చివరి రోజు చివరి సమయంలో ఇబ్బందులు రాకుండా పటిష్ట జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఏమైనా సమస్యలు ఉన్నాయా అంటూ ఆర్ఓ, పోలీసులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సుయాష్ కుమార్, ఎంపీడీవో పెద్దపప్పూరు, డిఎం మార్క్ఫెడ్ మరియు ఎన్నికల అధికారి పెన్నేశ్వరి, తహసీల్దార్ బాలాజీ రాజు, ఎన్నికల సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

## పోలీస్ బందోబస్తు మధ్య సజావుగా రెండో రోజు ఎంపీటీసీ నామినేషన్లు



ప్రజా భూమి నార్పల

మండల పరిషత్ కార్యాలయంలో రెండో రోజు ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. నామినేషన్ల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఐ రామయ్య, ఎస్ఐ సాగర్, ఏఎస్ఐ భీమ్లా నాయక్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఎంపీటీసీ అభ్యర్థుల నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ, అభ్యర్థులను ఒక్కొక్కరిగా కార్యాలయంలోకి అనుమతించారు. పోలీసుల పర్యవేక్షణలో నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగింది. ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా రెండో రోజు నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది.

## నామినేషన్ ఉపసంహరణలో అక్రమాలంటూ ఆరోపణలు

### -ప్రపోజర్లు లేకుండానే విత్‌డ్రా చేసినట్లు చూపించారని ఇండిపెండెంట్ అభ్యర్థి ఆవేదన

ప్రజాభూమి, హిందూపురం టౌన్



హిందూపురం పురపాలక సంఘం ఎన్నికల నేపథ్యంలో ఒకటో వార్డులో నామినేషన్ ఉపసంహరణ వ్యవహారం వివాదాస్పదంగా మారింది. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెంకటరంగప్ప తన నామినేషన్‌ను అక్రమంగా ఉపసంహరించినట్లు నమోదు చేశారని ఆరోపించారు. తనతో పాటు తన నామినేషన్‌కు ప్రతిపాదకులుగా ఉన్నవారు ఎవరూ అక్కడ లేకుండానే నామినేషన్ ఉపసంహరణ జరిగినట్లు అధికారులు చూపించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై ఎన్నికల అధికారులను ప్రశ్నించినప్పటికీ సరైన సమాధానాలు ఇవ్వడం లేదని వెంకటరంగప్ప ఆరోపించారు. తన నామినేషన్ ఉపసంహరణకు సంబంధించిన వివరాలు అడిగేందుకు వెళ్లిన తమను పోలీసులు అక్కడ ఉండనివ్వకుండా పంపించేస్తున్నారని వాపోయారు. ఎన్నికల ప్రక్రియపై అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో అధికారులు పారదర్శకంగా వ్యవహరించి వాస్తవాలను వెల్లడించాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికల్లో పోటీ చేయడం ప్రతి ఒక్కరికీ ఉన్న హక్కు అని, అలాంటి అవకాశాన్ని తనకు దూరం చేస్తున్నారని వెంకటరంగప్ప ఆవేదన వ్యక్తం చేశారు. ఒకటో వార్డులో జరిగిన నామినేషన్ ఉపసంహరణ ప్రక్రియపై సమగ్ర విచారణ జరిపించాలని, నిబంధనలకు విరుద్ధంగా ఉపసంహరణ నమోదు చేసినట్లు తేలితే ఆ ప్రక్రియను రద్దు చేసి, తనకు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు వెంకటరంగప్ప వెల్లడించారు. ఎన్నికల అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు.

## గడ్డంనాగేపల్లి ఎంపీటీసీ అభ్యర్థులుగా రామలక్ష్మి నాగలక్ష్మి

ప్రజా భూమి నార్పల





గడ్డంనాగేపల్లి ఎంపీటీసీ స్థానానికి కూటమి అభ్యర్థిగా పుట్టకాల రామలక్ష్మి, వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా చిగిచెర్ల నాగలక్ష్మి పోటీలో ఉన్నారు. రెండు పార్టీల నుంచి అభ్యర్థులు బరిలో ఉండటంతో ఎంపీటీసీ ఎన్నికపై స్థానికంగా ఆసక్తి నెలకొంది. ఈ ఎన్నికల్లో ఓటర్లు ఎవరికి మద్దతు తెలుపుతారన్నది చర్చనీయాంశంగా మారింది. గడ్డంనాగేపల్లి ఎంపీటీసీ స్థానంలో విజయం ఎవరిని వరిస్తుందో ఎన్నికల ఫలితాల తర్వాత తేలనుంది.

### జిల్లాలో కొన్ని చోట్ల చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంత వాతావరణంలో

## జెడ్పీటీసీ, ఎంపిటిసి ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది

### అనంతపురం జిల్లా స్థానిక సంస్థల జనరల్ అబ్జర్వర్ బి.స్మరణ్ రాజ్, జిల్లా ఎక్స్పెండిచర్ అబ్జర్వర్ సుబ్బరాజు ఐఎఫ్ఎస్

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

అనంతపురం జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ కొన్ని చోట్ల చెదురు మదురు ఘటనలు మినహా ప్రశాంత వాతావరణంలో కొనసాగుతోందని అనంతపురం జిల్లా స్థానిక సంస్థల జనరల్ అబ్జర్వర్ బి.స్మరణ్ రాజ్, జిల్లా ఎక్స్పెండిచర్ అబ్జర్వర్ సుబ్బరాజు ఐఎఫ్ఎస్ పేర్కొన్నారు. గురువారం అనంతపురం జిల్లా పరిషత్ లో జరుగుతున్న జడ్పిటిసి ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను జనరల్ అబ్జర్వర్ బి.స్మరణ్ రాజ్, జిల్లా ఎక్స్పెండిచర్ అబ్జర్వర్ సుబ్బరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... అనంతపురం జిల్లాలో జడ్పిటిసి, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ కొన్నిచోట్ల చెదురు మదురు ఘటనలు మినహా ప్రశాంత వాతావరణం



లో జరుగుతోందన్నారు. అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసుకునేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలన్నారు. ఈ నెల 21వ తేదీ నుంచి 23 వరకు జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించి ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులకు నామినేషన్లు దాఖలు చేసేందుకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని అక్కడ సిబ్బందికి సూచించారు. ఈ ఎన్నికలలో జడ్పిటిసి అభ్యర్థి ఎన్నికల ఖర్చు 8 లక్షలు, ఎంపీటీసీ అభ్యర్థి 4 లక్షలు మాత్రమే ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నామినేషన్ల కార్యక్రమం సజావుగా జరిగేటట్లు అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో విజయలక్ష్మి, సిపిఓ బాలాజీ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర మండలాభివృద్ధేలక్ష్యం -ప్రజాసేవే అజెండా...

### -ఎంపీపీ అభ్యర్థిగా టీడీపీ మంజునాథ్ నామినేషన్

ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం రూరల్ మండలంలోని 14 గ్రామపంచాయతీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఎన్డీఏ కూటమి బలపరిచిన తెలుగుదేశం పార్టీ ఎంపీపీ అభ్యర్థి మంజునాథ్ తెలిపారు. ఎంపీపీ అభ్యర్థిగా గురువారం ఆయన తన సతీమణితో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. పూలకుంట గ్రామం నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు ద్విచక్ర వాహనంపై ర్యాలీగా చేరుకున్న మంజునాథ్, అనంతరం ఎన్నికల అధికారికి తన నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో ఐదేళ్లపాటు సర్పంచ్‌గా పనిచేసిన అనుభవం తనకు ఉందన్నారు. అప్పట్లో అధికారంలో లేకపోయినప్పటికీ పూలకుంట పంచాయతీ అభివృద్ధికి తన వంతు కృషి చేసి కీలకపాత్ర పోషించినట్లు వివరించారు. మండల పరిషత్ అధ్యక్షులుగా పనిచేసేందుకు పార్టీ తనపై నమ్మకంతో అవకాశం కల్పించిందని తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు, ఆయన వ్యక్తిగత కార్యదర్శి డాక్టర్ సురేంద్రకు, టీడీపీ పార్టీ కోఆర్డినేటర్ పావులూరి శ్రీనివాసరావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఎంపీపీగా అవకాశం లభిస్తే మండలంలోని 14 గ్రామపంచాయతీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తానని మంజునాథ్ పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని, తనకున్న గత అనుభవాన్ని ఉపయోగించి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని తెలిపారు.




## పోలీస్ బందోబస్తు మధ్య సజావుగా రెండో రోజు ఎంపీటీసీ నామినేషన్లు

ప్రజాభూమి, పుట్లూరు



మండల పరిషత్ కార్యాలయంలో రెండో రోజు ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. నామినేషన్ల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఐ వంశీకృష్ణ, ఎస్ఐ సురేంద్రబాబు, ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఎంపీటీసీ అభ్యర్థుల నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ, అభ్యర్థులను ఒక్కొక్కరిగా కార్యాలయంలోకి అనుమతించారు. పోలీసుల పర్యవేక్షణలో నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగింది. ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా రెండో రోజు నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. తెలుగుదేశానికి సంబంధించి 24 నామినేషన్లు, వైయస్సార్ కుసంబంధించి ఆరు నామినేషన్లు, జనసేన నుండి ఒక నామినేషన్ వేయడం జరిగినది.

## ఎంపీటీసీ నామినేషన్లలో టీడీపీ జోరు

### - రెండో రోజు 28 నామినేషన్లు దాఖలు

ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం మండలంలో ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ఊపందుకుంది. నామినేషన్ల స్వీకరణలో భాగంగా రెండో రోజు గురువారం మొత్తం 28 నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో తెలుగుదేశం పార్టీ తరఫున అత్యధికంగా 17, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి 8, జనసేన పార్టీ తరఫున 3 నామినేషన్లు నమోదయ్యాయి. పార్టీల వారీగా చూస్తే టీడీపీ, జనసేన అభ్యర్థులు ముందంజలో ఉండగా, వైసీపీ అభ్యర్థులు కూడా తమ నామినేషన్లను దాఖలు చేసి ఎన్నికల బరిలో నిలిచేందుకు సిద్ధమయ్యారు. దీంతో మండలంలో ఎంపీటీసీ ఎన్నికల సందడి పెరుగుతోంది. రెండో రోజు నామినేషన్ల వివరాలను ఎన్నికల అధికారి శివానంద నాయక్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దామోదరమ్మతో పాటు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ప్రజాభూమి

వైఎస్ఆర్ కడప, శ్రీ అన్నమ్మయ్య 7

శుక్రవారం 23 అక్టోబరు 2026

# దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో చండి హోమం - పూర్ణాహుతి కార్యక్రమాలు

### -పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న నగర పోలీస్ కమీషనర్ దంపతులు

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ:

విజయవాడ నగరం, ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం నందు ప్రతిష్టాత్మకంగా జరిగిన దసరా శరన్నవరాత్రి ఉత్సవాల వేడుకలను పురస్కరించుకుని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ నందు ప్రతి సంవత్సరం సాంప్రదాయ పద్ధతుల ప్రకారం పూర్ణాహుతి మరియు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. ఈ సందర్భంగా విజయవాడ, వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో వన్ టౌన్ పోలీసులు ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలను 11 రోజులు పాటు భక్తి శ్రద్ధలతో నిర్వహించిన అనంతరం చండీ హోమం నిర్వహించడం జరిగింది. అనంతరం దసరా ముగింపు కార్యక్రమానికి ఎన్.టి.ఆర్. జిల్లా నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు దంపతులు ముఖ్య అతిధులుగా విచ్చేసి, వేద పండితులు నిర్వహించిన హోమంనందు పూర్ణాహుతిని సమర్పించి, దసరా మహోత్సవాలకు



ముగింపు పలకడం జరిగింది. ఈ కార్యక్రమములో పోలీస్ కమీషనర్ స్వయం గా అన్న ప్రసాదాలను వడ్డించి కార్యక్రమాన్ని ప్రారంభించారు, నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు మాట్లాడుతూ.. ఈ ఏడాది ఆధునాతన టెక్నాలజీలను ఉపయోగించుకుని సి.సి.కెమెరాలు,డ్రోన్ మరియు ఫెషియల్ రికగ్నైజెషన్ కెమెరాలను, బూమ్ బ్యారిగేట్స్ లను ఉపయోగించి అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ బందోబస్త్ లను విజయవంతంగానిర్వహించడం జరిగింది. అన్ని డిపార్ట్మెంట్ ల సమన్వయంతో ఈ దసరా ఉత్సవాలు ఘనంగా జరిగాయి. భక్తులకు ఇబ్బంది కలగకుండా పోలీసులు పోలీస్ సిబ్బంది గతం లోకంటే బాగా పనిచేసారు. నవరాత్రులకు సహకరించిన అందరికీ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబుతో పాటు , ఏ.డి.సి.పి.లు ఏ.సి.పి.లు, వన్ టౌన్ ఇన స్పెక్టర్ గుణరాం , నగరంలో విధులు నిర్వహిస్తున్న ఇన్స్పెక్టర్లు, ఎస్.ఐలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా ముగిసిన శ్రీ వాసవి మాత దసరా ఉత్సవాలు

### - పాన్పుసేవ, విశ్వరూప దర్శనం.. పేదలకు అన్నదానం

ప్రజాభూమి, వేంపల్లె



స్థానిక పట్టణంలోని 122 ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో నిర్వహించిన దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. చివరి రోజు గురువారం వాసవి మాతకు పాన్పుసేవ, విశ్వరూప దర్శనం నిర్వహించడంతో ఉత్సవాలు ముగిశాయని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తోటంశెట్టి చంద్రశేఖర్, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు రాయవరం సుబ్బు, పాలకవర్గం, ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా శాశ్వత ఉభయదారుల సహకారంతో పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ ఎంబీబీఎస్ వైద్యుడు డా. ఎస్.ఎఫ్.



భాషా అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ నేతృత్వంలో తోటంశెట్టి చంద్రశేఖర్ ఆయనను దుశ్శాలువతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకుడు మిట్టా ప్రవీణ్ కుమార్, ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు బచ్చు భాగ్యేశ్వరమ్మ, అవోపా అధ్యక్షుడు బైరిశెట్టి సునీల్ కుమార్, అవోపా మహిళా విభాగం అధ్యక్షురాలు బైరిశెట్టి నాగలక్ష్మి, ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, శ్రీ వాసవి కళ్యాణ మండపం, అవోపా, మండల ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య మహిళా మండలి, అవోపా మహిళా విభాగం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# తూగుట్ల గీతారాణి, నల్లగారి అనురాధను భారీ మెజార్టీతో గెలిపించండి

### సైకిల్ గుర్తుకు ఓటేసి అభివృద్ధికి పట్టం కట్టండి

### - ఇంటింటా ప్రచారంలో తూగుట్ల కరుణకుమారి



ప్రజాభూమి, పులివెందుల

పులివెందుల మున్సిపాలిటీ చైర్మన్ అభ్యర్థి తూగుట్ల గీతారాణి, 30వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి నల్లగారి అనురాధను భారీ మెజార్టీతో గెలిపిం చాలని తూగుట్ల కరుణకుమారి, తూగుట్ల సాయికుమారి, తూగుట్ల సంధ్య, నల్లగారి భాస్కర్ రెడ్డి, గజ్జల భువనేశ్వరి ఓటర్లను కోరారు. పట్టణంలోని నగిరిగుట్టలో వారు ఇంటింటా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండు ఓట్లను సైకిల్ గుర్తుపై వేసి, వేయించి చైర్మన్ అభ్యర్థి తూగుట్ల గీతారాణిని, కౌన్సిలర్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చంద్రబాబు నాయుడు పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు. పులివెందుల ఇంకా అభివృద్ధి చెందాలంటే అది చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. పులివెందులలో అనేక సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. త్వరలోనే జగనన్న కాలనీని పూర్తి చేయించి, ఎవరి ఇల్లు వారికి ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రెండు ఓట్లు సైకిల్ గుర్తుకు వేసి గెలిపించండి

### పులివెందులలో అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తాం

### - తూగుట్ల మధుసూదన్ రెడ్డి



ప్రజాభూమి, పులివెందుల:

రెండు ఓట్లు సైకిల్ గుర్తుకే వేయాలని టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తూగుట్ల మధుసూదన్ రెడ్డి ఓటర్లను కోరారు. పులివెందుల పట్టణంలో స్థానిక ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. గురువారం పట్టణంలోని నగిరిగుట్ట, భాకరాపురం తదితర ప్రాంతాల్లో ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. చైర్మన్ అభ్యర్థి తూగుట్ల గీతారాణిని, సైకిల్ గుర్తుపై పోటీ చేస్తున్న కౌన్సిలర్ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. రెండు ఓట్లను సైకిల్ గుర్తుపై వేసి, వేయించి భారీ మెజార్టీతో గెలిపిం చాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పులివెందుల పట్టణంలో అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తామ న్నారు. మున్సిపాలిటీలో వీధిలైట్లు, డ్రైనేజీ సమస్యలు ఉన్నాయని, వాటికి శాశ్వత పరిష్కారం చూపేందుకు ముందడుగు వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శిరిడి సాయిబాబాకి విశేష పూజలు

### ప్రత్యేక అలంకరణలో సాయినాధుడు



ప్రజాభూమి,పులివెందుల

పులివెందుల పట్టణంలోని పార్నపల్లి రోడ్డు సమీపంలో మొట్టమొదటిగా కొలువైన శ్రీ శిరిడి సాయిబాబా ఆలయంలో గురువారం షిరిడి సాయిబాబా ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఉదయాస్త మాన స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు మురళి స్వామి ఆధ్వర్యంలో సాయినాధునికి ఉదయం కాగడ హారతి, పంచామృతా భిషేకం, సహస్రనామార్చన, అష్టోత్తర శతనామావళి, తదితర పూజా కార్యక్రమాల అనంతరం స్వామి వారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు . మధ్యాహ్నం 12 గంటలకు మధ్యాహ్నం హారతి సాయంకాలం 6 గంటలకు సంధ్య హారతి రాత్రి 9 గంటలకు శేజ హారతులు స్వామివారికి అర్పించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ శ్రీరామ సుబ్బయ్య మాట్లాడుతూ ప్రతి గురువారం ఆలయంలో భక్తుల సహాయ సహకారాలతో అన్నదాన కార్యక్రమాలు విశేషంగా నిర్వహించడం జరుగుతుందని అందులో భాగంగా ప్రతి గురువారం పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి మొక్కులు చెల్లించుకోవడం జరుగుతోందని తెలియజేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# పులివెందుల అభివృద్ధి జగన్ ప్రభుత్వంలోనే జరిగింది - వైఎస్ ప్రమీలమ్మ

### ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించండి

ప్రజాభూమి, పులివెందుల:



పులివెందుల అభివృద్ధి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలోనే జరిగింద ని చైర్మన్ అభ్యర్థి వైఎస్ ప్రమీలమ్మ అన్నారు. గురువారం పట్టణంలోని శ్రీరామ హాల్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఆమె ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్లను ఉద్దేశించి మాట్లాడుతూ, మళ్లీ పులివెందుల అభివృద్ధి చెందాలంటే తమ అమూల్యమైన రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి తనను,కౌన్సిలర్ అభ్యర్థులను భారీ మెజార్టీ తో గెలిపించాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లవుతున్నా ఇంతవరకు పులివెందుల అభివృద్ధికి నోచుకోలేద ని విమర్శించారు. చంద్రబాబు ప్రభుత్వం మున్సిపాలిటీకి ఒక్క రూపాయి కూడా నిధులు విడుదల చేయలేదని, పట్టణంలో ఎక్కడ చూసినా వీధి దీపాల కొరత ఉందన్నారు. వైకాపాకు మళ్లీ అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తామని, టీడీపీ నాయకులు వైకాపా అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించా రు. ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి, వేయించి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కోడుమూర్తి ప్రధాన రహదారి కల్వర్టుపై కుంగిన రోడ్డు..

ప్రజా భూమి యల్లనూరు





మండల కేంద్రానికి సమీపాన కోడుమూర్తి రోడ్డు ఇప్పటివరకు కురిసిన వర్షాలకు దెబ్బ తినడంతో కల్వర్టుపై రోడ్డు ధ్వంసం అయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి పరిస్థితి నిరంతరం రాకపోకలు సాగుతున్న క్రమంలో అతి చిన్న మరియు భారీ వాహనాలు కూడా రాకపోకలు సాగించేవి ఈ రహదారి గుండా వెళ్లిన కారణంగా రెండు అడుగులకు పైగా పెద్ద లోయ ఏర్పడడంతో వాహనదారులు, వ్యవసాయ పొలాల బాటసారులకు తీవ్ర సమస్యగా ఉంది లోయ ఏర్పడిన చోట దగ్గరలో ఉన్నటువంటి పంట పొలాల రైతులు ఎటువంటి ప్రమాదాలు జరగకుండా కొన్ని గుర్తులను లోయ పై , చుట్టూ ఉంచడం కొంతవరకు ప్రమాదాల నివారణ చర్య చేపట్టినప్పటికీ. రాత్రి సమయంలో వాహన దారులకు సమీపానికి చేరుకుంటే గాని కనిపించని కారణంగా ప్రయాణం సాగించాలంటే సవాల్ గా మారింది వారం రోజులుగా ఇదే దుస్థితి ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తక్షణ నివారణ చర్యలు చేపట్టాలని వాహనదారులు వ్యవసాయ రైతులు గ్రామ ప్రజలు వేడుకుంటున్నారు.

# ఆపమంటే.. ఆగనంటున్న ఆర్టీసీ బస్సులు

### రచ్చుమారిపల్లె గ్రామస్తుల ఆగ్రహం

ప్రజాభూమి, పులివెందుల




పులివెందుల మండలం రచ్చుమారిపల్లె గ్రామం వద్ద ఉన్న బస్టాప్‌లో ఆర్టీసీ బస్సులు నిలపకపోవడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రచ్చుమారిపల్లె స్టాప్ వద్ద బస్సులు ఆపాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లభించడం లేదని వాపోతున్నారు. గతంలోనూ ఇదే సమస్యపై గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారని, అప్పుడు అధికారులు సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా పరిస్థితిలో మార్పు లేదని ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా ప్రొద్దుటూరు డిపోకు చెందిన బస్సుల విషయంలోనే తరచూ ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు తెలిపారు. గురువారం బస్సు నిలపకపోవడంపై గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేయగా, డ్రైవర్ క్షమాపణలు చెప్పారని, అయితే మహిళా కండక్టర్ మాత్రం "బస్సు ఆపడం మా ఇష్టం" అంటూ గ్రామస్తులతో దురుసుగా ప్రవర్తించినట్లు ఆరోపిస్తున్నారు. బస్సులు ఆపకపోవడం వల్ల ప్రయాణికులు, విద్యార్థులు ముఖ్యంగా మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి రచ్చుమారిపల్లె వద్ద అన్ని బస్సులు తప్పనిసరిగా నిలిపేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# రేణిగుంటలో ఊపందుకున్న ఎంపీటీసీ నామినేషన్లు

### - రెండో రోజు 53 దాఖలు.. టీడీపీదే పైచేయి

ప్రజా భూమి రేణిగుంట



మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ (ఎంపీటీసీ) ఎన్నికల నామినేషన్ల ఘట్టం రెండో రోజు అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. మొదటి రోజు కేవలం రెండు నామినేషన్లు మాత్రమే రాగా, రెండో రోజు అభ్యర్థులు భారీ సంఖ్య లో తరలివచ్చారు. మండలా పరిధిలోని మొత్తం 21 ఎంపీటీసీ స్థానాలకు గాను వివిధ రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థుల నుండి మొత్తం 53 నామినేషన్ పత్రాలు అందినట్లు రిటర్నింగ్ అధికారి (ఆర్ఓ) ఆదినారాయణ తెలిపారు. ?రెండో రోజు దాఖలైన నామినేషన్లలో టీడీపీ (తెలుగుదేశం పార్టీ) స్పష్టమైన ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. మొత్తం 53 నామినేషన్లలో అత్యధికంగా టీడీపీ అభ్యర్థుల నుంచి 39 నామినేషన్లు వచ్చాయి. ఇక కూటమి భాగస్వామ్య పక్షాలైన భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నుండి 5, జనసేన పార్టీ నుండి 3 నామినేషన్లు దాఖలయ్యాయి. కూటమి స్థానంలో బీజేపీ పార్టీకి చెందిన కుర్ర కాలువ వేణు మాతృమూర్తి నామినేష న్ పత్రాలను సమర్పించారు. అలాగే రేణి గుంట-2 స్థానం నుండి టీడీపీ నాయకుడు మధు, కరకంబాడి సెగ్మెంట్ నుండి కూడా ప్రధాన అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేశారు. మరోవైపు ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) తరపున 4 నామినేషన్లు, సీపీఐ(ఎం) పార్టీ తరఫున 3 నామినేషన్లు దాఖలయ్యాయి. కరకం బాడి, రేణిగుంట, గాజులమండ్యం, జీపా లెం, కృష్ణాపురం, అత్తూరు తదితర స్థానా ల్లో వివిధ పార్టీల అభ్యర్థులు నామినేషన్లు వేయడంతో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. కొందరు అభ్యర్థులు భద్రత సాంకేతిక కారణాల దృష్ట్యా ఒకటి కంటే ఎక్కువ సెట్లలో నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. నామినేషన్ల పరిశీలన మరియు ఉపసంహరణ ప్రక్రియ ముగిసిన అనంతరం తుది పోటీలో నిలిచే అభ్యర్థుల వివరాలను ఆర్ఓ కార్యాలయం అధికారికంగా ప్రకటించనుంది. నామినేషన్ కేంద్రాల వద్ద అధికారులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. పార్టీల వారీగా తెలుగుదేశం పార్టీ 39, భారతీయ జనతా పార్టీ 5, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 4, జనసేన పార్టీ 3, సీపీఐ(ఎం) - 3, మొత్తం 53 నామినేషన్లు దాఖలైనట్లు తెలిపారు.

# వైఎస్ అవినాశ్ రెడ్డి అరెస్ట్.. తీవ్ర ఉద్రిక్తత

### - పరిషత్ ఎన్నికల నామినేషన్ల వేళ కడపలో తీవ్ర ఉద్రిక్తత

### - పులివెందుల వెళ్తుండగా మార్గమధ్యంలో అరెస్ట్

ప్రజా భూమి - పులివెందుల



ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక ఎన్నికల పర్వం అగ్గి రాజేస్తోంది. నామినేషన్ల ఘట్టం ప్రారంభమైన నాటి నుంచే మొదలైన ఉద్రిక్తతలు ఈరోజు తార స్థాయికి చేరాయి. వైసీపీ కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డిని పోలీసులు కాసేపటి క్రితం అదుపులోకి తీసుకున్నారు. ఈ పరిణామంతో కడప జిల్లాలో ఒక్కసారిగా రాజకీయ వేడి భగ్గుమంది. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా పులివెందుల నియోజకవర్గంలో ఉద్రిక్తతలు తలెత్తవచ్చని నిఘా వర్గాల నుంచి సమాచారం అందడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ క్రమంలో, కడప నుంచి పులివెందులకు బయలుదేరిన ఎంపీ అవినాశ్ రెడ్డి, వైఎస్ ప్రకాశ్ రెడ్డి, జగన్ మేనమామ రవీంద్రనాథ్ రెడ్డి తదితరులను పోలీసులు మార్గమధ్యంలోనే అడ్డుకున్నారు. శాంతిభద్రతల దృష్ట్యా పులివెందులకు వెళ్లరాదని సూచించారు. అయితే, తమ నియోజకవర్గానికి తాము వెళ్లకుండా అడ్డుకోవడం ఏమిటని ఎంపీ అవినాశ్ రెడ్డి పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమయంలో పోలీసులకు, వైసీపీ నేతలకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారుతుండటంతో... శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగానే ముందస్తు అరెస్టు చేస్తున్నట్లు ప్రకటించి, అవినాశ్ రెడ్డి సహా పలువురు నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై జిల్లా ఎస్పీ స్పందిస్తూ... "ఎన్నికల వేళ శాంతిభద్రతలకు విఘాతం కలుగు తుందన్న పక్కా సమాచారంతోనే ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాం. ఏ పార్టీకి చెందిన వారైనా సరే, ఘర్షణలకు ఆస్కారం ఇస్తే ఉపేక్షించేది లేదు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరపడమే మా లక్ష్యం. ఇందులో భాగంగానే నేతలను అదుపులోకి తీసుకోవాల్సి వచ్చింది" అని స్పష్టం చేశారు.

# పోలింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించిన ఆర్డీవో

ప్రజాభూమి,పులివెందుల



మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో అహోబిలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పోలింగ్ అధికారుల శిక్షణ కార్యక్రమాన్ని ఆర్డీవో చెన్నయ్య, మున్సిపల్ కమిషనర్ తనూజ పరిశీలించారు. పులివెందుల నియోజకవర్గంలోని ఏడు మండలాల పోలింగ్ సిబ్బందికి ఈ శిక్షణ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణ విధివిధానాలు, పోలింగ్ ప్రక్రియలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అధికారులు పాటించాల్సిన నిబంధనలపై ఆర్డీవో పలు సూచనలు చేశారు. ఎన్నికలను పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలింగ్ అధికారులు సమగ్ర అవగాహనతో విధులు నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగడి నాగేంద్ర, పద్మనాభ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, సూర్య చంద్రారెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, సోమ సుబ్బారెడ్డి, మల్లేష్, అమిర్ భాషా, సెల్వరాజ్, జగన్ మోహన్ రెడ్డి, రాఘవేంద్రమ్మ, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాభూమి

తిరుపతి,చిత్తూరు 8

శుక్రవారం 23 అక్టోబరు 2026


## జిల్లా లో ప్రశాంత వాతావరణంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాభూమి ప్రతినిధి,యాదమరి: జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు.



గురువారం జిల్లా ఎస్పీ తుషార్ దూడితో కలిసి యాదమరి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి జరుగుతున్న నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో రాజకీయ పార్టీల అభ్యర్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో నామినేషన్లు దాఖలు చేసుకునేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈ నెల 21వ తేదీ నుంచి జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైందని, రెండో రోజు కూడా ప్రశాంతంగా కొనసాగుతోందని పేర్కొన్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు నామినేషన్లు దాఖలు చేసేందుకు అవసరమైన సదుపాయాలు కల్పించామని తెలిపారు. జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదని కలెక్టర్ వెల్లడించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. ఈ పర్యటనలో ట్రైనీ కలెక్టర్ వెంకటేశ్, యాదమరి తహసీల్దార్ పార్థసారథి, ఎన్నికల రిటర్నింగ్ అధికారి లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ పెంచల వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## రెండు రోజుల్లో 55 నామినేషన్లు దాఖలు



ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.

రేణిగుంట: ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా రేణిగుంట మండలంలో రెండో రోజు గురువారం 53 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో టీడీపీ 40, వైసీపీ 4, జనసేన 3, సీపీఐ 3, బీజేపీ 5 నామినేషన్లు సమర్పించాయి. బుధవారం తొలిరోజు టీడీపీ నుంచి రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. దీంతో రెండు రోజుల్లో మొత్తం 55 నామినేషన్లు నమోదయ్యాయి.

## సీపీఎం అభ్యర్థుల నామినేషన్ దాఖలు

ప్రజా భూమి ప్రతినిధి తొట్టంబేడు



తొట్టంబేడు మండల ప్రజా పరిషత్ ప్రాదేశిక ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థులు గురువారం తమ నామినేషన్లను దాఖలు చేశారు. బోనుపల్లి నుంచి సీ.చాముండేశ్వరి, పి.వనజ, చిట్టత్తూరు నుంచి కే.గురునాథం, చియ్యవరం నుంచి పి.గురవయ్యలు తమ అభ్యర్థిత్వాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి గోవిందరాజభాస్కర్ కు సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం అభ్యర్థులు మాట్లాడుతూ ప్రత్యామ్నాయ రాజాకీయాలను ప్రజలు ఆదరించాలని కోరారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలని కోరారు.

## తొట్టంబేడు జడ్పీటీసీకి టిడిపి పార్టీ తరపున గాలి మురళి నాయుడు దాఖలు



ప్రజా భూమి ప్రతినిధి – తొట్టంబేడు

మండల ప్రజా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ ఎన్నికల్లో భాగంగా తెలుగుదేశం పార్టీ అభ్యర్థి సీనియర్ నాయకులు తెలుగుదేశం పార్టీ చందన గాలి. మురళినాయుడు గురువారం నామినేషన్ దాఖలు చేశారు.కొణతనేరి ఎంపీటీసీ స్థానానికి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా తన నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి గోవిందరాజ భాస్కర్ కు అందజేశారు.ఈ సందర్భంగా అభ్యర్థి మాట్లాడుతూ, ప్రజలు ప్రత్యామ్నాయ రాజకీయాలను ఆదరించాలని,ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వాకాడు జడ్పీటీసీ బరిలో వైసీపీ అభ్యర్థులు.. నామినేషన్లు దాఖలు !

ప్రజాభూమి ప్రతినిధి,వాకాడు



వాకాడు మండలంలో జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఇద్దరు అభ్యర్థులు గురువారం నామినేషన్లు దాఖలు చేశారు. నేదురుమల్లి సుజన, ముప్పాల సుధాలక్ష్మి తమ నామినేషన్ పత్రాలను అధికారులకు అందజేశారు.ముప్పాల సుధాలక్ష్మి యర్రగాటిపల్లి పంచాయతీకి చెందినవారు కాగా, ఆ పంచాయతీ సర్పంచ్ ముప్పాల విజయ్ కుమార్ రెడ్డి సతీమణి కావడం విశేషం. ఆమె తిరుపతిలోని కార్యాలయంలో మధ్యాహ్నం 3:40 గంటలకు నామినేషన్ పత్రాలను సమర్పించారు.అదేవిధంగా వైసీపీ తరఫున నేదురుమల్లి సుజన కూడా జడ్పీటీసీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఒకేరోజు ఇద్దరు అభ్యర్థులు నామినేషన్లు వేయడం జరిగింది.

## శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కుమార్తె కాటంరెడ్డి పవిత్ర రెడ్డి బియ్యపుని హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్



స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా తొట్టంబేడు మండలం నిన్న వైయస్ఆర్‌సీపీ అభ్యర్థులు నామినేషన్ వేయకుండా అడ్డుకున్న టీడీపీ మూకలు. ఈరోజు వైయస్ఆర్‌సీపీ అభ్యర్థులకు మద్దతుగా నామినేషన్ కేంద్రానికి వెళ్లేందుకు సిద్ధమైన పవిత్ర రెడ్డిని పోలీసులు హౌస్ అరెస్ట్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,మమ్మల్ని హౌస్ అరెస్ట్ చేసి నామినేషన్ కేంద్రం వద్ద మా అభ్యర్థులని కొట్టిస్తారా అని శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.వైఎస్ఆర్సిపి ఎంపీటీసీ జడ్పీటీసీ అభ్యర్థులతో కలిసి నామినేషన్ కేంద్రం వద్దకు వెళ్లకుండా ఉదయమే నుంచే పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు.మరోవైపు.. నామినేషన్ కేంద్రం వద్ద టీడీపీ మూకలు రెచ్చిపోయి పోలీసుల సమక్షంలోనే వైఎస్ఆర్సిపి అభ్యర్థులపై దాడులు చేశారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో సూక్ష్మ పరిశీలకులు నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలి

### పోలింగ్ ప్రక్రియను ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిశితంగా పరిశీలించాలి

### చెక్‌లిస్ట్‌ను పూర్తిస్థాయిలో నమోదు చేసి సాధారణ పరిశీలకులకు నివేదిక అందించాలి: డీఆర్ఓ మోహన్ కుమార్

ప్రజాభూమి ప్రతినిధి,చిత్తూరు: గురువారం చిత్తూరు జిల్లాలోని కలెక్టరేట్లో సమావేశ మందిరంలో నిర్వహించిన మున్సిపల్ కార్పొరేషన్లు/ఎంపీపీలు ఉ జెడ్పీపీలు మరియు గ్రామ పంచాయతీలకు 2వ సాధారణ ఎన్నికల సూక్ష్మ పరిశీలకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, జిల్లా ఎసీఎస్ ఈబ్ల్యూ అధికారి జి.రవికుమార్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో సూక్ష్మ పరిశీలకుల పాత్ర అత్యంత కీలకమని, ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన విధులను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించాలి. పోలింగ్ ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా ఎన్నికల నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించి, వాస్తవ పరిస్థితులను నివేదికలో పొందుపరచాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల విధుల నిర్వహణకు నియమితులైన సూక్ష్మ పరిశీలకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.




**సాధారణ ఎన్నికలకు, స్థానిక సంస్థల ఎన్నికలకు వ్యత్యాసం**

సాధారణంగా ప్రతి ఐదేళ్లకు నిర్వహించే శాసనసభ, పార్లమెంటు ఎన్నికలను కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తారని, రాష్ట్రంలో ఈ ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) వ్యవస్థ పనిచేస్తుందని డీఆర్ఓ వివరించారు. అయితే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించేందుకు రాజ్యాంగబద్ధంగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాటు చేయబడిందని తెలిపారు. స్థానిక స్వపరిపాలనకు సంబంధించిన ఎన్నికలు కావడంతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజల భాగస్వామ్యం ఎక్కువగా ఉంటుందని, అభ్యర్థులు సైతం ప్రజలకు సన్నిహితంగా ఉండటం వల్ల ఈ ఎన్నికలకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. స్థానిక స్థాయిలో కొన్ని సందర్భాల్లో అభ్యర్థులు, వారి అనుచరుల మధ్య విభేదాలు లేదా ఉద్రిక్త పరిస్థితులు తలెత్తే అవకాశం ఉన్నందున ఎన్నికల ప్రక్రియను నిశితంగా పరిశీలించేందుకు సూక్ష్మ పరిశీలకులను నియమిస్తున్నట్లు తెలిపారు. జిల్లా పునర్విభజన అనంతరం చిత్తూరు జిల్లాలో 28 మండలాలు, నాలుగు పట్టణ స్థానిక సంస్థలు ఉన్నాయని డీఆర్ఓ తెలిపారు. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు పలమనేరు, పుంగనూరు, నగరి మున్సిపాలిటీలు ఉన్నాయని వివరించారు. ఈ పట్టణ స్థానిక సంస్థలకు సంబంధించి ఎన్నికల సంఘం నోటిఫికేష న్ విడుదల చేయడంతో నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. ఈ నెల 28వ తేదీన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ నిర్వహిం చనున్న నేపథ్యంలో సూక్ష్మ పరిశీలకులు తమకు కేటాయించిన విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఒకే పాఠశాల లేదా ప్రాంగణంలో రెండు లేదా అంతకంటే ఎక్కువ పోలింగ్ కేంద్రాలు ఉన్నప్పుడు వాటిని ఒకే పోలింగ్ స్టేషన్ లొకేషన్‌గా పరిగణించి, ఆ ప్రాంతాన్ని పర్యవేక్షించేందుకు సూక్ష్మ పరిశీలకులను నియమించినట్లు వివరించారు. జిల్లాకు నియమితులైన సాధారణ పరిశీలకులకు సహాయకులుగా వీరు విధులు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు.

**పోలింగ్ ప్రక్రియను ప్రతి దశలోనూ పరిశీలించాలి**

ఈ నెల 28వ తేదీన ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే పోలింగ్ ప్రక్రియను సూక్ష్మ పరిశీలకులు పూర్తిస్థాయిలో పర్యవేక్షించాలని డీఆర్ఓ సూచించారు. పోలింగ్ ప్రారంభానికి ముందుగా బ్యాలెట్ బాక్సుల సిద్ధత, పోలింగ్ ఏజెంట్ల హాజరు, ప్రిసైడింగ్ అధికారి చేపట్టే తనిఖీలు, నిర్ణీత సమయానికి పోలింగ్ ప్రారంభమైందా లేదా అనే అంశాలను పరిశీలించాలన్నారు. పోలింగ్ సమయంలో ఏవైనా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకున్నా, అభ్యంతరాలు వ్యక్తమైనా, సమస్యలు తలెత్తినా వాటిని వాస్తవాల ఆధారంగా నమోదు చేయాలని తెలిపారు. ఛాలెంజ్ ఓట్లు, టెండర్ ఓట్లకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు వచ్చినప్పుడు వాటి వివరాలను కూడా చెక్‌లిస్ట్‌లో స్పష్టంగా పొందుపరచాలని సూచించారు. సూక్ష్మ పరిశీలకులు పోలింగ్ నిర్వహించే అధికారులు కాదని, ఎన్నికల నిర్వహణ తీరును పరిశీలించి నివేదిక సమర్పించే బాధ్యతను నిర్వర్తిస్తారని స్పష్టం చేశారు. పోలింగ్‌ను సజావుగా నిర్వహించే బాధ్యత ప్రిసైడింగ్ అధికారి, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ సిబ్బందిపై ఉంటుందని, అయితే పోలింగ్ ప్రక్రియ నిష్పక్షపాతంగా జరుగుతోందా లేదా అనే విషయాన్ని పరిశీలకులకు తెలియజేయడంలో సూక్ష్మ పరిశీలకుల నివేదిక కీలకమని పేర్కొన్నారు.

**చెక్‌లిస్ట్‌ను జాగ్రత్తగా పూర్తి చేయాలి**

సూక్ష్మ పరిశీలకులకు అందించిన చెక్‌లిస్ట్‌లోని ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా చదివి, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా అవును లేదా కాదు అనే సమాధానాలను నమోదు చేయాలని డీఆర్ఓ సూచించారు. ఎక్కడైనా లోపాలు లేదా సమస్యలు గుర్తిస్తే వాటిని సంబంధిత వివరాలతో స్పష్టంగా నమోదు చేయాలన్నారు. నివేదికను సాధారణ పరిశీలకులకు అందించే ముందు అన్ని అంశాలను సరిచూసుకోవాలని, ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని తెలిపారు. ఎన్నికల విధుల్లో భాగంగా కేటాయించిన పోలింగ్ స్టేషన్ లొకేషన్‌కు సమయానికి చేరుకుని, జిల్లా ఎన్నికల యంత్రాంగం సూచనల మేరకు అవసరమైతే ముందురోజే చేరుకుని బస చేయాల్సి ఉంటుందని వివరించారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించేటప్పుడు ఎదురయ్యే ఇబ్బందులను సమన్వయంతో అధిగమించి, తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని తెలిపారు.

**మూడు దశల్లో స్థానిక సంస్థల ఎన్నికలు**

జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలను వివిధ దశల్లో నిర్వహించనున్నట్లు డీఆర్ఓ తెలిపారు. మొదట పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు, అనంతరం మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల (ఎంపీటీసీ), జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల (జెడ్పీటీసీ) ఎన్నికలు, ఆ తర్వాత గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు వివరించారు. గ్రామ పంచాయతీల సంఖ్య ఎక్కువగా ఉన్నందున అందుబాటులో ఉన్న సిబ్బంది, ఇతర వనరులను దృష్టిలో ఉంచుకుని మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. అవసరాన్ని బట్టి సూక్ష్మ పరిశీలకులకు తదుపరి దశల్లో కూడా విధులు కేటాయించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఇందుకోసం వారికి అందించిన మూడు రకాల చెక్‌లిస్టులను పూర్తిగా అధ్యయనం చేసి, సంబంధిత ఎన్నికల విధానాలపై స్పష్టమైన అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.

**పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు**

జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నేతృత్వంలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు డీఆర్ఓ తెలిపారు. జిల్లా పోలీసు అధికారులతో సమన్వయం చేసుకుంటూ సున్నితమైన పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రతా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. అవసరమైన చోట్ల సీసీ కెమెరాలు, వీడియో రికార్డింగ్ వంటి ఏర్పాట్లు చేయడంతో పాటు పోలింగ్ సామగ్రి సిద్ధం చేయడం, పోలింగ్ సిబ్బందికి శిక్షణ అందించడం వంటి కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పోలింగ్ సిబ్బందికి ఇప్పటికే మొదటి దశ శిక్షణ పూర్తయిందని, రెండో దశ శిక్షణను కూడా సమగ్రంగా నిర్వహించి ఎన్నికల విధులపై పూర్తి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. శిక్షణలో అందించిన సమాచారాన్ని, సూచనలను మరోసారి పరిశీలించుకోవాలని, ఏవైనా సందేహాలు ఉంటే సీనియర్ సిబ్బంది లేదా సంబంధిత శిక్షణ అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు.

**బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి**

సూక్ష్మ పరిశీలకులలో చాలామందికి గతంలో ఎన్నికల విధులు నిర్వహించిన అనుభవం ఉందని డీఆర్ఓ పేర్కొన్నారు. కొత్తగా విధులు నిర్వహించేవారు సైతం శిక్షణలో అందించిన సూచనలను పాటిస్తూ, అనుభవజ్ఞుల సహకారంతో తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని కోరారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, నిష్పక్షపాతత్వం కాపాడటంలో సూక్ష్మ పరిశీలకుల నివేదికలకు ఎంతో ప్రాధాన్యత ఉందని, అందువల్ల ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పరిశీలించి వాస్తవాలను మాత్రమే నివేదికలో పొందుపరచాలని తెలిపారు. జిల్లా ఎన్నికల యంత్రాంగం చేపట్టిన ఏర్పాట్లకు అనుగుణంగా అందరూ సమన్వయంతో పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా జరిగేలా సహకరించాలని డీఆర్ఓ తెలిపారు.

# రు.31 కోట్లతో చిత్తూరు రైల్వే స్టేషన్ అభివృద్ధి

### ప్రయాణికుల సమస్యలు, సూచనలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

### గుంతకల్ రైల్వే డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సత్యనారాయణ

ప్రజాభూమి ప్రతినిధి,చిత్తూరు: భారతీయ రైల్వే ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జన సంవాద్ కార్యక్రమంలో భాగంగా ప్రయాణికుల సమస్యలు, అవసరాలు, సలహాలు, సూచనలు తెలుసుకునేందుకు చిత్తూరు రైల్వే స్టేషన్‌ను సందర్శించినట్లు గుంతకల్ రైల్వే డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సత్యనారాయణ తెలిపారు. గురువారం చిత్తూరు రైల్వే స్టేషన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక ప్రయాణికులు, ప్యాసింజర్ అసోసియేషన్ ప్రతినిధులు, జెడ్ఆర్‌యూసీసీ సభ్యులు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులతో ఆయన మాట్లాడి వారి సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకున్నారు.



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే స్టేషన్లలో ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలు, పారిశుద్ధ్యం, పార్కింగ్, ఇతర మౌలిక వసతులపై క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి ప్రయాణికుల అభిప్రాయాలను సేకరించడమే జన సంవాద్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. చిత్తూరు ప్రాంత ప్రజలు, వివిధ సంఘాల ప్రతినిధులు తెలియజేసిన అభ్యర్థనలను డివిజనల్, జోనల్ స్థాయి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, సాధ్యమైనంత వరకు అమలయ్యేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.

**రూ.31 కోట్లతో స్టేషన్ అభివృద్ధి**

అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద చిత్తూరు రైల్వే స్టేషన్‌ను సుమారు రూ.31 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన అనుభూతిని కలిగించేలా స్టేషన్‌ను ఆధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ఇందులో భాగంగా పార్కింగ్, పారిశుద్ధ్యం, ఎస్కలేటర్లు, లిఫ్టులు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు (ఎఫ్ఓబీలు), ఏసీ వెయిటింగ్ హాళ్లు, రిటైరింగ్ రూములు, లాంజ్‌లు తదితర సౌకర్యాలు కల్పించనున్నట్లు వివరించారు. దేశవ్యాప్తంగా ప్రధాన రైల్వే స్టేషన్లను అమృత్ భారత్ పథకం కింద ఆధునికీకరిస్తున్నట్లు తెలిపారు.

**చెన్నైకి రైలు సౌకర్యంపై ప్రతిపాదన**

చిత్తూరు నుంచి చెన్నైకు రైలు సౌకర్యం కల్పించాలనే డిమాండ్‌ను స్థానికులు తన దృష్టికి తీసుకొచ్చారని సత్యనారాయణ తెలిపారు. ఈ అంశాన్ని ఉన్నతాధికారులకు నివేదించి, జోనల్ ప్రధాన కార్యాలయ స్థాయిలో పరిశీలన జరిగేలా తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

## 112 కాల్‌కు సకాలంలో స్పందించి వ్యక్తి ప్రాణాలను కాపాడిన రేణిగుంట పోలీసులు

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.



తిరుపతికి చెందిన లోకేష్ అనే వ్యక్తి తాను చనిపోతానని తన కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా తెలియజేయడంతో, ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు వెంటనే 112 అత్యవసర సేవలకు కాల్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు 112 కాల్ ద్వారా లభించిన లొకేషన్ ఆధారంగారేణిగుంట సమీపంలోని రైల్వే ట్రాక్‌పై ఉన్నట్లు గుర్తించారు. వెంటనే స్పందించిన రేణిగుంట పోలీస్ స్టేషన్ రైటర్ సి.వి. చలపతి మరియు పోలీస్ కానిస్టేబుల్ త్రినాథ్ సకాలంలో అక్కడికి చేరుకుని, లోకేష్‌ను సురక్షితంగా అక్కడి నుంచి తీసుకువచ్చారు. అనంతరం అతడిని అతని కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు తక్షణమే స్పందించి తమ బిడ్డ ప్రాణాలను కాపాడినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు .

## నామినేషన్ల వేళ.. రెండో రోజూ చిరు పార్టీల మధ్య వాగ్వాదం!

ప్రజాభూమి ప్రతినిధి రేణిగుంట.

ఎంపీటీసీ నామినేషన్ల స్వీకరణ రెండో రోజైన గురువారం రేణిగుంటలో కూటమి పార్టీ,వైసిపి పార్టీల మధ్య నామినేషన్ల ప్రక్రియలో భాగంగావాగ్వాదం చోటుచేసుకుంది. నామినేషన్లు దాఖలు చేసేందుకు వెళ్తున్న తమను కూటమి పార్టీ నాయకులు అడ్డుకున్నారని, వైసీపీ నేతలు ఆరోపించారు. తమకు నామినేషన్లు దాఖలు చేసే అవకాశం కల్పించాలని ఎంపీటీసీ అభ్యర్థులు కోరారు. ఈ ఘటనతో నామినేషన్ల కేంద్రం వద్ద కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసుల జోక్యంతో ఇరు పార్టీలు సద్దుమణిగాయి.



# ఒకవైపు దాడులు.. మరోవైపు పోలీసుల ఆంక్షలు!

### తిరుపతి రూరల్‌లో నామినేషన్ల వేళ తీవ్ర ఉద్రిక్తత -వైఎస్సార్‌సీపీ అభ్యర్థులపై వరుసగా దాడులు -గాయపడిన వారికి రుయా ఆస్పత్రిలో చికిత్స -మోహిత్‌రెడ్డి, హర్షిత్‌రెడ్డిలను అడ్డుకున్న పోలీసులు





ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి రూరల్

తిరుపతి రూరల్ మండలంలో స్థానిక సంస్థల నామినేషన్ల సందర్భంగా తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. నామినేషన్ దాఖలు చేసేందుకు వచ్చిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులపై దాడులు జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. మరోవైపు నామినేషన్ కేంద్రానికి వెళ్లేందుకు ప్రయత్నించిన ఆ పార్టీ నేతలను పోలీసులు అడ్డుకోవడం రాజకీయంగా కలకలం రేపింది. ఈ పరిణామాలతో మండలంలో ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. వైఎస్సార్‌సీపీ ఎంపీపీ అభ్యర్థి నాగలక్ష్మి భర్త చిన్ని యాదవ్ నామినేషన్ కేంద్రం వెనుకవైపు గోడ దూకి లోపలికి వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం బయటకు వస్తుండగా ఆయనపై కొందరు పిడిగుద్దులతో దాడి చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. వేదాంతపురం ఎంపీటీసీ అభ్యర్థి ప్రసాద్, పాడిపేట ఎంపీటీసీ అభ్యర్థి భర్త ధనమునిరెడ్డి, బీటీఆర్ కాలనీ ఎంపీటీసీ అభ్యర్థి తుంటి సుధా యాదవ్, వైఎస్సార్‌సీపీ విద్యార్థి నాయకుడు చెంగల్ రెడ్డిపై కూడా మూకుమ్మడి దాడి జరిగినట్లు



పార్టీ వర్గాలు ఆరోపించాయి. ఈ ఘటనల్లో గాయపడిన వారికి తిరుపతిలోని రుయా ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నట్లు సమాచారం.

**నేతలను అడ్డుకున్న పోలీసులు**

తమను హౌస్ అరెస్టు చేసి, మరోవైపు తమ పార్టీ అభ్యర్థులపై దాడులు చేయించడంపై చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ నివాసం నుంచి నామినేషన్ కేంద్రానికి వెళ్లేందుకు బయలుదేరిన వారిని పోలీసులు అడ్డుకున్నారు. పోలీసుల ఆంక్షలను దాటుకుని వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ అభ్యర్థులు మూకుమ్మడిగా నామినేషన్ కేంద్రం వైపు బయలుదేరారు. ఈ క్రమంలో అదనపు ఎస్పీ రవి మనోహరాచారి అభ్యర్థులను నామినేషన్



కేంద్రం లోపలకు తీసుకు వెళ్లగా పోలీసుల సమక్షంలోనే అభ్యర్థులపై దాడులు చేయడంతో స్వల్ప లాఠీ చార్జి చేశారు. నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా వరుసగా చోటుచేసుకున్న పరిణామాలతో తిరుపతి రూరల్‌లో ఉద్రిక్తత నెలకొంది. దాడుల ఆరోపణలు, పోలీసుల చర్యలపై అధికారిక వివరణ వెలువడాల్సి ఉంది.

చెవిరెడ్డి ఇంటి వద్ద నేతల సందడి

ప్రభుత్వ మాజీ విప్ చెవిరెడ్డితో పాటు ఆయన కుమారులు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్ రెడ్డిలకు పోలీసులు నోటీసులు జారీ చేసి హౌస్ అరెస్ట్ చేశారు. దీంతో వైఎస్సార్సీపీ ఎంపీటీసీ అభ్యర్థులతో పాటు పార్టీ ముఖ్యనేతలు అందరూ చెవిరెడ్డి నివాసానికి చేరుకున్నారు. తమ నాయకుడుని హౌస్ అరెస్ట్ చేసి తమను నామినేషన్ కేంద్రానికి తీసుకువెళ్లకుండా పోలీసులు రౌడీలతో కొట్టించడానికి ప్లాన్ చేశారని పలువురు అభ్యర్థులు ఆరోపించారు. నామినేషన్ కేంద్రం లోపల దాడులు చేస్తుంటే చెవిరెడ్డి నివాసం వద్ద భద్రత పేరుతో అందరినీ కట్టడి చేయడం, ఇక్కడ జరిగే ప్రతి సన్నివేశాన్ని టీడీపీ ఎమ్మెల్యే పులివర్తి నానికి చేరవేస్తున్న పోలీసుల పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక దశలో పోలీసులను తుమ్మలగుంట నుంచి వెళ్లిపోవాలని గట్టిగట్టిగా కేకలు వేశారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు అలుముకున్నాయి. అనంతరం పోలీసు ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని అభ్యర్థులకు నచ్చజెప్పడంతో ఒకింత సర్దుమనిగారు.

# తుమ్మూరు నుంచి రాజేశ్వరమ్మ ప్రచారానికి శ్రీకారం

- నాయుడుపేట మున్సిపాలిటీ 1వ వార్డులో ఇంటింటా ఓటర్లకు విన్నపం
- పెద్దల ఆశీస్సులు అందుకున్న వైకాపా చైర్‌పర్సన్ అభ్యర్థి
- మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తామని హామీ.. ప్రచారంలో పార్టీ శ్రేణులు

ప్రజా భూమి ప్రతినిధి నాయుడుపేట

ప్రజల ఆదరణే బలంగా, పట్టణాభివృద్ధే లక్ష్యంగా ఎన్నికల బరిలో నిలిచినట్లు నాయుడుపేట మున్సిపల్ చైర్‌పర్సన్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తుంబిరెడ్డి రాజేశ్వరమ్మ తెలిపారు. గురువారం ఉదయం మున్సిపాలిటీ పరిధిలోని తుమ్మూరు 1వ వార్డులో ఆమె ఇంటింటి ప్రచారానికి శ్రీకారం చుట్టారు. స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇళ్లకు వెళ్లి ఓటర్లను పలకరించారు. తనకు మద్దతు తెలిపి గెలిపించాలని కోరారు. ప్రచారంలో భాగంగా పెద్దలకు నమస్కరించి ఆశీస్సులు అందుకున్నారు మహిళలతో



ముచ్చటించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. స్థానికులు ఆమెకు స్వాగతం పలికారు. వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, మౌలిక నదుపాయాల అవసరాలను అడిగి తెలుసుకుంటూ ప్రచారాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా రాజేశ్వరమ్మ మాట్లాడుతూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్న సంకల్పంతో ముందుకొచ్చినట్లు పేర్కొన్నారు. తనను గెలిపిస్తే వార్డుల్లో మౌలిక వసతుల మెరుగుదలకు ప్రాధాన్యమిస్తానని హామీ ఇచ్చారు. నాయుడుపేటను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి ప్రజల సహకారం అవసరమని కోరారు.

ప్రతి ప్రాంతం అవసరాలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. వైకాపా అభ్యర్థులను ఆదరించాలని ప్రచారంలో పాల్గొన్న పార్టీ నాయకులు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. రాజేశ్వరమ్మకు లభిస్తున్న స్పందన తమకు ఉత్సాహాన్ని ఇస్తోందని, ఆమె విజయానికి సమష్టిగా పనిచేస్తామని పార్టీ శ్రేణులు పేర్కొన్నాయి. ఈ కార్యక్రమంలో వైకాపా సీనియర్ నాయకులు, స్థానిక వార్డు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు

# వాకాడులో ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగిస్తున్నారు !

### ప్రతిపక్ష నేతలపై దాడులు.. అక్రమ కేసులతో ఎన్నికలకు దూరం చేసే ప్రయత్నం: వైసీపీ సీనియర్ నేత కొడవలూరు భక్తవత్సల రెడ్డి

ప్రజాభూమి ప్రతినిధి,వాకాడు

రాజకీయ చైతన్యం కలిగిన వాకాడు మండలంలో ఎన్నడూ లేని విధంగా చోటుచేసుకుంటున్న పరిణామాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని వైసీపీ సీనియర్ నేత కొడవలూరు భక్తవత్సల రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలను నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని కూటమి నేతలపై ఆయన ఆరోపణలు చేశారు. ఇతర ప్రాంతాల నుంచి సుమారు 500 మంది కిరాయి గుండాలను వాకాడుకు తీసుకువచ్చి వైసీపీ నేతలపై భౌతిక దాడులకు పాల్పడి, వారిని గాయపరిచి, కారును ధ్వంసం చేశారని భక్తవత్సల రెడ్డి ఆరోపించారు. ఎన్నికల్లో ప్రతిపక్షాన్ని రాజకీయంగా ఎదుర్కోలేక వైసీపీ ముఖ్య నేతలపై నాన్ బెయిలబుల్ కేసులు బనాయించి ఎన్నికల ప్రక్రియకు దూరం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. వాకాడు మండల చరిత్రలో ఇలాంటి పరిణామాలు చీకటి రోజుగా మిగిలిపోతాయని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి పార్టీకి



ఎన్నికల్లో పాల్గొనే అవకాశం ఉండాలని, నామినేషన్ల ప్రక్రియకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన అభిప్రాయపడ్డారు.

రేపు నామినేషన్ల దాఖలుకు చివరి రోజు కావడంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలివచ్చి అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు సహకరించాలని భక్తవత్సల రెడ్డి పిలుపునిచ్చారు.

# చంద్రగిరి మండలంలో ఎంపీటీసీ నామినేషన్ల జోరు -: రెండు రోజుల్లో 41 నామినేషన్ల దాఖలు!

- రెండో రోజు పోటెత్తిన అభ్యర్థులు.. ఒక్కరోజే 31 నామినేషన్లు స్వీకరణ..
- టీడీపీ నుంచి అత్యధికంగా 35, ఇతరులు 4, వైసీపీ నుంచి 2 నామినేషన్లు దాఖలు..
- కూటమి ఎంపీపీ అభ్యర్థిగా కల్ రోడ్డు పల్లి నుంచి నామినేషన్ వేసిన సరిత రమణమూర్తి..
- మండల పరిషత్ కార్యాలయం వద్దపెరిగినఎన్నికల కోలాహలం..

ప్రజాభూమి ప్రతినిధి,చంద్రగిరి:

చంద్రగిరి మండలంలో స్థానిక సంస్థల సమరం ఊపందుకుంది. ఎంపీడీవో కార్యాలయంలో కొనసాగుతున్న ఎంపీటీసీ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ రెండో రోజు అత్యంత ఉత్సాహంగా సాగింది. మండల పరిధిలోని మొత్తం 16 ఎంపీటీసీ స్థానాలకు గాను ఆశావాహులు, ప్రధాన పార్టీల అభ్యర్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారులకు అందజేశారు. తొలిరోజు చంద్రగిరి మండలంలో తెలుగుదేశం పార్టీ తరఫున 10 నామినేషన్లు దాఖలు కాగా, రెండో రోజు నామినేషన్ల దాఖలు భారీగా పెరిగింది. ఒక్కరోజే మొత్తం 31 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో టీడీపీ నుంచి 25, స్వతంత్రులు/ఇతరుల నుంచి 4, వైసీపీ



నుంచి 2 నామినేషన్లు ఉన్నాయి. రెండు రోజులు కలిపి మొత్తం 41 నామినేషన్లు దాఖలవగా.. అందులో అత్యధికంగా తెలుగుదేశం పార్టీ నుంచే 35 నామినేషన్లు దాఖలు కావడం గమనార్హం. వైసీపీ నుంచి 2, ఇతరుల నుంచి 4 నామినేషన్లు వచ్చాయి.

**కల్ రోడ్డు పల్లి నుంచి బరిలోకి ఎంపీపీ అభ్యర్థి:**

చంద్రగిరి మండల పరిషత్ అధ్యక్ష (ఎంపీపీ) పదవికి కూటమి తరఫున ఎంపీపీ అభ్యర్థిగా సరిత రమణమూర్తి నామినేషన్ దాఖలు చేశారు. కల్ రోడ్డు పల్లి ఎంపీటీసీ స్థానం నుంచి ఆమె కూటమి బలపరిచిన అభ్యర్థిగా పెద్ద ఎత్తున కార్యకర్తలు, మద్దతుదారులతో కలిసి వచ్చి నామినేషన్ పత్రాలను సమర్పించారు. సరిత రమణమూర్తి అభ్యర్థిత్వంతో కూటమి శ్రేణుల్లో ఉత్సాహం మరింత రెట్టింపైంది. మండలంలోని 16 స్థానాల్లోనూ మెజారిటీ స్థానాలను కైవసం చేసుకుని ఎంపీపీ పీఠాన్ని దక్కించుకుంటామని కూటమి నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

## ప్రభుత్వాసుపత్రిలో సురేష్ రెడ్డిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి



ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్

స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఎంపీటీసీ నామినేషన్ వేయడానికి వచ్చిన తొట్టంబేడు మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ రెడ్డి తల పగలగొట్టి నామినేషన్ పత్రాలను చించివేసిన శ్రీకాళహస్తి టిడిపి గుండాలు. అనంతరం సురేష్ ను 108 అంబులెన్స్ లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, శ్రీకాళహస్తిలో కొత్త సాంప్రదాయానికి నాంది పలికిన ప్రత్యర్థులు పద్ధతి మార్చుకోకుండా దాడులకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల వైఫల్యం వల్లే ఇటువంటి అన్యాయాలు జరుగుతున్నాయని ఆరోపించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధితుడికి పూర్తి న్యాయం జరిగే వరకు తాము అండగా ఉంటామని ఆయన స్పష్టం చేశారు.

## ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను పరిశీలించిన జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ ప్రక్రియ లో భాగంగా రెండవ రోజు గురువారం తిరుపతి జిల్లాలోని బాలాయపల్లి, వెంకటగిరి మండల కార్యాలయాల్లో జరుగుతున్న ఎం పి టి సి




నామినేషన్ ప్రక్రియను జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు పరిశీలించారు. ఈ సందర్భంగా బ్యాలెట్ బాక్స్ లు, భద్రతా ప్రమాణాలను పరిశీలించారు. నామినేషన్ నుండి కౌంటింగ్ వరకు ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని, అధికారులను ఆదేశించారు.

## విధులు కేటాయించిన పిఓలు, ఏపీవోలు, ఓపిఓలకు ఎన్నికల విధుల నుండి మినహాయింపు లేదు

**ఎన్నికల విధులకు గైర్హాజరైతే ఎన్నికల నిబంధనల మేరకు చర్యలు తప్పవు :జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డా. ఎస్ వెంకటేశ్వర్**

ప్రజా భూమి ప్రతినిధి,తిరుపతి

స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి విధులు కేటాయించిన పీఓ లు, ఏపీవోలు, ఓపీఓ లు వారి విధులకు తప్పక హాజరు కావాలని, ఎన్నికల విధుల నుండి ఎటువంటి మినహాయింపు లేదని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డా. ఎస్ వెంకటేశ్వర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మున్సిపల్, జడ్పిటిసి, ఎంపిటిసి మరియు గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ప్రిసైడింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లు మరియు ఇతర పోలింగ్ అధికారులకు ఇదివరకే ఎన్నికల విధులు కేటాయించి ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందన్నారు. పోలింగ్ సిబ్బందికి కేటాయించిన మేరకు విధులకు తప్పక హాజరు కావాలని ఆదేశించారు. ఎన్నికల విధుల నుండి ఎవ్వరికీ ఎటువంటి మినహాయింపు కల్పించడం లేదని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికల విధులకు గైర్హాజరైన సిబ్బంది పై ఎన్నికల నిబంధనలను అనుసరించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హెచ్చరించారు.



# సరస్ మేళాలో సాంస్కృతిక సందడి..

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ:

జాతీయ సరస్ మేళా ప్రాంగణంలో సాయంత్రం వేళ నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. చిన్నారులు తమలోని ప్రతిభను చాటుకుంటూ ప్రదర్శించిన నృత్యాలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులతో కలిసి ఈ ప్రదర్శనలను ఆసక్తిగా తిలకించి, తమ ప్రతిభతో ఆకట్టుకున్న చిన్నారులను అభినందించి ప్రోత్సహించారు. ఇలాంటి వేదికలు చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడంతో పాటు, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. సంప్రదాయ కళలు, సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు పరిచయం చేయడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. సరస్ మేళా కొనుగోళ్లు, గ్రామీణ మహిళల ఉత్పత్తుల ప్రదర్శనలకే పరిమితం కాకుండా, కళలు, సంస్కృతి, ప్రతిభకు వేదికగా నిలుస్తూ సందర్శకులకు ఆహ్లాదకరమైన అనుభూతిని అందిస్తోంది.





ప్రజాభూమి
పోలవరం
శుక్రవారం, అక్టోబర్ 23, 2026


# జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యం.!



❖ వైసీపీ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తా..
❖ స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే ధ్యేయం
❖ తాడేపల్లిలో వైసీపీలో చేరిన పాటంశెట్టి సూర్యచంద్ర దంపతులు
❖ కూటమి హామీలపై ప్రజలకు వివరించాలి.. పార్టీ శ్రేణులకు సూర్యచంద్ర పిలుపు

ప్రజాభూమి జగ్గంపేట :
పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పనిచేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మరోసారి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చూడటమే తన లక్ష్యమని వైసీపీ నాయకుడు పాటంశెట్టి సూర్యచంద్ర స్పష్టం చేశారు.

పార్టీ బలోపేతానికి, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థుల విజయానికి తన వంతు కృషి చేస్తానని ప్రకటించారు.తోట నరసింహం ఆధ్వర్యంలో గురువారం తాడేపల్లిలో తన భార్య శ్రీదేవితో పాటు ముఖ్యమైన అనుచరులతో కలిసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు సూర్యచంద్ర తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేస్తానని, ప్రజల్లోకి వెళ్లి పార్టీ విధానాలను వివరించడంతో పాటు అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

**కూటమి హామీలపై ప్రజలకు వివరించాలి**

2024 ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రజల్లో చర్చ జరగాలని సూర్యచంద్ర అన్నారు. హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చకుండా మరో సారి ఓట్ల కోసం ప్రజల ముందుకు వస్తున్నారని ఆయన విమర్శించారు.
ఎన్నికల సమయంలో ఇచ్చే హామీలను, వాటి అమలు తీరును ప్రజలు నిశితంగా పరిశీలించాలని కోరారు.

**జగ్గంపేటలో వైసీపీ విజయానికి కృషి**

జగ్గంపేట నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూర్యచంద్ర పిలుపునిచ్చారు.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. అదే సమయంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రజలకు వాస్తవాలను తెలియజేయాలని కోరారు.వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడం, ప్రజల సమస్యలపై పోరాడటం, స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయడం తన ప్రాధాన్యతలని పాటంశెట్టి సూర్యచంద్ర వెల్లడించారు.



## వీఆర్‌పురంలో జోరందుకున్న నామినేషన్ల పర్వం

### ఒక్కరోజే 12 నామినేషన్లు దాఖలు

ప్రజాభూమి, ప్రతినిధి, వి.ఆర్.పురం:
రెండవ సాధారణ ఎన్నికలు–2026లో భాగంగా ఎం.పీ.టీ.సీ, జెడ్.పీ.టీ.సీ స్థానాలకు నామినేషన్ల ప్రక్రియ వి.ఆర్.పురం మండలంలో జోరుగా కొనసాగుతోంది. గురువారం (22-10-2026) మండలంలో మొత్తం 12 నామినేషన్లు దాఖలైనట్లు ఎంపీడీవో, రిటర్నింగ్ అధికారి సహాయకులు తెలిపారు. దాఖలైన నామినేషన్లలో వైఎస్సార్‌సీపీ నుంచి 8, సీపీఎం నుంచి 3, టీడీపీ నుంచి 1 నామినేషన్ ఉన్నాయి. దీంతో ఒక్కరోజులోనే 12 నామినేషన్లు రావడంతో మండలంలో ఎన్నికల సందడి మరింత పెరిగింది. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు, నామినేషన్ల దాఖలుపై దృష్టి సారిస్తున్నారు. రానున్న రోజుల్లో నామినేషన్ల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

## సీఎండీ లే అవుట్‌లో ఘనంగా కొమరం భీమ్ జయంతి వేడుకలు



ప్రజాభూమి ప్రతినిధి, గోకవరం:
తూర్పుగోదావరి జిల్లా జగ్గంపేట నియోజకవర్గం గోకవరం మండలంలోని తంటికొండ రోడ్డులో ఉన్న సీఎండీ కార్యాలయం వద్ద కొమరం భీమ్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, జగ్గంపేట నియోజక వర్గ బీఎల్‌ఏ-1 కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా కొమరం భీ మ్ చిత్రపటానికి కంబాల శ్రీనివాసరావుతో పాటు బీజే పీ నాయకులు, కార్యకర్తలు పూల మాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఆదివాసీల హ క్కుల సాధన కో సం కొమరం భీమ్ చేసిన పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు. 'జల్–జంగల్–జమీన్' నినాదంతో గిరిజనుల హక్కుల కోసం పోరాడిన ఆయన జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. నిజాం పాలనలో గిరిజనులు ఎదుర్కొన్న అన్యాయాలు, అణచివేతలకు వ్యతిరేకంగా కొమరం భీమ్ చేసిన పోరాటాన్ని స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణునిపాలెం ఎంపీటీసీ బరిలో కొంగరపు రాజు.. టీడీపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు.!

జ్యోతుల నెహ్రూ, జ్యోతుల నవీన్ ఆశీస్సులతో ఎన్నికల సమరానికి సిద్ధం
రాజుకు అండగా పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు.. అభ్యర్థిత్వంపై టీడీపీ శ్రేణుల్లో హర్షం




ప్రజాభూమి గోకవరం :
కృష్ణునిపాలెం ఎంపీటీసీ ఎన్నికల బరిలో టీడీపీ అభ్యర్థిగా కొంగరపు రాజు నిలిచారు. పార్టీ అధిష్ఠానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఎంపీటీసీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. తనకు ఈ అవకాశం కల్పించిన జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కు రాజు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**పార్టీ సేవలకు గుర్తింపుగా అవకాశం**

కృష్ణునిపాలెం గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా, గోకవరం మండల టీడీపీ మీడియా కోఆర్డినేటర్‌గా కొంగరపు రాజు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ నాయకులు, కార్యకర్తలతో సమన్వయంతో ముందుకు సాగుతున్నారు. పార్టీకి ఆయన అందిస్తున్న సేవలను గుర్తించి ఎంపీటీసీ అభ్యర్థిగా అవకాశం కల్పించడంపై పార్టీ వర్గాల్లో సంతోషం వ్యక్తమవుతోంది.

**రాజుకు నాయకులు, గ్రామ పెద్దల మద్దతు**

కొంగరపు రాజు నామినేషన్‌కు రాష్ట్ర టీడీపీ కార్యదర్శి కన్నబాబు, రాజు చెరువు చైర్మన్ మండిగ బాలాజీ, ఆర్‌అండ్‌ఆర్ కాలనీ పెద్దలు, గ్రామ పెద్దలు మద్దతు తెలిపి బలపరిచారు. పార్టీ నాయకుల ప్రోత్సాహం, గ్రామ పెద్దల అండతో రాజు ఎన్నికల బరిలోకి దిగారు.

**గ్రామాభివృద్ధే లక్ష్యంగా ముందడు**

గుఎంపీటీసీ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపిన కొంగరపు రాజు, తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజల మద్దతుతో గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని, ప్రజల సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉంటూ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు.

## పోలవరం జిల్లాలో జనసేన పోటీకి సన్నద్ధత?




❖ స్థానిక ఎన్నికల్లో అభ్యర్థులను సిద్ధం చేయాలంటూ పార్టీ శ్రేణులకు ఆదేశాల ప్రచారం
❖ కూటమి సీట్ల సర్దుబాటుపై ఆసక్తి.. జిల్లావ్యాప్తంగా రాజకీయ వర్గాల్లో చర్చ

పోలవరం జిల్లా ప్రజా భూమి
స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పోలవరం జిల్లాలో రాజకీయ సమీకరణాలు ఆసక్తికరంగా మారు తున్నాయి. జిల్లాలోని పన్నెండు మండలాల పరిధిలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్న వేళ జనసేన పోటీ తీరుపై చర్చ మొదలైంది. స్థానిక ఎన్నికల్లో పోటీకి అభ్యర్థులను సిద్ధం చేసుకోవాలంటూ పార్టీ శ్రేణులకు నాయకత్వం నుంచి ఆదేశాలు వచ్చినట్లు ప్రచారం జరుగుతుండటంతో రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.జిల్లాలోని పలు మండలాల్లో స్థానిక నాయకులు అభ్యర్థుల ఎంపిక, నామినేషన్ల దాఖలు, పార్టీ పరంగా అనుసరించాల్సిన వ్యూహాలపై దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు కూటమి భాగస్వామ్య పార్టీల మధ్య స్థానాల కేటా యింపుపై స్పష్టత కోసం ఆశావహులు ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో జనసేన పోటీకి సంబం ధించిన పరిణామాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు కుదిరితే పరస్పర అవగాహనతో అభ్యర్థులను బరిలోకి దించే అవకాశం ఉంటుంది. అదే సర్దుబాటు కుదరక వేర్వేరుగా పోటీ చేసే పరిస్థితి ఏర్పడితే, కొన్ని స్థానాల్లో కూటమి భాగస్వామ్య పార్టీల అభ్యర్థులు పరస్పరం తలపడే అవకాశం ఉంటుంది. అటువంటి పరిస్థితుల్లో ఓట్ల సమీకరణాలు, స్థానిక రాజకీయ సంబంధాలపై ఎలాంటి ప్రభావం ఉంటుందన్నది చర్చనీయాంశంగా మారింది.అయితే జనసేన జిల్లావ్యాప్తంగా ఎన్ని ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల్లో పోటీ చేయనుంది? కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటుపై తుది నిర్ణయం ఏమిటి? అభ్యర్థుల ఎంపిక విషయంలో పార్టీ నాయకత్వం ఎలాంటి కార్యాచరణను అనుసరించనుంది? అన్న అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. ప్రచారంలో ఉన్న ఆదేశాలపై అధికారిక ప్రకటన వెలువడితేనే జనసేన పోటీ స్వరూపంపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.నామినేషన్ల ప్రక్రియ కీలక దశకు చేరుకుంటున్న సమయంలో జిల్లాలోని పన్నెండు మండలాల్లో రాజకీయ పరిణామాలు ఎలా మారుతాయన్నది ఆసక్తికరంగా మారింది. కూటమి పార్టీల మధ్య సమన్వయం, జనసేన పోటీపై తుది నిర్ణయం రానున్న రోజుల్లో స్థానిక ఎన్నికల రాజకీయాల్లో ప్రధాన చర్చగా నిలవనున్నాయి.

## పార్టీ జెండానే ఊపిరిగా.. ప్రజాసేవే లక్ష్యంగా!

❖ బరదనంపల్లి ఎంపీటీసీ బరిలో టీడీపీ సీనియర్ నాయకుడు దంతులూరి శివాజీ రాజు ❖ నామినేషన్ దాఖలు.. కూటమి మద్దతుతో ఎన్నికల సమరానికి సిద్ధం



రాజవొమ్మంగి, ప్రజాభూమి:
తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ జెండానే తన రాజకీయ ప్రస్థానానికి గుర్తుగా మలుచుకుని ముందుకు సాగుతున్న సీనియర్ నాయకుడు దంతులూరి శివాజీ రాజు ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల బరిలో నిలిచారు. రాజవొమ్మంగి మండలం బరదనంపల్లి పంచాయతీ ఎంపీటీసీ స్థానానికి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. పార్టీ పట్ల దీర్ఘకాల నిబద్ధత, స్థానిక ప్రజలతో ఆయనకు ఉన్న అనుబంధం ఈ ఎన్నికల వేళ ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

**పార్టీ కోసం సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం**

తెలుగుదేశం పార్టీని నందమూరి తారక రామారావు స్థాపించిన నాటి నుంచి పార్టీతో అనుబంధాన్ని కొనసాగిస్తున్న నాయకుల్లో దంతులూరి శివాజీ రాజు ఒకరు. రాజకీయ పరిణామాలు మారినా, నాయకులు మారినా పార్టీని వీడకుండా తనదైన పంథాలో కొనసాగడం ఆయన రాజకీయ ప్రస్థానంలో ప్రత్యేకతగా నిలుస్తోంది. పదవుల కంటే పార్టీ అభివృద్ధికి, ప్రజలకు అందుబాటులో ఉండటానికే ప్రాధాన్యం ఇస్తారన్నది ఆయన సన్నిహితుల అభిప్రాయం.

**ప్రజలతో మమేకమవుతూ.. సమస్యలపై ఆరా**



ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు సక్రమంగా అందుతున్నాయా? ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలేమిటి? అనే అంశాలపై ప్రజలతో మాట్లాడి తెలుసుకుంటూ, తన పరిధిలో స్పందించడం ద్వారా స్థానికంగా గుర్తింపు పొందారని ఆయన అనుచరులు పేర్కొంటున్నారు. వివిధ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిగా తనదైన ముద్ర వేసుకున్నారని చెబుతున్నారు.

**ఎమ్మెల్యే మద్దతుతో ఎన్నికల బరిలోకి**

రంపచోడవరం నియోజకవర్గ ఎమ్మెల్యే దంతులూరి శివరామచంద్రరాజు మద్దతు కూడా శివాజీ రాజుకు ఉందని అందిన సమాచారం నేపథ్యంలో ఆయన అభ్యర్థిత్వంపై ఆసక్తి నెలకొంది. బరదనంపల్లి పంచాయతీ ఎంపీటీసీ స్థానంలో ప్రజల మద్దతుతో విజయం సాధించాలనే లక్ష్యంతో ఆయన ఎన్నికల ప్రచారానికి సిద్ధమవుతున్నారు.



పదవుల కోసం కాకుండా పార్టీ అభివృద్ధి కోసం పనిచేయాలన్నదే తన ధోరణిగా చెబుతున్న శివాజీ రాజు, ఈసారి ప్రజాప్రతినిధిగా సేవ చేసే అవకాశం కల్పించాలని కోరుతున్నారు. తనకు మద్దతుగా నిలిచి అఖండ మెజారి టీతో గెలిపించాలని బరదనంపల్లి ప్రజల ను అభ్యర్థిస్తున్నారు. దీర్ఘకాల పార్టీ అను బంధం, స్థాని క ప్రజలతో సంబంధాలు ఈ ఎన్నికల్లో ఎలాంటి ప్రభావం చూపు తాయన్నది ఫలితాల అనంతరం తేలనుంది.

## పోలవరం జిల్లా వ్యాప్తంగా ముమ్మర తనిఖీలు

ఎన్నికల నేపథ్యంలో ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ బృందాల తనిఖీలు ముమ్మరం


చింతూరు డివిజన్ VR పురం సెంటర్ లో


జి కొత్తూరు ఏరియాలో తనిఖీలు


చింతూరు డివిజన్ రేకపల్లిలో ఎన్నికల దృష్ట్యా పోలీసులు ఆర్టీసీ బస్సును తనిఖీ చేస్తున్న దృశ్యం

ప్రజాభూమి ప్రతినిధి రంపచోడవరం
రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా పోలవరం జిల్లాలో విస్తృతస్థాయిలో ఒకేసారి పోలీస్ యంత్రాంగం తనిఖీలు నిర్వహించింది పోలవరం జిల్లాలో ఉన్న రంపచోడవరం రెవెన్యూ డివిజన్ మరియు చింతూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఈ తనిఖీలు నిర్వహించారు ఇందులో భాగంగా వాహనాలను ఆపి పూర్తిస్థాయిలో వాటిని పరిశీలించి విడుదల చేస్తున్నారు సమ స్యా త్మక ప్రాంతాలను పొంది గుర్తించి అక్కడ ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశారుఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో భాగంగా ఎస్ఎస్‌టీ (స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్), ఎఫ్ఎస్‌టీ (ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్) బృందాలు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయి. నగదు, మద్యం, ఇతర ప్రలోభపరిచే వస్తువుల అక్రమ రవాణా, ఓటర్లను ప్రలో భపెట్టే చర్యలను అరికట్టేందుకు వాహనాలను తనిఖీ చేస్తూ, ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించకుండా నిఘా కొనసాగిస్తున్నాయి.


మారేడు మిల్లి లో SST టీం వాహనాలు తనిఖీ


జిల్లా కేంద్రం రంపచోడవరం లో పోలీసుల తనిఖీలు



## రాజవొమ్మంగిలో రెండో రోజు 32 నామినేషన్లు



**రెండు రోజుల్లో 35 దరఖాస్తులు..**
**ఎంపీటీసీ స్థానాలపై పార్టీల దృష్టి**

ప్రజాభూమి ప్రతినిధి రాజవొమ్మంగి
రాజవొమ్మంగి మండలంలో ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. రెండో రోజు గురువారం వివిధ పార్టీల అభ్య ర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఒక్కరోజే 32 నామినేషన్లు రావడంతో ఎన్నికల సందడి పెరిగింది. తొలి రోజు వచ్చిన మూడు నామినేషన్లతో కలిపి రెండు రోజుల్లో మొత్తం 35 దరఖా స్తులు నమోదయ్యాయి.గురువారం దాఖలైన నామినేషన్లలో తెలు గుదేశం పార్టీ తరఫున తొమ్మిది, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున 18, జనసేన పార్టీ తరఫున నాలుగు, ఆదివాసీ జేఏసీ తరఫున ఒక నామినేషన్ ఉన్నాయి. ఈ వివరాలను బట్టి రెండో రోజు నామినేషన్లలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున అత్యధికంగా దరఖాస్తులు దాఖలయ్యాయి.నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుండటంతో మండలంలోని ఎంపీటీసీ స్థానాల్లో పోటీపై ఆసక్తి నెలకొంది. గడువు ముగిసేలోగా మరిన్ని నామినేషన్లు దాఖలయ్యే అవకాశం ఉండటంతో తదుపరి పరిణామాలపై రాజకీయ వర్గాలు దృష్టి సారిస్తున్నాయి.

## రాజవొమ్మంగి జెడ్పీటీసీ బరిలో మురళీకృష్ణ

### వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా నామినేషన్ పత్రాల సమర్పణ



రాజవొమ్మంగి ప్రజా భూమి
రాజవొమ్మంగి జెడ్పీటీసీ స్థానానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా కొంగర మురళీకృష్ణ నామినేషన్ దాఖలు చేశారు. గురువారం సంబంధిత నామినేషన్ కేంద్రంలో అధికారికి నామినేషన్ పత్రాలను అందజేశారు. దీంతో రాజవొ మ్మం గి మండలంలో జెడ్పీటీసీ ఎన్నికల పోటీపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యం లో రాజవొమ్మంగి మండలంలో రాజకీయ సమీకరణాలు ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. జెడ్పీటీసీ స్థానా నికి అభ్యర్థుల నామినేషన్లతో ఎన్నికల వాతావరణం వేడెక్కుతోంది. నామినేషన్ల ప్రక్రియ పూర్తయి, అభ్యర్థుల తుది జాబితా వెలువడిన తర్వాత ఎన్నికల పోటీపై మరింత స్పష్టత రానుంది.

## పోలవరం జిల్లా నూతన డిఆర్ఓ గా ఆర్ శివరావు

ప్రజాభూమి ప్రతినిధి రంపచోడవరం
పోలవరం నూతన జిల్లా డిస్ట్రిక్ట్ రెవెన్యూ ఆఫీసర్ (డీఆర్ఓ)గా ఆర్. శివరావు పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ వారిని జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వారికీ పుష్ప మొక్కను అందజేయడం జరిగింది.అనంతరం ఇరువురు జిల్లా పరిపాలనకు సంబంధించిన అంశాలపై మర్యాదపూర్వకంగా మాట్లాడారు.జిల్లా అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో సంబంధిత శాఖల మధ్య సమన్వయం ఎంతో ముఖ్యమైనదని జిల్లా పరిపాలనలో రెవెన్యూ శాఖ కీలక పాత్ర పోషిస్తుందని, ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సమర్థవంతంగా అందించడంలో రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన కలెక్టర్ సూచించారు.





## ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**❖ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ❖ పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ ❖ స్ట్రాంగ్ రూముల భద్రతపై రాజీపడే ప్రసక్తే లేదు.. కిటికీలను ఇటుకలతో మూసివేయాలని ఆదేశం ❖ ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు**

ప్రజాభూమి ప్రతినిధి,తిరువూరు:

మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికలను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ముందస్తు ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ సంబంధిత అధికారులను ఆదేశించారు.తిరువూరు మున్సిపల్ పరిధిలోని పలు పోలింగ్ స్టేషన్లు, స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాలను గురువారం జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి క్షేత్రస్థాయి ఏర్పాట్లను నిశితంగా పరిశీలించారు. తొలుత తిరువూరు స్థానిక జడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్లను కలెక్టర్ పరిశీలించారు. ఓటర్లు తమ పోలింగ్ కేంద్రాలను సులభంగా గుర్తించే విధంగా ప్రతి బూత్ వద్ద స్పష్టమైన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. తాగునీరు, విద్యుత్, దివ్యాంగులకు ర్యాంపుల వంటి కనీస మౌలిక వసతుల్లో ఎక్కడా లోపాలు తలెత్తకుండా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని, శాంతిభద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యమివ్వాలని స్పష్టం చేశారు. అనంతరం తిరువూరు శ్రీ వాహిని ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాలలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాటు చేస్తున్న స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాలను కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్ట్రాంగ్ రూముల భద్రత అత్యంత కీలకమని, కిటికీలను తాత్కాలికంగా చెక్కలతో కాకుండా పూర్తిగా ఇటుకలు, సిమెంట్ గోడలతో మూసివేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కౌంటింగ్ కేంద్రాలకు వచ్చే సిబ్బందికి, రాజకీయ పార్టీల ఏజెంట్లకు, ప్రజలకు ఎలాంటి గందరగోళం లేకుండా వేర్వేరు ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి విభాగం వద్ద ఎవరికి కేటాయించిన మార్గమో తెలిపేలా భారీ సైన్ బోర్డులు తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, పోలింగ్ సిబ్బందికి విధివిధానాలపై పూర్తిస్థాయి సమగ్ర శిక్షణ ఇవ్వాలని ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవోలను కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలకు తావులేకుండా కట్టుదిట్టమైన నిఘా ఉంచాలని హెచ్చరించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులకు, అభ్యర్థులకు ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో, నిర్దేశిత గడువులోగా ఎన్నికల ఏర్పాట్లన్నీ పూర్తి చేసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి, ప్రజాస్వామ్య పండుగలాంటి ఈ ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా తిరువూరు ప్రజలు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ కోరారు.ఈ తనిఖీ కార్యక్రమంలో స్థానిక తిరువూరు రెవెన్యూ డివిజనల్ అధికారి ఎ.కుమార్, మున్సిపల్ కమిషనర్ మనోజ్ఞ, తహసిల్దార్ డి.చంద్రమౌళి, ఎంపీడీవో సిహెచ్ రవిబాబు, తిరువూరు ఎస్.ఐ శాతకర్ణి, సర్వే శాఖ అధికారులు, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఒక్కో లఖ్‌పతి దీదీ వెనుక ఒక్కో విజయగాథ

**❖ ఎస్‌హెచ్‌జీల శక్తిని చాటుతున్న మహిళామణులు ❖ విజయవాడలో వైభవంగా జాతీయ సరస్ మేళా ❖ గత 10 రోజుల్లోనే రూ. 6 కోట్లకు పైగా వ్యాపార లావాదేవీలు ❖ ప్రతిఒక్కరూ మేళాను సందర్శించండి.. చేనేత, హస్తకళలను ప్రోత్స హించండి ❖ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, సరస్ సమన్వయకర్తలు కటారియా, సుధీర్‌కుమార్**




ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ:

విజయవాడలో నిర్వహిస్తున్న జాతీయ సరస్ మేళా గత పది రోజులుగా అత్యంత విజయవంతంగా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. మేళాలో పాల్గొన్న ప్రతి లఖ్‌పతిదీదీ వెనుక ఒక్కో విజయగాథ ఉందని పేర్కొన్నారు.గురువారం పున్నమిఘాట్ వద్ద జాతీయ సరస్ మేళా ప్రాంగణంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ సాధారణంగా దేశ రాజధాని ఢిల్లీలోనే జరిగే జాతీయస్థాయి సరస్ మేళాను.. కేంద్రం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో తొలిసారిగా ఢిల్లీ వెలుపల విజయవాడలో నిర్వహించడం గర్వకారణమని పేర్కొన్నారు. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముగారు ప్రారంభించిన నాటి నుంచి మేళాకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందని వెల్లడించారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి దాదాపు 600 స్వయం సహాయక సంఘాల మహి ళా పారిశ్రామికవేత్తల స్టాళ్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గత 10 రోజుల్లోనే రూ. 6 కోట్లకుపైగా వ్యాపార లావాదేవీలు నమోదయ్యాయని, ఇది ఢిల్లీ స్థాయి అమ్మకాలతో సమానమని చెప్పారు. ఇక్కడ ఏర్పాటు చేసిన 'ఇండియా ఫుడ్ కోర్ట్' ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని, దేశంలోని విభిన్న సంప్రదాయ వంటకాలను ప్రజలకు రుచి చూపిస్తూ మహిళా సంఘాలు అద్భుతమైన ప్రతిభను కనబరుస్తున్నాయని ప్రశంసించారు. సరస్ మేళా కేవలం వస్తువుల విక్రయాలకే పరిమి తం కాకుం డా మహిళా పారిశ్రామికవేత్తల ఆలోచనలను పరస్పరం పంచుకునేందుకు, నెట్వర్కింగ్‌కు, గ్లోబల్ బ్రాండింగ్‌కు ఒక గొప్ప వేదికగా నిలిచిందని వివరించారు. ప్రతిరోజూ బయ్యర్స్, వివిధ కంపెనీలు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తూ ఉత్పత్తుల బల్క్ ఆర్డర్లు, ప్రమోషన్లకు సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. వివిధ రాష్ట్రాల చేనేత, హస్తకళల నాణ్యమైన ఉత్ప త్తులు సరసమైన ధరలకే ఒకేచోట లభిస్తున్నాయని, కుటుంబ సమేతంగా అందరూ సరస్ మేళాను సందర్శించి మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు.

**ఎన్ఐఆర్‌డీ - సరస్ మేళా సమన్వయకర్త కటారియా** మాట్లాడుతూ విజయవాడలో కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, ఆంధ్రప్రదేశ్ సెర్ప్ సంయుక్త ఆధ్వర్యంలో అక్టోబర్ 13 నుండి 31 వరకు జాతీయ సరస్ మేళాను నిర్వహిస్తున్నారన్నారు. ఢిల్లీ, ఎన్‌సీఆర్ పరిధి వెలుపల ఈ స్థాయి జాతీయ సరస్ మేళాను ఏర్పాటు చేయడం ఇదే తొలిసారన్నారు. ఈ ప్రదర్శనలో దేశవ్యా ప్తంగా దాదాపు 1,500 మందికి పైగా గ్రామీణ మహిళా పారిశ్రామికవేత్తలు పాల్గొంటున్నారన్నారు. సందర్శకుల కోసం వివిధ రాష్ట్రాల సంప్రదాయ వంటకాలతో 50 ప్రత్యేక ఫుడ్ స్టాళ్లను ఏర్పాటు చేశామన్నారు. సరస్ మేళాలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. ముఖ్యంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని క్రింది స్థాయి అధికారులకు ఎప్పటికప్పుడు ఆదేశా లిస్తూ పూర్తి సహకారం అందిస్తున్నారని అన్నారు.

**సరస్ మేళా కోఆర్డినేటర్ సుధీర్ కుమార్** మాట్లాడుతూ సందర్శకులు, చేతివృత్తుల వారికి సహాయపడేందుకు వెల్‌కమ్ పెవిలియన్, వివిధ ప్రభుత్వ శాఖల పథకాలను వివరించేందుకు కన్వర్జెన్స్ పెవిలియన్, మహిళలకు బ్రాండింగ్, ప్యాకేజింగ్, మార్కెటింగ్‌పై శిక్షణ ఇచ్చేందుకు మీట్ అండ్ గ్రీట్ పెవిలియన్, వస్తువుల తయారీని ప్రత్యక్షంగా ప్రదర్శించేందుకు డెమో పెవిలియన్లను నెలకొల్పామన్నారు.

వీటితో పాటు హెల్త్ డెస్క్, మదర్ కేర్ రూమ్, పిల్లల ఆటల కోసం ప్రత్యేక జోన్ వంటి అన్ని సౌకర్యాలను కల్పించామన్నారు. కాబట్టి విజయవాడ, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు, వివిధ ప్రాంతాల ప్రజలు ఈ మేళాను సందర్శించి మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని ఆయన కోరారు. సమావేశంలో అస్సాంకు చెందిన లఖ్‌పతిదీదీ బర్నాలి పాఠక్ తమ చేనేత వస్త్రాలు, తెలంగాణకు చెందిన లఖ్‌పతిదీదీ రాధిక తమ హస్తకళాభరణాలకు సరస్ మేళా గొప్ప వేదికగా నిలుస్తోందని.. విజయవాడ, పరిసర ప్రాంత ప్రజలు తమను ఎంతో ఆదరిస్తున్నారని పేర్కొన్నారు. ఇంత మంచి అవకాశం కల్పిస్తున్న ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. మీడియా సమావేశం అనంతరం కలెక్టర్ లక్ష్మీశ.. డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, ఇతర అధికారులతో కలిసి సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించి, కళాకారులను అభినందించారు.

## ప్రతి శిశు, మాతృ మరణం ఆ కుటుంబానికి తీరని లోటు

**❖ జిల్లాలో మాతృ, శిశు మరణాల రేటును సున్నాకు తీసుకురావడమే లక్ష్యం ❖ అధిక ప్రమాద గర్భిణులను ముందుగానే గుర్తించి ప్రత్యేక వైద్య పర్యవేక్షణ అందించాలి ❖ సురక్షిత ప్రసవాలు, శిశు సంరక్షణ, పోషకా హా రం, టీకాలపై ప్రత్యేక దృష్టి సారించాలి ❖ మాతృ, శిశు మరణాల కేసులను సమగ్రంగా విశ్లేషించి, పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి : జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ**

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:

జిల్లాలో మాతృ, శిశు మరణాలను పూర్తిస్థాయిలో నివారించడమే లక్ష్యంగా వైద్యారోగ్య శాఖ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఆదేశిం చారు. ప్రతి శిశు, మాతృ మరణం సంబంధిత కుటుంబానికి తీరని లోటని, ఇటువంటి విషాదకర ఘటనలు పునరావృతం కాకుండా ప్రతి మరణానికి గల కారణాలను లోతుగా విశ్లేషించి, నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.విజయవాడ కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరం నందు గురువారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన మాతృ, శిశు మరణాల జిల్లా స్థాయి కమిటీ సమీక్ష సమావేశంలో ఈ ఏడాది ఏప్రిల్‌లో రెండు, మే నెలలో ఒకటి, జూన్ నెలలో ఒకటి చొప్పున నమోదైన మొత్తం నాలుగు శిశు మరణాలు, అలాగే ఆగస్టులో ఒకటి, సెప్టెంబర్‌లో రెండు చొప్పున నమోదైన మొత్తం మూడు మాతృ మరణాలపై సమీక్ష నిర్వహించారు. సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారీగా కేసులను పరిశీలించి, ప్రతి మరణానికి దారితీసిన వైద్యపరమైన, క్షేత్రస్థాయి కారణాలపై వైద్యాధికారులు, సంబంధిత ఆరోగ్య సిబ్బందితో జిల్లా కలెక్టర్ సమగ్రంగా చర్చించారు. మరణాల విశ్లేషణలో భాగంగా గర్భిణులకు అందించిన వైద్య సేవలు, ప్రసవ సమయంలో తీసుకున్న జాగ్రత్తలు, ప్రసవానంతర సంరక్షణ, శిశువుల ఆరోగ్య పరిస్థితి, పోషకాహారం, టీకాల అమలు, అత్యవసర వైద్య సేవలు, రిఫరల్ వ్యవస్థ తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, పర్యవేక్షకులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలతో కేసుల వారీగా సమీక్షించి, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ, మాతృ, శిశు మరణాల నివారణకు ముందస్తు గుర్తింపు, నిరంతర పర్యవేక్షణ, సకాలంలో వైద్య చికిత్స అత్యంత కీలకమని పేర్కొన్నారు. ముఖ్యంగా అధిక ప్రమాద గర్భిణులను ముందుగానే గుర్తించి, వారికి అవసరమైన ప్రత్యేక వైద్య పర్యవేక్షణ అందించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పనిచేసే ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు గర్భిణుల ఆరోగ్య పరిస్థితిని క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తూ, అవసర మైన వైద్య పరీక్షలు, మందులు, పౌష్టికాహారం సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రసవ సమయానికి ముందుగానే తగిన ఏర్పాట్లు చేసుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో గర్భిణుల ను మెరుగైన వైద్య సేవలు అందించే పెద్దాసుపత్రులకు తరలించేందుకు అవసరమైన రవాణా సదుపాయాలను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. అదేవిధంగా అవసరమైన రక్త



నిల్వలు, అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉండేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. గర్భిణులకు సమయానుకూల వైద్య పరీక్షలు నిర్వహించడం, సురక్షిత ప్రసవాలను నిర్ధారించడం, జననం అనంతరం శిశువులకు తగిన సంరక్షణ అందించడం, పోషకాహారంపై దృష్టి సారించడం, నిర్ణీత షెడ్యూల్ ప్రకారం టీకాలు వేయించడం వంటి అంశాల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వరాదని స్పష్టం చేశారు. మాతృ, శిశు మరణాల నివారణ అనేది వైద్యారోగ్య శాఖకే పరిమితమైన బాధ్యత కాదని, సంబంధిత శాఖల అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి కేసులో గుర్తించిన లోపాలను సరిదిద్దడంతో పాటు, సంబంధిత ప్రాంతాల్లో ఆరోగ్య సేవలను మరింత మెరుగుపరచాలని ఆదేశించారు.జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎ. శ్రవణ్ బాబు మాట్లాడుతూ, శిశు ఆరోగ్యం, తల్లుల ఆరోగ్య సంరక్షణపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో ఆరోగ్య సేవల నాణ్యతను పెంపొందించడం, గర్భిణులు మరియు శిశువులకు నిరంతర వైద్య పర్యవేక్షణ అందించడం ద్వారా మాతృ, శిశు మరణాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ఇందుకోసం వైద్య సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ ఓ.మాధవి లత మాట్లాడుతూ, అత్యవసర పరిస్థితుల్లో గర్భిణులు, శిశువులను సరైన సమయంలో మెరుగైన వైద్య సేవలు అందించే ఆసుపత్రులకు తరలించేందుకు రిఫరల్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉన్నత స్థాయి ఆసుపత్రుల మధ్య సమన్వయం మెరుగుపరచడం ద్వారా సకాలంలో వైద్య సేవలు అందించవచ్చని పేర్కొన్నారు.జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఎం.శరత్ బాబు మాట్లాడుతూ, శిశువుల ఆరోగ్య పరిరక్షణలో టీకాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రతి శిశువుకు నిర్ణీత వయస్సులో పూర్తి టీకాలు అందేలా చర్యలు తీసుకోవాలని, టీకాలు వేయించుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు.ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ జె.ఇందుమతి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ఓ.మాధవి లత, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఎం. శరత్ బాబు, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, సీడీపీఓలు, అంగన్వాడీ కార్యకర్తలు, ఇతర సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్.ఎన్. గొల్లపాలెం ఎంపీటీసీ అభ్యర్థిగా పామర్తి కీర్తి నామినేషన్

మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి

కూటమి బలపరిచిన ఎస్.ఎన్. గొల్లపాలెం ఎంపీటీసీ అభ్యర్థి పామర్తి కీర్తి గురువారం నామినేషన్ దాఖలు చేశారు. కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ ఆధ్వ ర్యంలో నామినేషన్ పత్రాలను ఏవోకు అందజేశారు.అంతకుముందు సీతారాంపురం, బి.వి. తోట, ఎస్.ఎన్. గొల్లపాలెం గ్రామాల్లో ప్రజలను, కూటమి కుటుంబ సభ్యులను కలుసు కుంటూ ఆమె నామి నేషన్ కార్యక్రమానికి వెళ్లారు. కూటమి



నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## 27.54 లక్షల మంది పిల్లలకు ఆరోగ్య పరీక్షలు

**లోపాలు గుర్తించిన 27,039 మందికి ఉన్నత స్థాయి వైద్య సేవలు**
**ఆర్‌బీఎస్‌కే అమలుపై ఆరోగ్య శాఖ కార్యదర్శి వీరపాండియన్ సమీక్ష**
**డిసెంబరు నాటికి పరీక్షలు పూర్తి చేయాలని అధికారులకు సూచన**

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ:

రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) కింద గడచిన మూడు నెలల్లో 27.54 లక్షల మంది చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో ఆరోగ్య సమస్యలు గుర్తించిన 27,039 మందికి తదుపరి చికిత్స కొనసాగుతోంది. అలాగే 541 మందికి పలు రకాల శస్త్ర చికిత్సలు నిర్వహించారు. ఆర్‌బీయస్‌కే కింద రాష్ట్రంలోని రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రభుత్వ సహాయ పాఠశాలల్లో 18 ఏళ్లలోపు పిల్లలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. మొత్తం 53,66,466 మంది చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కార్యక్రమం గత జులైలో ఆరోగ్య సిబ్బంది ద్వారా ప్రారంభమైంది. ఇప్పటి వరకు జరిగిన 27.54 లక్ష(51.32%)ల్లో 9,32,352 మందికి మరోమారు వైద్యాధికారులు నిర్ధారణ పరీక్షలు చేశారు. చివరిగా 27,039 మందిలో చికిత్సకు తగ్గ లోపాలున్నట్లు గుర్తించారు. వీరికి పెద్దాసుపత్రుల్లో చికిత్స కొనసాగుతోంది. ఈ కార్యక్రమం అమలు తీరుపై ఆరోగ్య శాఖ కార్యదర్శి జి. వీరపాండియన్ గురువారం ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కె.వి.ఎన్. చక్రధర్‌బాబు, ఇతర ఉన్నతాధికారులతో సమీక్షించి, డిసెంబరు నాటికి పరీక్షలు పూర్తి చేయాలని సూచించారు.పుట్టుకతో వచ్చే లోపాలు 10, వ్యాధులు 5, పోషకాహార లోపాలు 11, ఎదుగుదలలో జాప్యం, వైకల్యాలకు సంబంధించిన సమస్యలు 12 కలిపి మొత్తం 38 రకాల ఆరోగ్య సమస్యలను గుర్తిస్తున్నారు. నాడీ నాళాల లోపాలు 455, డౌన్ సిండ్రోమ్ 243, పెదవి, అంగిలి చీలికలు 153, క్లబ్‌ఫుట్ 142, తుంటి ఎముక సమస్యలు 102, పుట్టుకతో వచ్చే గుండె జబ్బులు 126, కంటిశుక్లం 83, వినికిడి లోపం 62, అకాల శిశువుల కంటి సమస్యలు 33, మూత్రపిండాలు, మూత్రనాళాల పుట్టుకతో వచ్చే లోపాల కింద 8 కేసులు నమోదయ్యాయి.

**పోషకాహార లోపాలు, ఇతర వ్యాధులు**

విటమిన్-ఎ లోపం 3,673, విటమిన్-డి లోపం 1,847, తీవ్రమైన పోషకాహార లోపం 715, రక్తహీనత 650, థైరాయిడ్ గ్రంథి వాపు 338 కేసులను గుర్తించారు. చర్మ సమస్యలు 5,122, రుమాటిక్ గుండె జబ్బులు 5,320, శ్వాస సంబంధ సమస్యలు 1,494, దంత సమస్యలు 1,141, మూర్ఛ 1,037, మధుమేహం 568, అధిక రక్తపోటు 311, మూత్రపిండాల వ్యాధులు 31, చెవి ఇన్‌ఫెక్షన్లు 69, క్షయ 12, కుష్ఠు విభాగంలో 9 కేసులను గుర్తించారు.

**ఇతర సమస్యలు**

కంటి చూపు సమస్యలు 236, వినికిడి లోపాలు 413, నరాల కదలిక సమస్యలు 246, కదలికల ఆలస్యం 181, మేధో వికాస సమస్యలు 61, భాషా వికాస సమస్యలు 45, ప్రవర్తనా సమస్యలు 27, ఆందోళన సమస్యలు 19, శ్రద్ధ లోపం, అతి చురుకుదనం 8, నిద్ర సమస్యలు 4, నాడీ వికాస సమస్యలు 35గా నమోదయ్యాయి. వీటితోపాటు ఆటిజం 15, అభ్యసన సమస్యలు 20, ఎదుగుదలలో తీవ్ర జాప్యం 2, పుట్టుకతో వచ్చే థైరాయిడ్ సమస్యలు 24, కౌమారదశకు సంబంధించిన ఆరోగ్య సమస్యలు 157, మిగిలిన కేసులు తదుపరి పరీక్షల కోసం జిల్లా, బోధానాసుపత్రులకు పంపుతున్నారు. కొందరు ఇప్పటికే చికిత్స పొందుతున్నారు. కొంతమందికి శస్త్రచికిత్సలు కూడా జరిగాయి.

## జలజీవన్ మిషన్ వాటర్ గ్రిడ్ పెండింగ్ పనులను నవంబర్ 6వ తేదీ నాటికి పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్**




ప్రజాభూమి ప్రతినిధి,కాకినాడ:

జలజీవన్ మిషన్ కింద జిల్లాలో పెండింగ్‌లో ఉన్న వాటర్ గ్రిడ్ పనులను నవంబర్ 6వ తేదీ నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆర్ డబ్ల్యూ ఎస్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ లో జిల్లా గ్రామీణ నీటి సరఫరా,పారిశుద్ధ్య మిషన్ వారాంతపు సమీక్ష సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులు,సంబంధిత లైన్ డిపార్ట్‌మెంట్ల అధికారులతో వివిధ పథకాల అమలు,పెండింగ్ పనుల పురో గతిని సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నిర్దేశించిన లక్ష్యాలను గడువు లోగా సాధించేం దుకు పనుల పురోగతిని నిరం తరం పర్యవేక్షిస్తూ, సంబంధిత శాఖల అధి కారు లు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశా రు. జలజీవన్ మిషన్ కింద జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 88 పనులను తదుపరి సమీక్షా సమావేశం నాటికి, నవంబర్ 6వ తేదీలోగా పూర్తి చేయా లని ఆదేశించారు. పనుల పూర్తిలో జాప్యం జరగ కుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచా లని, ఎదురవుతున్న సమస్య లను సం బంధిత శాఖల సమన్వయంతో పరిష్కరించాలని సూచించారు.

**ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు పూర్తి చేయాలి**

ఇంటింటికీ కుళాయి కనెక్షన్ల కల్పనలో భాగంగా స్వల్ప సంఖ్యలో కనెక్షన్లు పెండింగ్ లో ఉన్న 80 గ్రామాల్లో మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి గ్రామంలోని అర్హత కలిగిన గృహాలకు కుళాయి కనెక్షన్లు అందించి,నిర్దేశితప్రమాణాల కు అనుగుణంగా గ్రామాలను 'హర్ ఘర్ జల్' గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టాలన్నారు. తాగు నీటి సరఫరా పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ,లక్ష్యాల సాధన కు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని సూచించారు.

**గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య పనులపై దృష్టి**

సింగిల్ విలేజ్ స్కీముల పనులను నిర్దేశిత గడువు లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. స్వచ్ఛ భారత్ మిషన్ కింద కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌ల నిర్మాణం, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లోతాగు నీటి సౌకర్యాల మెరుగుదలతో పాటు పారిశుద్ధ్య ప్రమాణాల పెంపునకు సంబంధిత అధికారులు సమష్టిగా కృషి చేయాలని తెలిపారు.ప్రభుత్వ పథకాల లక్ష్యాల ను క్షేత్రస్థాయిలో పూర్తి స్థాయిలోఅమలుచేయాలని, ప్రతి పనికి సంబం<ధించిన పురోగతిని సమీక్షిస్తూ పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో ఆర్ డబ్ల్యూ ఎస్ సూపరింటెండెంట్ మహమ్మద్ అబ్దుల్ మదిన్, డివిజనల్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, ఏపీ ఈపీ డీసీఎల్, అటవీ శాఖ, డ్వామా తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.


Printed and Published and owned by A.RAMAMOHANREDDY,Printed at Sri Lakshmi Offset Printers, R.S. No.268/2;D.No. 8/180,Surampalli Village, Gannavaram Mandalam, Krishna district, Andhra Pradesh and Published from D.NO. 32-26-85/6, MSR Street Marutinagar, Eluru Road, Vijayawada-520004,Krishna district, Andhra Pradesh, Editor :A.RAMAMOHANREDDY, RNI NO. APTEL/2011/41440, Phone No. Cell : 9502116677

# పాలకొల్లు రైల్వే స్టేషన్లో సమస్యలు పరిష్కరించాలి

• డిఆర్ యు సీ సీ మెంబర్ జక్కంపూడి కుమార్



ప్రజాభూమి ప్రతినిధి, పాలకొల్లు

పాలకొల్లు రైల్వే స్టేషన్ వద్ద రైల్ జన్ సంవాద్ కార్యక్రమం ఆర్. శంకర్ రావు అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ భీమవరం.కె. మధుసూదన్ రావు స్టేషన్ సూపర్డెంట్ పాలకొల్లు వారి ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ యు సీ సీ నెంబర్ జక్కంపూడి కుమార్ మాట్లాడుతూ పాలకొల్లు పట్టణంలో ఆధునికరించిన రైల్వే స్టేషన్ చాలా సౌకర్యవంతంగా ఉన్నప్పటికీ ఇంకా కొన్ని సమస్యలు పరిష్కరించవలసి ఉన్నదని ఈ సమస్యల్లో ప్రధానంగా రైల్వే గేట్ పడినప్పుడు ట్రాఫిక్ ఇబ్బంది ఏర్పడి లాక్ సెంటర్ నుండి ప్రయాణికులు స్టేషన్ కి వచ్చే సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటూ రిజర్వేషన్ చేయించుకున్నప్పటికీ ఈ ట్రాఫిక్ సమస్య వల్ల ప్రయాణం ఆగిపోయే పరిస్థితి ఏర్పడుతుందని. దీనిని లారీ స్టాండ్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న వంతెన దగ్గర నుండి గూడ్స్ రోడ్డు ద్వారా స్టేషన్ కు చేరుటకు సౌకర్యం కల్పించాలని కోరారు. దీనిని త్వరలో పరిష్కరించే ఏర్పాటు చేస్తామని ఇంజనీర్ తెలిపారు. అలాగే రెండో ఫ్లాట్ ఫారం వద్ద వర్షాకాలం వాటర్ లీక్ అయ్యి కూర్చో నుటకు బల్లలు తడిచి ప్రయాణికుల బ్యాగులు తడిచి అసౌకర్యానికి గురవుతున్నారని దీన్ని వెంటనే పరిష్కరించాలని జక్కంపూడి కుమార్ తెలిపారు. పాలకొల్లు ఏపీ ఎన్జీవో అధ్యక్షుడు గుడాల హరిబాబు మాట్లాడుతూ పాలకొల్లు రైల్వే స్టేషన్ నందు రెండో ఫ్లాట్ వారం నుండి మొదటి ప్లాట్ ఫారం కు అనారోగ్య సమస్యలతో వచ్చే వారి కి వీల్ చైర్ ఏర్పాటు చేసి. రెండో ఫ్లాట్ ఫారం నందు ఫోన్ నెంబర్ తో బోర్డు ఏర్పాటు చేయాలని. రెండో ఫ్లాట్ ఫారం చివర వాష్ రూమ్ ఏర్పాటు చేయాలని. నరసాపురం నుండి వైజాగ్. నర్సాపురం నుండి నిడదవోలు మీదుగా రాజమండ్రి. నరసాపురం నుండి అరుణాచలం.

వారణాసి వెళ్ళుటకు రైలు సౌకర్యం కల్పించాలని. విజయవాడ నుండి మధ్యాహ్నం 2:20కి సాయంత్రం 5:30 కి నర్సాపురం వచ్చు రైలులో కూర్చునుటకు సీటు లేక నిలబడి రావాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఇదే సమయంలో జేబుదొంగలు తో ఇబ్బంది ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని దీనిని పరిష్కరించుటకు ప్రయాణికుల సౌకర్యార్థం అదనపు బోగీలు ఏర్పాటు చేయాలని హరిబాబు కోరడం జరిగింది. సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యదర్శి జి ఎస్ ఎన్ మూర్తి మాట్లాడుతూ పాలకొల్లు రైల్వే స్టేషన్ నందు. సీనియర్ సిటిజన్స్ ప్రయాణించు సమయంలో నడవలేని వారికి మొదటి ప్లాట్ ఫారం నుండి రెండో ఫ్లాట్ ఫారం నకు వెళ్ళుటకు వీల్ చైర్ ఏర్పాటు చేయాలని దానికి సంబంధించిన బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు.

ఈ సమస్యలన్నిటిని ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టి పరిష్కరించుటకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

## 2వ రోజు నామినేషన్లను దాఖలు చేసిన 41 మంది ఎంపీటీసీ అభ్యర్థులు

• టీడీపీ ఎంపీపీ అభ్యర్థి అంగర నామినేషన్ దాఖలు



ప్రజాభూమి ప్రతినిధి, పాలకొల్లు

పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో 2 వ రోజు 41మంది ఎంపీటీసీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్లను రిటర్నింగ్ అధికారి, ఏ డి ఏ మురళీకృష్ణకు అభ్యర్థులు నామినేషన్‌లను గురువారం అందజేశారు. నామినేషన్ దాఖలు చేసిన వారిలో ఎంపీపీ అభ్యర్థి అంగర వీర భద్ర కుమార్ (చిన్న)కూడా వున్నారు. వీర భద్ర కుమార్ మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ కుమారుడు. సగంచెరువు ఎంపీటీసీ టీడీపీ అభ్యర్థి గా పోటీ చేయనున్నారు.ఈ సందర్భంగా వీర భద్ర కుమార్ (చిన్న) మాట్లాడుతూ ఎంపీపీ అభ్యర్థి గా తన పేరు ప్రకటించి నందుకు మంత్రి నిమ్మల రామానాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.మంత్రి నిమ్మల, తన తండ్రి రాంమోహన్ తో కలసి వారి అడుగు జాడల్లో నడుస్తూ ప్రజలకు సేవలాందిస్తానని, ఎంపీటీసీ గా, ఎంపీపీ గా గెలిపించాలని కోరారు.



## కాజులూరులో 59 ఎంపీటీసీ నామినేషన్లు దాఖలు

ప్రజాభూమి ప్రతినిధి, కాజులూరు

స్థానిక సంస్థలు ఎన్నికల్లో భాగంగా ఎంపీటీసీ ఎన్నికల సంబంధించి నామినేషన్ల ప్రక్రియ బుధవారం నుండి ప్రారంభం కాగా కాజులూరు మండల పరిధిలో 20 ఎంపీటీసీ స్థానాలకు గాను గురువారం ఒక్కరోజు 44 నామినేషన్ దాఖలు అయ్యాయి. మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో నామినేషన్లు స్వీకరణ ప్రారంభం కాగా బుధవారం 15, గురువారం 44 నామినేషన్లు మొత్తం రెండు రోజుల్లో 59 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, తెలిపారు. తెలుగుదేశం పార్టీ నుండి 15 జనసేన పార్టీ నుండి, 12 వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుండి 30, స్వతంత్ర అభ్యర్థులుగా ఇద్దరు నామినేషన్లు దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన ఎన్నికల షెడ్యూల్ ప్రకారం నామినేషన్లను ఈనెల 23 సాయంత్రం 5.00 గంటల వరకు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. 24.వ తేది నామినేషన్ల పరిశీలన నిర్వహించబడుతుందని, 27.వతేది మధ్యాహ్నం 3.00 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుందని ఈసందర్భంగా తెలిపారు.

## గొల్లపల్లి ఎంపీటీసీ స్థానాలకు బీజేపీ అభ్యర్థుల నామినేషన్లు



ప్రజాభూమి ప్రతినిధి నూజివీడు

గొల్లపల్లి ఎంపీటీసీ స్థానాలకు బీజేపీ అభ్యర్థులుగా పల్లగాని బాలకృష్ణ (గొల్లపల్లి-1), పలగాని ధనలక్ష్మి (గొల్లపల్లి-2)నూజివీడులోని మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో)కార్యాలయంలో నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో ర్యాలీగా తరలివచ్చారు. పార్టీ శ్రేణుల ఉత్సాహం మధ్య నామినేషన్ కార్యక్రమం సందడిగా సాగింది. ర్యాలీ ఎంపీడీవో కార్యాలయం వెలుపలి వరకు కొనసాగగా, అభ్యర్థులతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు కార్యాలయం లోకి వెళ్లి నామినేషన్ ప్రక్రియలో పాల్గొన్నారు. గొల్లపల్లి--1 ఎంపీటీసీ స్థానం నుంచి పల్లగాని బాలకృష్ణ, గొల్లపల్లి--2 ఎంపీటీసీ స్థానం నుంచి పలగాని ధనలక్ష్మి బీజేపీ అభ్యర్థులుగా ఎన్నికల బరిలో నిలిచారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేయడం, గ్రామాల అభివృద్ధిలోభాగస్వాములు కావడం తమ లక్ష్యమని అభ్యర్థులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అభ్యర్థులు తమ రాజకీయ వైఖరిని స్పష్టం చేస్తూ, తెలుగుదేశం పార్టీకి తాము ఎటువంటి వ్యతిరేకం కాదని తెలిపారు. బీజేపీ తరఫున ఎంపీటీసీ ఎన్నికల్లో పోటీ చేసేందుకే నామినేషన్లు దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని అభ్యర్థులకు మద్దతు తెలిపారు.

### కూటమి విజయంతో

## నూజివీడు అభివృద్ధి వేగవంతం

• బిజెపి నేత మల్లెపూడి రాజశేఖర్



ప్రజాభూమి ప్రతినిధి నూజివీడు

నూజివీడు పట్టణాన్ని అన్నీ రంగాలలో అభివృద్ధి చెందేవిధంగా కూటమి ప్రభుత్వం పక్కా ప్రణాళికనురూపొందించిందని ప్రజలుఆశీర్వదించాలని బిజెపి సీనియర్ నాయకుడు,మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెపూడి రాజశేఖర్ కోరారు.కూటమి బలపర్చిన 33 వ వార్డు బిజెపి కౌన్సిలర్ అభ్యర్థిని మాగంటి వెంకటేశ్వరమ్మ ( వాణి టీచర్) , టీడీపీ చైర్మన్ అభ్యర్థి బర్రె ఇళయరాజా విజయాన్ని కాంక్షిస్తూ బిజెపి,కూటమి నాయకులతో కలిసి గురువారం ఆయన విస్తృతంగా ఇంటింటి ప్రచారంనిర్వహించారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి చిత్తశుద్ధితో పట్టణాన్ని అభివృద్ధి పర్చేందుకు అన్నీ విధాలా కృషి చేస్తున్నారని..ఇప్పటికే షుమారు 50 కోట్లతో ఇండోర్ స్టేడియం,పార్కులు, రహదారులు,పక్కా డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టారని మరో 150 కోట్లు అభివృద్ధి పనులకు అంచనాలను రూపొందించటం జరిగిందన్నారు,నిధులు మంజూరుకు గ్రీన్ సిగ్నల్ వచ్చిందన్నారు.రానున్న కాలంలో పారిశ్రామిక వృద్ధి,స్మార్ట్ సిటీ గా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వానికి మున్సిపల్ ఎన్నికలలో ప్రజలు ఓటు ద్వారా మద్దతు తెలపాలని రాజశేఖర్ కోరారు.చైర్మన్ అభ్యర్థి బర్రె ఇళయరాజా,కౌన్సిలర్ అభ్యర్థిని మాగంటి వెంకటేశ్వరమ్మ లను మంచి మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.ప్రచారంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు బోను అప్పారావు,శివరాజు వసుంధరాదేవి,ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మాగంటి వాసు మాస్టారు,ఓబీసీ మీడియా జిల్లా కన్వీనర్ మనూరి ప్రసాద్,పార్టీ సీనియర్ నాయకులు కంచర్ల కృష్ణ, డాక్టర్ రామారావు పట్టణ ప్రధానకార్యదర్శులు దోసపాటి మల్లికార్జున జగదీశ్,దద్దనాల రవికిశోర్,చట్రాతి సూర్యప్రకాష్ కుమార్,మైనార్టీ మోర్చా పట్టణ అధ్యక్షురాలు షేక్ బాజీమా కూటమి నాయకులు,స్థానికులు పాల్గొన్నారు.

## వేలేరుపాడులో హోరాహోరీగా నామినేషన్లు

• కూటమి ఆధ్వర్యంలో 7, ప్రజా పందా 3 నామినేషన్లు దాకాలు



ప్రజాభూమి ప్రతినిధి వేలేరుపాడు

వేలేరుపాడు లో రెండవ రోజు గురువారం హోరాహోరీగా నామినేషన్ల పర్వం కొనసాగింది. కూటమి ఆధ్వర్యంలో 7 నామినేషన్లు సిపిఐ ఎంఎల్ ప్రజా పందా 3, కాంగ్రెస్ 2, సీపీఎం 1 మొత్తం 13 నామినేషన్లు వేయటం జరిగిందని రిటర్నింగ్ అధికారి శేఖర్ దొర పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్ బాబు ఉండగా, ఎస్సై నవీన్ కుమార్ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. నామినేషన్ లో అనంతరం ప్రజాపంద ఆధ్వర్యంలో రామవరం నుంచి వేలేరుపాడు వరకు వందలాది మంది కార్యకర్తలతో డప్పు డాన్సులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ఎమ్మెల్యేగా పనిచేసిన గుమ్మడి నరసయ్య తోపాటు ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు విరివిగా పాల్గొన్నారు.

## యనమందల ఎంపీటీసీ స్థానానికి టీడీపీ అభ్యర్థిగా బరోతూ అంజి నామినేషన్ దాఖలు



ప్రజాభూమి ప్రతినిధి నూజివీడు

యనమందల ఎంపీటీసీ స్థానానికి తెలుగు దేశం పార్టీ (టీడీపీ) కూటమి అభ్యర్థిగా బ రోతూ అంజి (తండ్రి శివాజీ) నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ కార్యక్రమం సందర్భంగా ఏలూరు జిల్లా టీడీపీ ఉపాధ్య క్షుడు ముసునూరు రాజబాబు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమాను లు భారీ ర్యాలీగా తరలివచ్చారు. పార్టీ శ్రే ణుల నినాదాలు, కార్యకర్తల సందడితో నా మినేషన్ కార్యక్రమం ఉత్సాహంగా సాగిం ది. యనమందల పంచాయతీ పరిధిలోని యనమందల, బత్తులవారిగూడెం, రేగుంట గ్రామాల ప్రజలు తనకు మద్దతుగా నిలిచి, తెలుగుదేశం పార్టీకి ఓటు వేసి గెలిపించాలని బరోతూ అంజి విజ్ఞప్తి చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు గ్రామాల అభివృద్ధికిప్రాధాన్యతనిస్తానని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి కార్యక్రమాల అమలుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రజల నమ్మకాన్నినిలబెట్టుకుంటూ, మూడు గ్రామాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు ముసునూరు రాజబాబు, బత్తుల మాధవరం, చింత సత్యనారాయణ, బూరుగు జోషి, బత్తులవారిగూడెం టీడీపీ అధ్యక్షుడు పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చి బరోతూ అంజికి మద్దతు తెలిపారు.యనమందల ఎంపీటీసీ స్థానానికి బరోతూ అంజి నామినేషన్ దాఖలు చేసిన సందర్భంగా నిర్వహించిన భారీ ర్యాలీతో ఆయా గ్రామాల్లో ఎన్నికల సందడి నెలకొంది. పార్టీనాయకులు, కార్యకర్తల సమక్షంలో ఆయన నామినేషన్ కార్యక్రమం నిర్వహించారు.

## కాజులూరు వైకాపా జెడ్పీటీసీ అభ్యర్థిగా జయప్రద నామినేషన్ దాఖలు

ప్రజాభూమి ప్రతినిధి,కాజులూరు



కాజులూరు మండలం వైకాపా జడ్పిటిసి అభ్యర్థిగా గొల్లపాలెం గ్రామానికి చెందిన దాకారపు ఎలిజిబెత్ జయప్రద తమ నామినేషన్ దాఖలు చేశారు. కాకినాడ జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్ల ప్రక్రియ ఊపందుకుంది. కాకినాడ జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో జెడ్పీటీసీ స్థానాలకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించారు. కాజులూరు మండలం నుంచి వైఎస్సార్సీపీ జడ్పీటీసీ అభ్యర్థినిగా దాకారపు ఎలిజిబెత్ జయప్రద, పలువురు వైకాపా శ్రేణులతో కలసి వెళ్ళి తమ నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో గొల్లపాలెం మాజీ సర్పంచ్ కొప్పుల సత్యనారాయణ (సత్తిబాబు ) సత్తి గంగా భవాని, తదితరులు పాల్గొన్నారు.

## రెండవ రోజు దాఖలైన 42 ఎంపీటీసీ నామినేషన్లు

ప్రజాభూమి,బుట్టాయగూడెం



బుట్టాయిగూడెం మండల ప్రాదేశిక నియోజకవర్గ ఎన్నికల నామినేషన్ స్వీకరణ ప్రక్రియలో రెండవ రోజు 42 నామినేషన్లు దాఖలైనట్లు అధికారులు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఏవి. సుబ్బరాయన, ఎంపీడీవో కె.జ్యోతి, తహసిల్దార్ ప్రమద్వర ఎంపీటీసీ అభ్యర్థుల నుండి నామినేషన్లను స్వీకరించారు. రెండవ రోజు గురువారం సాయంత్రం 6 గంటలకు 20 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను అధికారులకు సమర్పించారు. వీటిలో తెలుగుదేశం పార్టీ - 8, వైసీపీ - 8, జనసేన - 3, ఇండిపెండెంట్ - 1 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుబ్బరాయన తెలిపారు. మరో 22 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను అందజేయడానికి కార్యాలయంలో సిద్ధంగా ఉన్నారు. వీరందరి వద్ద నుండి నామినేషన్లను స్వీకరించడానికి ఏర్పాట్లు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ఎస్సై పి. చెన్నారావు ఆధ్వర్యంలో సిబ్బంది నామినేషన్ కేంద్రం వద్ద బందోబస్తు నిర్వహించారు.

## ఎంపీటీసీ ఎన్నికలకు నామినేషన్ల జోరు



ప్రజా భూమి ప్రతినిధి, ఆగిరిపల్లి

ఆగిరిపల్లి మండల పరిషత్ ఎన్నికలకు సంబంధించి గురువారం మొత్తం 41 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఈ.బి. విలియమ్స్ తెలిపారు. వీటిలో తెలుగుదేశం పార్టీ తరఫున 13 మంది, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున 21 మంది, జనసేన పార్టీ తరఫున ఆరుగురు, స్వతంత్ర అభ్యర్థిగా ఒకరు నామినేషన్లు సమర్పించినట్లు వెల్లడించారు. మండలంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఎన్నికల సంఘం నిబంధనల మేరకు కొనసాగుతోందని, అభ్యర్థులు నిర్ణీత గడువులోగా తమ నామినేషన్లను దాఖలు చేయాలని రిటర్నింగ్ అధికారి తెలిపారు.

## రామచంద్రపురంలో సాయినాధునికి లక్ష బిల్వార్చన



ప్రజాభూమి ప్రతినిధి, రామచంద్రపురం

రామచంద్రపురం పట్టణం ముచ్చిమిల్లి గ్రామంలో వేయించేసియున్న శ్రీ సాయి బాబా వారి ఆలయంలో గురువారం ఏకాదశి పురస్కరించుకుని శ్రీ సాయి నాధుని సమాధి మహోత్సవం సందర్భంగా ఆలయ అర్చకులు గాడేపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్వామి వారికి లక్షబిల్వార్చన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## వేలేరుపాడు జడ్పిటిసి స్థానానికి కూటమి అభ్యర్థిగా గొంది సీత నామినేషన్



ప్రజాభూమి ప్రతినిధి వేలేరుపాడు

సిపిఐ, జనసేన, బీజేపీ పార్టీలు బలపరచిన వేలేరుపాడు మండల టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థిగా గోంది సీత ఏలూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో గురువారం నామినేషన్ దాఖలు చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో తెదేపా మండల పార్టీ అధ్యక్షులు అమరవరపు అశోక్, సిపిఐ పార్టీ పోలవరం నియోజకవర్గం కార్యదర్శి కారం దారయ్యు, తెదేపా ఎస్టీ సెల్ రాష్ట్ర మాజీ కార్యదర్శి గోంది నాగేశ్వరరావు, ఐటీడీపీ ఏలూరు పార్లమెంట్ అధ్యక్షుడు శావిలి సుభాష్ చంద్రబోస్, గోంది దీపిక, తాటి హనుమంతు, గోంది శివాజీ, పోట్ల వీరభద్రు, సయ్యద్ వలీ తదితరులు పాల్గొన్నారు.

## పెదపాడు జడ్పీటీసీ అభ్యర్థిగా చౌటపల్లి విక్రమ్ కిషోర్ నామినేషన్

ప్రజా భూమి ప్రతినిధి పెదపాడు.



దెందులూరు నియోజకవర్గం పెదపాడు మండల జడ్పీటీసీ అభ్యర్థిగా కూటమి నాయకులు బలపరిచిన అభ్యర్థి చౌటుపల్లి విక్రమ్ కిషోర్ గురువారం ఏలూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు.ఈ సందర్భంగా విక్రమ్ కిషోర్ మాట్లాడుతూ దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కు తనకు అవకాశం కల్పించాలని తెలియజేశారు కూటమి నాయకుల సారథ్యంలో జడ్పీటీసీగా పోటీ చేస్తున్నట్లు తెలిపారు.తనకు అభ్యర్థిగా అవకాశం కల్పించిన కూటమి నాయకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.తనను గెలిపిస్తే పెదపాడు మండలంలోని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని,ప్రజా సంక్షేమానికి పాటుపడతానని పేర్కొన్నారు.

# ప్రజాభూమి

జనరల్ 14

శుక్రవారం 23 అక్టోబర్ 2026




## కృష్ణారావు పాలెంలో వైసిపికి భారీ షాక్

- జనసేన పార్టీలో చేరిన 50 కుటుంబాలు
- జనసేన తీర్థం పుచ్చుకున్న వైసిపి మాజీ ఎంపీటీసీ చింతగుంట్ల వెంకటేశ్వరరావు

ప్రజా భూమి ప్రతినిధి - చాట్రాయి

చాట్రాయి మండలం కృష్ణారావు పాలెం గ్రామం మాజీ ఎంపీటీసీ మాజీ మండల వైఎస్ఆర్సిపి యువజన విభాగం అధ్యక్షుడు చింత గుంట్ల వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో జనసేన పార్టీ ఉమ్మడి కృష్ణాజిల్లా అధికార ప్రతినిధి నూజివీడు నియోజకవర్గ సమన్వయకర్తలు మరీదు శివరామకృష్ణ , జనసేన పార్టీ నాయకులు బర్మా.ఫణిబాబు సమక్షంలో 50 కుటుంబాలు గురువారం పార్టీ లో చేరారు.జనసేన పార్టీ అధినేత ,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలు, గ్రామాల అభివృద్ధి కి ఆయన చేస్తున్న కృషి నచ్చి జనసేన పార్టీలో జాయిన్ అయినట్లు మాజీ ఎంపీటీసీ చింత గుంట్ల .వెంకటేశ్వరావు తెలిపారు. పార్టీలో చేరిన అయన కుటుంబాలలో మాజీ విద్యా కమిటీ చైర్మన్ కల్లేపల్లి వెంకటేశ్వరరావు (బాలు) ,మవిత జీవరత్నం, చింతగుంట్ల నాగేశ్వరరావు, చింతకుంట్ల చిన్న రంగయ్య, దొంత మల్లికార్జునరావు, చింతకుంట్ల శ్రీనివాసరావు, పుచ్చకాయల మహేష్, చింతకుంట్ల రామకృష్ణ, ఆదిలక్ష్మి ,చింతకుంట్ల రంగయ్య ,నందిపోము ఆనందరావు ,తడికిమళ్ళ ప్రవీణ్, కల్లేపల్లి కుమారి, కల్లేపల్లి పద్మ ,పుచ్చకాయల పద్మ తదితర కుటుంబాలు జనసేన పార్టీలో చేరారు.

## చిత్తపూరు ఎంపీటీసీకి లిబరేషన్ కలపాల జ్యోతి నామినేషన్



ప్రజా భూమి ప్రతినిధి - చాట్రాయి

చాట్రాయి మండలం చిత్తపూరుఎంపీటీసీ జనరల్ మహిళ స్థానానికి సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకురాలు కలపాలజ్యోతి గురువారంనామినేషన్ దాఖలు చేశారు. ఏలూరు జిల్లా కార్యదర్శి డి పుల్లారావు జిల్లా కమిటీ సభ్యులుచాట్లబాబూరావుమండలకార్యదర్శి కలపాల వెంకటేశ్వరరావు బలపరిచారు. రాష్ట్ర కమిటీ సభ్యులు డి హరినాథ్ పరికల కళావతి వేముల బక్కయ్య దుర్గం పూజిత భవాని మద్దత్తు తెలియజేశారు. స్థానిక సంస్థలను బలోపేతం చేయవలసిన ఆవశ్యకత నేడు ఎంతో ఉందని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఎన్డీఏ పాలన రెడ్ బుక్కు రాజ్యాంగం సాక్షి గా వేధింపుల పర్వం కొనసాగుతుందన్నారు. సుప్రీంకోర్టు సైతం మున్సిపల్ ఎన్నికలు వాయిదా వేయటం రాష్ట్రంలో దిగజారిన శాంతి భద్రతలను తెలియజేస్తునదని హరినాథ్ విమర్శించారు.గ్రామీణ ప్రాంతంలో పారిశుధ్యంకొరవడింద న్నారు. ఎల్ నినో పరిస్థితిలో తాగటానికి నీరు కూడా కొరవైంది. గ్రామీణ ప్రాంత రోడ్లు పట్టించుకునే నాధుడే లేడు. పేదల కోసం నిత్యం పనిచేసే అభ్యర్థులను మూడు నక్షత్రాల జెండ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు.

## స్థానిక సంస్థల ఎన్నికలను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

- క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకులు నాగలక్ష్మి
- సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశం
- నామినేషన్, పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘా తప్పనిసరి

ప్రజాభూమి ప్రతినిధి,నందిగామ/ తిరువూరు

మున్సిపల్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, నిష్పక్షపాతంగా, అత్యంత పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకులు నాగలక్ష్మి ఆదేశించారు. తిరువూరు, కంచికచర్ల, వీరులపాడు, నందిగామ తదితర ప్రాంతాల్లో గురువారం జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకులు నాగలక్ష్మి.ఎస్, విస్తృతంగా పర్యటించి, క్షేత్రస్థాయిలో ఎన్నికల ఏర్పాట్లను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా నామినేషన్ కేంద్రాలు, సీసీటీవీల పనితీరు, మౌలిక వసతులు, సిబ్బంది నియామక వివరాలను సమీక్షించారు. ఎన్నికల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీస్, రెవెన్యూ యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లాలోని సమస్యాత్మక, అతి సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి అదనపు పోలీస్ బలగాలను మోహరించాలన్నారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రాలు, పోలింగ్ బూత్‌లు, కౌంటింగ్ కేంద్రాల వద్ద విస్తృతంగా సీసీ కెమెరాలతో పాటు వీడియో చిత్రీకరణ ఏర్పాట్లు చేయాలన్నారు. బాధ్యతల నిర్వహణలో ఎటువంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలి. అర్హులైన ప్రతి ఓటరు ఎటువంటి భయాందోళనలు లేకుండా, ప్రశాంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అన్ని సౌకర్యాలు కల్పించాలి. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో సంపూర్ణ విశ్వాసం పెంపొందించేలా అధికారులు పనిచేయాలని స్పష్టం చేశారు.

# పాలకొల్లులో వైసీపీకి మరో షాక్

- మాజీ ఎంపీపీ కనకలక్ష్మి, మాజీ ఎంపీటీసీ ఏడుకొండలు టీడీపీలో చేరిక

ప్రజాభూమి ప్రతినిధి,పాలకొల్లు

నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి వరుస ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. రెండు రోజుల క్రితం చింతపర్రు గ్రామంలో 50కిపైగా కుటుంబాలు వైసీపీకి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీలో చేరగా.. తాజాగా పాలకొల్లు మండల మాజీ ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి, మాజీ ఎంపీటీసీ చిట్టూరి ఏడుకొండలుతో పాటు పలువురు నాయకులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. పాలకొల్లులోని మంత్రి కార్యాలయం వద్ద గురువారం మంత్రి నిమ్మల రామానాయుడు సమక్షంలో వారు పసుపు కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా కనకలక్ష్మి, ఏడుకొండల దంపతులను పార్టీ కండువాలు కప్పి మంత్రి సత్కరించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, మంత్రి నిమ్మల రామానాయుడు పనితీరుకు ఆకర్షితులై టీడీపీలో చేరినట్లు ఏడుకొండలు తెలిపారు. వైసీపీలో సుమారు 16 ఏళ్లపాటు కష్టపడి పనిచేసినా తగిన గుర్తింపు లభించలేదని, ఆక్వా వ్యాపారాన్ని సైతం వదులుకొని



ఆర్థికంగా నష్టపోయానని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం వంటి సంక్షేమ పథకాలు, పాలకొల్లు అభివృద్ధికి మంత్రి చేస్తున్న కృషిని గుర్తించి టీడీపీలో చేరినట్లు వెల్లడించారు. పార్టీ సీనియర్ నాయకులు, కూటమి శ్రేణులను కలుపుకొని పనిచేస్తానన్నారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ.. వైసీపీలో సుదీర్ఘకాలం పనిచేసిన ఏడుకొండలు, కనకలక్ష్మి దంపతులు టీడీపీలో చేరడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పాలకొల్లు నియోజకవర్గాన్ని అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిపేందుకు గత రెండున్నరేళ్లలో కోట్లాది రూపాయల నిధులు తీసుకొచ్చినట్లు తెలిపారు. భవిష్యత్తులోనూ మరిన్ని నిధులు సాధించి గ్రామాలు, పట్టణ వార్డుల్లో పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేపడతామన్నారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజల రుణం తీర్చుకునేలా అహర్నిశలు పనిచేస్తున్నానని చెప్పారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అందిస్తున్న పాలనను చూసి వైసీపీ నాయకులు టీడీపీలో చేరడం శుభపరిణామమన్నారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ మాట్లాడుతూ.. వైసీపీలో కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు లభించకపోగా, పార్టీ కారణంగా ఆర్థికంగా నష్టపోయిన ఏడుకొండలు దంపతులు టీడీపీలో చేరడం సమంజసమన్నారు. కనకలక్ష్మి మాట్లాడుతూ తాను ఎవరినీ విమర్శించదలచుకోలేదని, వైసీపీలో తగిన గౌరవం లభించకపోవడంతో పాటు ఎంతో నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లు టీడీపీ అధ్యక్షుడు పాముల రజనీకుమార్, నాయకులు మేడిది డేవిడ్ జాన్‌రాజు, పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు, మామిడిశెట్టి పెద్దిరాజు, కడలి గోపాలరావు, ఆరుమిల్లి చిన్ని, బోనం నాని, పొట్నూరి శ్రీనివాస్, బిరుదుకోట శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# హింస రాజకీయాలే గొడ్డలి పార్టీ దినచర్య

- స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకునేందుకు కుట్రలు, దాడులకు పాల్పడుతున్న వైసీపీ
- ఎన్నికలు జరగకపోతే 16వ ఆర్థిక సంఘం నిధులు కోల్పోయే ప్రమాదం
- పక్క రాష్ట్రాల నుంచి కిరాయి గూండాలను రప్పించి ఎన్నికలను హింసాత్మకంగా మార్చేందుకు కుట్రలు పన్నుతున్నారు
- సుప్రీంకోర్టు ఆదేశాలను వక్రీకరిస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నారు
- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా జరగకుండా అడ్డుకోవడమే లక్ష్యంగా గొడ్డలి పార్టీ నిత్యం అరాచకాలు, దాడులు, రక్తపాతానికి తెగబడుతోందని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నేడు మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు సకాలంలో నిర్వహించకపోతే 16వ ఆర్థిక సంఘం ద్వారా రాష్ట్రానికి రావాల్సిన ?12,500 కోట్ల భారీ నిధులు శాశ్వతంగా నిలిచిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి విధ్వంసం చేస్తే, సీఎం చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వ



సహకారంతో రూపాయి రూపాయి పోగేసి రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్నారని తెలిపారు. ఋషులు యజ్ఞం చేస్తుంటే రాక్షస మూకలు భగ్నం చేయాలని చూసినట్లు, కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి యజ్ఞాన్ని అడ్డుకునేందుకు వైసీపీ కోర్టుల్లో కేసులు వేసి కుట్రలు పన్నిందని, అవి ఫలించకపోవడంతో నేడు నేరుగా హింసకు తెరలేపిందని మండిపడ్డారు. ఎన్నికల ప్రక్రియను భగ్నం చేసేందుకు పంజాబ్, ఇతర రాష్ట్రాల నుంచి కిరాయి రౌడీలు, షార్ప్ షూటర్లను రప్పించి పుంగనూరు, కడప, రాయచోటి ప్రాంతాల్లో భయానక వాతావరణం సృష్టిస్తున్నారని పట్టాభిరామ్ ఆరోపించారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్ రెడ్డి, అవినాష్ రెడ్డి అండతో చిత్తూరులో నడవలేని స్థితిలో వాకర్ సాయంతో నామినేషన్ వేయడానికి వచ్చిన వృద్ధ మహిళా అభ్యర్థిపై సైతం దాడి చేసి పత్రాలు లాక్కోవడం గొడ్డలి పార్టీ రాక్షసత్వానికి పరాకాష్ఠ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. నామినేషన్లు వేయనివ్వడం లేదంటూ సుప్రీంకోర్టు, ఈసీల వద్ద గగ్గోలు పెడుతున్న వైసీపీ నేతల మాటలకు, క్షేత్రస్థాయి గణాంకాలకు అసలు పొంతన ఉందా అని నిలదీశారు. 100 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఏకంగా 23 వేలకు పైగా నామినేషన్లు దాఖలయ్యాయని, సీఎం సొంత నియోజకవర్గం కుప్పం, డిప్యూటీ సీఎం నియోజకవర్గాల్లో కూడా వైసీపీ అభ్యర్థులు స్వేచ్ఛగా నామినేషన్లు వేశారని గుర్తుచేశారు. నామినేషన్ల గణాంకాలను స్వయంగా మీడియా ముందుంచిన పట్టాభిరామ్.. ఎంపీటీసీ మొదటి రోజు మొత్తం 9,829 స్థానాలకు గాను 5,267 నామినేషన్లు పడితే, అందులో టీడీపీ 2,719, గొడ్డలి పార్టీ తరపున 1,918 నామినేషన్లు దాఖలయ్యాయని తెలిపారు. ప్రభుత్వం అడ్డుకుంటే తొలిరోజే 1,918 నామినేషన్లు ఎలా వేశారో చెప్పాలన్నారు. 659 జెడ్పీటీసీ స్థానాలకు మొదటి రోజు 409 నామినేషన్లు పడితే టీడీపీ 128 దాఖలు చేయగా, గొడ్డలి పార్టీ తరపున టీడీపీ కంటే 64 ఎక్కువగా 192 నామినేషన్లు ఫైల్ అయ్యాయని స్పష్టం చేశారు. ఇంత భారీగా నామినేషన్లు వేసి కూడా దాడులు చేస్తున్నారంటూ మొసలి కన్నీరు కారుస్తున్నారని ఎద్దేవా చేశారు. 2020-21 వైసీపీ పాలనలో నాటి ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ కేంద్ర హోం శాఖకు లేఖ రాస్తూ.. 25 శాతం ఎంపీటీసీలు (2,362 స్థానాలు), 20 శాతం జెడ్పీటీసీలు (126 స్థానాలు) బలవంతపు ఏకగ్రీవాలు చేశారని, తన ప్రాణాలకు రక్షణ కావాలని కోరింది నిజామా కాదా అని జగన్మోహన్ రెడ్డిని నిలదీశారు. నాడు "ఎన్నికల కమిషన్ ఎందుకు? ప్రభుత్వమే నిర్వహించుకుంటుంది" అన్న జగన్ రెడ్డి, నేడు ఏ ముఖం పెట్టుకుని ఎన్నికల సంఘం మెట్లు ఎక్కుతున్నారని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులను సైతం వక్రీకరిస్తూ ఎన్నికలు వాయిదా పడ్డాయని వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆయన మండిపడ్డారు. పిటిషనర్ ఇచ్చిన వినతిపత్రాలను పరిశీలించి ఎన్నికల కమిషనే స్వయంగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు (డ్రా బీ.డీ. 37476/2026) స్పష్టంగా ఆదేశించిందని ఆర్డర్ కాపీని ప్రదర్శించారు. కోర్టు ఆదేశాల మేరకు అభ్యర్థుల తుది జాబితా ప్రకటనకు రెండు రోజుల గడువు తీసుకున్న రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం సంపూర్ణంగా గౌరవిస్తుందని, స్వాగతిస్తుందని తెలిపారు.

# దీపావళి బాణాసంచా తయారీ, నిల్వ, విక్రయాలలో భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలి

- అక్టోబర్ 31వ తేదీలోగా లైసెన్సుల రెన్యువల్, తాత్కాలిక విక్రయ కేంద్రాల అనుమతుల కోసం దరఖా స్తులు స్వీకరణ
- నవంబర్ 4వ తేదీ నాటికి అనుమతుల జారీ ప్రక్రియ పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

ప్రజాభూమి ప్రతినిధి,కాకినాడ

దీపావళి పండుగ సందర్భంగా బాణాసంచా తయారీ, నిల్వ,విక్రయాలు, వినియోగం లో ఎలాంటి ప్రమాదాలు చోటు చేసు కోకుండా సంబంధిత శాఖల అధికారులు పటిష్టమైన ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ లో దీపావళి బాణాసంచా తయారీ యూనిట్లు,విక్రయ కేంద్రాలు,నిల్వకు సంబంధించిన లైసెన్సుల జారీ,రెన్యువల్ ప్రక్రియ, భద్రతా ఏర్పాట్ల సన్నద్ధత పై వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులతో జిల్లా కలెక్టర్ అసిస్టెంట్ కలెక్టర్ ప్రియా తో కలసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దీపావళి పండుగ బాణా సంచా నేపథ్యం లో దీపావళి బాణాసంచా తయారీ యూనిట్లు,విక్రయ కేంద్రాలు,నిల్వకు సంబంధించిన లైసెన్సుల జారీ,రెన్యువల్ ప్రక్రియ, భద్రతా ఏర్పాట్లు ప్రజల ప్రాణాలు,ఆస్తుల రక్షణ కు అత్యంత ప్రాధాన్యతనిస్తూ అన్ని శాఖలు సమన్వయం తో పనిచేయాలని సూచిం చారు. గతంలో చోటు చేసుకున్న ప్రమాదాలు పునరావృతం కాకుండా భద్రతా ప్రమాణాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. జిల్లా లో సుమారు 20 ఎల్ఈ-1 బాణాసంచా తయారీ యూనిట్లు ఉన్నాయని, ఆయా యూనిట్ల లైసెన్సుల రెన్యువల్ విషయంలో నిర్దేశిత నిబంధనలు, న్యాయస్థానాల ఆదేశాలను ఖచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.అన్ని భద్రతా ప్రమాణాలను పాటించిన యూనిట్లకు మాత్రమే నిబంధనల మేరకు లైసెన్సుల రెన్యువల్‌కు అనుమతులు మంజూరు చేయాలని,భద్రతా లోపాలు ఉన్న యూనిట్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ అను మతులు పునరుద్ధరించ రాదని స్పష్టం చేశారు. బాణాసంచా తయారీ కేంద్రాలు,గోదాములు,




విక్రయ కేంద్రాల్లో సం బంధిత అధికారులు సంయుక్త తనిఖీలు నిర్వ హించాలని సూచించారు. పోలీసు, అగ్నిమాపక, రెవెన్యూ, వాణిజ్య పన్నులు, మున్సిపల్, పరిశ్రమల శాఖల అధికారులు సమన్వయం తో తనిఖీలు చేపట్టి, నిబంధనలకు అనుగుణంగా ఉన్న ప్రాంతా ల్లోనే విక్రయాలకు అనుమ తులు జారీ చేయాలన్నారు.

**తాత్కాలిక విక్రయ కేంద్రాలకు లైసెన్సుల మంజూరు కొరకు సింగిల్ విండో విధానం**

దీపావళి సందర్భంగా తాత్కాలిక బాణాసంచా విక్రయ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ,పరిశీలన, అనుమతుల జారీ ప్రక్రియను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అక్టోబర్ 31వ తేదీలోగా లైసెన్సుల రెన్యువల్, తాత్కాలిక విక్రయ కేంద్రాల అనుమతుల కోసం దరఖా స్తులు స్వీకరించి,నవంబర్ 4వ తేదీ నాటికి అనుమతుల జారీ ప్రక్రియ పూర్తి చేయాలని నవంబర్ 6, 7, 8 తేదీలలో ఉదయం 8 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు విక్రయాలు నిర్వహించాలని సూచించారు. తాత్కాలిక లైసెన్సుల జారీకి సింగిల్ విండో విధానాన్ని అమలు చేయాలని, సంబంధిత శాఖల అనుమతులు,తనిఖీలను సమన్వ యంతో పూర్తి చేయాలని ఆదేశించారు. బాణా సంచా విక్రయాల కోసం ఎంపిక చేసే ప్రాంతాల్లో ప్రజలకు, వాహన రాక పోకలకు పార్కింగ్ వంటి ఇబ్బందులు కలగకుండా,ట్రాఫిక్ రద్దీ మరియు శాంతిభద్రతల సమ స్యలు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయా లన్నారు. విక్రయ కేంద్రాల వద్ద నిల్వ చేయనున్న బాణాసంచా పరిమాణం వివరాలను ముందుగానే సేకరించి,అనుమతించిన పరిమితులకు అనుగుణం గా నిల్వ ఉండేలా పర్య వేక్షించాలని తెలిపారు. నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం విక్రయాలు నిర్వహించేలా నిబంధన లకు అనుగుణంగా తాత్కాలిక లైసెన్సులు జారీ చేయాలని అధికారులకు సూచించారు.

**అగ్నిమాపక, విద్యుత్, అత్యవసర వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి**

బాణాసంచా తయారీ కేంద్రాలు, గోదాములు, విక్రయ దుకాణాల్లో అగ్నిమాపక పరికరాలు, ఇసుక, నీటి వసతి అందుబాటులో ఉండేలా చూడాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌ల వల్ల ప్రమాదాలు జరగకుండా వైరింగ్, విద్యుత్ కనెక్ష న్లను తనిఖీ చేయాలని, విద్యుత్ తీగలు వేలాడ కుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. దీపావళి రోజుల్లో అగ్నిప్ర మాదాలుసంభవించినప్పుడు తక్షణమే స్పందించేలా రద్దీ ప్రాంతాల్లో అగ్ని మాపక వాహనాలు, సిబ్బందిని అప్రమత్తంగా ఉంచాలని అగ్నిమాపక శాఖ అధికారులను ఆదేశించారు.ప్రమాదాల్లో గాయపడిన వారికి వెంటనే వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన ఏర్పాట్లు చేయాలని వైద్య ఆరోగ్య శాఖకు సూచిం చారు.అనుమతులు లేని ప్రదేశాల్లో బాణాసంచా తయారీ, నిల్వ, విక్రయాలు జరగకుండా నిరంతర తనిఖీలు నిర్వహించాలని స్పష్టం చేశారు. దీపావళి పండుగను సురక్షితంగా,ప్రశాంత వాతావరణంలో జరుపు కోవడానికి ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. చిన్నారులు పెద్దల పర్యవేక్షణ లోనే బాణాసంచా కాల్చేలా తల్లి దండ్రులు చర్యలు తీసుకో వాలని, బహిరంగ ప్రదేశాల్లో మాత్రమే బాణాసంచా వినియో గించాలని సూచించారు. మండే స్వభావం కలిగిన వస్తువులు, ఇంధన నిల్వల సమీపంలో టపాసులు కాల్చకూడదని, పేలని బాణాసంచా ను తిరిగి వెలిగించే ప్రయత్నం చేయ కూడదని తెలిపారు. పర్యావరణానికి హాని కలిగించే, నిబంధనలకు విరుద్ధమైన బాణాసంచా విక్రయాలు, వినియోగంపై అధికారులు నిఘా ఉంచాలని ఆదేశించారు. అనుమతించిన శబ్ద పరిమితులు, వినియోగ సమయాలకు సంబంధిం చిన నిబంధనలను ప్రజలు తప్పనిసరిగా పాటించాలని, పర్యావ రణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ బాధ్యతా యుతంగా పండుగ జరుపుకోవాలని కోరారు. ప్రజలు,వ్యాపారులు, బాణాసంచా తయారీ దారులు సంబంధిత శాఖల అధికా రులకు సహకరించి, ప్రమాద రహిత దీపావళి నిర్వహణకు తోడ్పడాలని జిల్లా కలెక్టర్ పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ డి. తిప్పే నాయక్, ఆర్డీవోలు ఎస్. మల్లి బాబు, పి. కృష్ణమూర్తి, డీఎంహెచ్‌వో డాక్టర్ కె. అనితతో పాటు పోలీసు, అగ్నిమాపక, మున్సిపల్, పరిశ్రమల శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.